# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 12 సెప్టెంబరు 2024 వెల : రూ.15


తెలుగు భాషా దినోత్సవం : మెరుపులు - మరకలు

చింతనాత్మక రాజకీయాలు యేవీ?

సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం ప్రత్యామ్నాయ రాజకీయం అవసరం

పదునెక్కుతున్న మోదీ వ్యూహ ప్రతివ్యూహాలు

సెబీ చీఫ్ లాలూచీ బహిర్గతం

నాకిది.. నీకది మన రక్తంలోనే ఉందా?

కార్పొరేట్ల సంపద పున: పంపిణీకి ఉద్యమిద్దాం

ప్రభుత్వోద్యోగుల్ని ఆర్‌ఎస్ఎస్‌లో చేరేందుకు అనుమతించాలా?

భిన్నత్వంలోనే భారతీయత మూలాలు

పాఠ్య పుస్తకాల్లో పొలిటికల్ కూడికలు, తీసివేతలు

బౌద్ధ విగ్రహాల్నే కాదు, బోధి వృక్షాన్ని కూడా కొట్టేశారు !

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి నిర్మాణాత్మక సూచనలు

భారత స్వాతంత్ర్యోద్యమం : తెలంగాణ ముస్లిం యోధులు

తెలుగు సమాజ సాహిత్యాల ప్రయాణం ముందుకా, వెనక్కా ?

బురఖాలో కన్నీళ్లు 'పహెచాన్'

మార్క్సిస్టు మేధావి, చరిత్రకారుడు ఏటుకూరు బలరామమూర్తి

ప్రపంచ విప్లవోద్యమ చుక్కాని లెనిన్

సెప్టెంబరు - 2024

పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 12

డీవీవీఎస్ వర్మ

- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) తెలుగు భాషా దినోత్సవం.. మెరుపులు - మరకలు - సంపాదకీయం 3

2) చింతనాత్మక రాజకీయాలు యేవీ? - యోగేంద్ర యాదవ్ 4

3) సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం - డీవీవీఎస్ వర్మ 6

4) పదునెక్కుతున్న మోదీ వ్యూహ ప్రతివ్యూహాలు - ఎ.కృష్ణారావు 8

5) సెబీ చీఫ్ లాలూచీ బహిర్గతం - 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం 10

6) నాకిది.. నీకది మన రక్తంలోనే ఉందా? - రాహుల్ కుమార్ 12

7) ప్రభుత్వోద్యోగుల్నిఆర్ఎస్ఎస్‌లో చేరేందుకు అనుమతించాలా? 16

8) భిన్నత్వంలోనే భారతీయత మూలాలు - రొమిల్లా థాపర్ 17

9) పాఠ్య పుస్తకాల్లో పొలిటికల్ కూడికలు, తీసివేతలు - కొప్పర్తి వెంకటరమణమూర్తి 19

10) బౌద్ధ విగ్రహాల్నే కాదు, బోధి వృక్షాన్ని కూడా కొట్టేశారు ! - డాక్టర్ దేవరాజు మహారాజు 22

11) ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి నిర్మాణాత్మక సూచనలు - వడ్డే శోభనాద్రీశ్వరరావు 24

12) భారత స్వాతంత్ర్యోద్యమం : తెలంగాణ ముస్లిం యోధులు - ప్రతాపనేని రామకోటేశ్వరరావు 27

13) తెలుగు సమాజ సాహిత్యాల ప్రయాణం ముందుకా, వెనక్కా? -ఎన్.వేణుగోపాల్ 30


14) బురఖాలో కన్నీళ్లు 'పహెచాన్' - రాఘవ 31

15) మార్క్సిస్టు మేధావి, చరిత్రకారుడు ఏటుకూరు బలరామమూర్తి - టి.రవిచంద్ 33

16) ప్రపంచ విప్లవోద్యమ చుక్కాని లెనిన్ - మల్లేపల్లి లక్ష్మయ్య 41

17) కార్టూన్స్ 43

18) కొత్త పుస్తకాలు స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

## దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



సంపాదకీయం

# తెలుగు భాషా దినోత్సవం మెరుపులు - మరకలు

ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాలు రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు దేశ విదేశాలలో తెలుగు సమూహాలన్నీ ఘనంగా నిర్వహించాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, తెలుగు భాషా సాహిత్య సంస్థలు, ఇతర అనేక స్వచ్ఛంద సంస్థలు ఈ ఉత్సవాలను ఒకే వేడుకగా నిర్వహించి తెలుగు భాష మెరుపుల్ని చూపించారు. ఆగస్టు 29కి ఒక ప్రత్యేకత వుంది. వ్యావహారిక భాషా ఉద్యమ సారథి గిడుగు రామ్మూర్తి జయంతి. ఆయన పేరు మీదే తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. కనుమరుగవుతున్న గిడుగు పేరును అందరూ ఈ ఉత్సవాలలో స్మరించుకోవడం ఒక గొప్ప ఆహ్వానించదగ్గ పరిణామం. భాషా తత్వవేత్తగా పండిత భాషపై ధ్వజమెత్తిన గిడుగు అది జీవరహితమైన మృతభాషగా పేర్కొన్నాడు. తెలుగు నాట వ్యావహారిక భాషా ఉద్యమాన్ని సాగించి కృతక గ్రాంధిక సంకెళ్ల నుంచి తెలుగు భాషకు విముక్తి కల్పించాడు.

ఇప్పుడు మన పుస్తకాల భాష, పత్రికలు – ప్రసార మాధ్యమాల భాష, ప్రధాన స్రవంతి సాహిత్య ప్రక్రియల భాష అంతా గిడుగు ఉద్యమంపై పెట్టి భిక్షే. ఈ భాషా దినోత్సవాలలో గిడుగు పేరు ఉరుములు మెరుపులతో దశ దిశలా వ్యాపించడం, భవిష్యత్ భాషా పరిణామానికి గొప్ప ప్రేరణ ఇస్తుంది. తెలుగు ప్రజల మనోస్థితిలో తెలుగు భాష స్థానం నానాటికీ దిగజారుతోంది. మాతృభాష తల్లివంటిది. పరభాష పోతపాల వంటిదని చాలా దశాబ్దాల కిందట ప్రముఖ చరిత్ర పరిశోధకులు కొమర్రాజు లక్ష్మణరావు గారు అన్నారు. ప్రస్తుతం తల్లి పాల దినోత్సవం, మాతృ భాషా దినోత్సవాలు జరుపుకునే స్థితిలో పడ్డాం. ఇష్టపూర్వకంగా తల్లి పాలు పట్టే స్థితి తెలుగు భాష నేర్చుకునే స్థితి లేకుండా పోయింది. దాదాపు అన్ని ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టిన నాటి నుంచి చదువు పూర్తయ్యే వరకు తెలుగు జోలికి పోకుండా చేస్తున్నాయి. తల్లిదండ్రులు పరభాషా చదువులకే మొగ్గు చూపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా గత ప్రభుత్వం ఇంగ్లీషును బోధనా భాషగా మార్చింది.

ఈ ఉత్సవాలలో ఈ మరకలు మనకు కనపడకుండా పోయాయి. పిల్లల మనో వికాసానికి కనీసం ఐదో తరగతి వరకు మాతృభాషలోనే విద్యా బోధన జరగాలి. డిగ్రీ వరకు తెలుగులో విధిగా ఒక పరీక్ష పత్రం వుండి తీరాలి. తెలుగు రాష్ట్రాలలో పరిపాలనా భాష తెలుగే వుండాలి. ఈ భాషా దినోత్సవాలలో ఇలాంటి ప్రస్తావనలు కనిపించ లేదు. వినిపించ లేదు. ఇంగ్లీషు మీడియం పాఠశాలలు కూడా తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించాయి. ఆ పాఠశాలలకు తల్లిదండ్రులు పిల్లల్ని అలంకరించి పంపించారు. ఇలాంటి పాఠశాలల్లో పిల్లల్ని చదివిస్తున్న చాలామంది వక్తలు ప్రసంగాలు చేశారు. తెలుగు భాషపై ఇవన్నీ చిత్తశుద్ధి లేని శివ పూజలే. ❑

- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977

# చింతనాత్మక రాజకీయాలు యేవీ?



- యోగేంద్ర యాదవ్

**వికసిత్ భారత్ ! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోని ప్రధాన అంశాన్ని, స్వాతంత్ర్య శతాబ్ది (1947) భారత్ గురించిన ఆయన దార్శనికతను ఆ ఒక్క మాటలో సంక్షేపించి చెప్పవచ్చు. 'అభివృద్ధి చెందిన దేశంగా భారత్'.. ఇది బాగా అరిగిపోయిన మాట కాదూ? 1950 దశకం రాజకీయ వాగరిలోని ఆ భావన అప్పటి నుంచి ఇప్పటికీ రాజకీయవేత్తల, ముఖ్యంగా ప్రభుత్వాధినేతల నోట పదే పదే పునరుక్తమవుతూనే ఉంది. వినీ వినీ శ్రోతలు విసిగి వేసారిపోతున్నారు. అయినా రాజకీయ వేత్తలు ఆ మంత్రాన్ని జపిస్తూనే ఉన్నారు! దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అది కేవలం ఒక వాక్కూరుని మేధో పరిమితి మాత్రమే కాదు. సమస్త రాజకీయవేత్తల అహేతుక ఆలోచనా ధోరణి-కృశించిన లేదా క్షీణించిన రాజకీయ ఆలోచనా శక్తిని ప్రతిబింబిస్తోంది.**

వాస్తవమేమిటంటే అధికార పక్షాల నాయకులు మాత్రమే కాదు, భావజాలాలకు అతీతంగా ప్రతి ఒక్క రాజకీయుడికి 'అభివృద్ధి' అనేది ఒక ఊతపదమైపోయింది. పైగా ఆ లక్ష్య సాధనకు తమ నిబద్ధతను పదే పదే ఏకరువు పెడుతూ ప్రజలను వారు నిత్యం సతాయిస్తూనే ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం సంస్కృత భాష గురించి విఖ్యాత సంస్కృత విద్వాంసుడు Sheldon Pollock ఇప్పటికీ తరచు ఉదహరింపబడుతున్న ఒక వ్యాసాన్ని రాశారు అది: 'The Death of Sanskrit in 18th century India. సంస్కృతం మృతభాష అయిపోయిందని చెప్పడం ఆయన ఉద్దేశం ఎంత మాత్రం కాదు. ఆ పురాతన భారతీయ భాష తన ఉనికిని కొనసాగిస్తూనే ఉన్నది. ఇండియాలో యూరోపియన్ల వలస పాలన ప్రారంభమైన తరువాత భారతీయ నాగరికత మేధో వ్యాసంగాల, సాంస్కృతిక భావాల వ్యక్తీకరణకు సంస్కృతం ప్రధాన మాధ్యమంగా ఉండడం నిలిచిపోయిందని చెప్పడమే ఆ పాశ్చాత్య విద్వాంసుని అభిమతం. ఆ అభిప్రాయానికి సుదీప్త కవిరాజ్ ప్రతిస్పందిస్తూ 'The Sudden Death of Sanskrit knowledge. అనే వ్యాసాన్ని రాశారు. ఒక విశిష్ట చింతనా ధోరణి సంబంధమైన భావనాత్మక విశ్వం ఆకస్మికంగా అంతరించిపోయిందని కవిరాజ్ విశదీకరించారు.

సరిగ్గా అటువంటి విపరిణామమే మహోన్నత ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయానికి కూడా సంభవించింది. వలసపాలనా కాలంలోనూ, స్వాతంత్ర్య సాధన అనంతరమూ దేశ రాజకీయాలను సమున్నత విలువలతో తీర్చిదిద్దిన, అభివృద్ధి పరిచిన మహా ప్రశస్త రాజకీయ చింతనే ఆ సంప్రదాయమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సరే, ఇప్పుడు నైతిక రాజకీయాలు క్షీణించిపోవడాన్ని అందరూ గుర్తించారు, విమర్శిస్తున్నారు, వేదన చెందుతున్నారు. అయితే అంతకంటే శోచనీయమైన ఒక వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవడం లేదు : మన రాజకీయ దార్శనికత శుష్కించి పోయింది. రాజకీయ సంవాదాలు సంకుచితమవడమే కాదు, వికృతమూ అవుతున్నాయి. మన రాజకీయ వివేకం నిస్సారమై పోయింది. రాజకీయ నిర్ణయాలలో భావ దారిద్ర్యం, రాజకీయ కార్యాచరణలో మందకొడితనం, సాహసోపేత క్రియాశీలత కొరవడడం.. నిజంగా ఇదొక విషాద వాస్తవం. భారత పునరుజ్జీవన, జాతీయోద్యమ యుగ రాజకీయాలను తీర్చిదిద్దిన, సమున్నతపరిచిన భావాల వాహిని ఎండిపోయింది. ఈ పరిణామాన్ని ఆధునిక భారత రాజకీయ చింతన హఠాన్మరణమని మీరు భావించవచ్చు.

భావాల ప్రపంచంలో సంభవించిన అన్ని ఉద్యమాల విషయంలో మాదిరిగానే ఈ 'మరణం' ఎప్పుడు చోటు చేసుకున్నదో ఒక తేదీని కచ్చితంగా చెప్పలేము. అయితే వలస పాలనానంతర, అంటే స్వతంత్ర భారతావని మొదటి పాతికేళ్ల (1947-72)లోనే సంభవించిందని నిశ్చితంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్య ఉషోదయంలో క్రియాశీలంగా ఉన్న మన రాజకీయ చింతకులను, వారి భావ విస్తృతి, ప్రభావశీలతను గుర్తు చేసుకోండి. కేవలం గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లు మాత్రమే కాదు ఇంకా ఎంతోమంది ఉన్నారు. మన ఆలోచనలను విశాలం చేసిన తేజోమూర్తులు వారు. వారు విశ్వసించిన, ప్రతిపాదించిన భావజాలం ఏదైనా జాతి అభ్యుదయాన్ని మాత్రమే ఆ సమున్నతులు తమ దృష్టిలో ఉంచుకున్నారు. నవ్య మానవవాదాన్ని ప్రతిపాదించిన మానవేంద్రనాథ్ రాయ్, హిందూ చింతన, సంస్కృతిని మహోన్నత స్థాయికి తీసుకు వెళ్లిన జాతీయవాద ప్రవక్త శ్రీ అరబిందో అప్పటికి క్రియాశీల

రాజకీయాల నుంచి వైదొలిగారు. రాజకీయాలలో క్రియాశీలంగా ఉన్న వారిలో కాంగ్రెస్ నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్, సోషలిస్టు భావుకులు, పోరాటయోధులు ఆచార్య నరేంద్రదేవ, జయప్రకాష్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, కమ్యూనిస్టు నాయక దిగ్గజాలు ఎస్ఏ డాంగే, పిసి జోషి, సామాజిక న్యాయ పోరాటయోధుడు పెరియార్ రామస్వామి నాయకర్, స్వేచ్ఛా వాణిజ్య విధానాలను ప్రవచించిన సి.రాజగోపాలాచారి, హిందూ మతానికి ప్రాధాన్యమిచ్చిన వినాయక్ దామోదర్ సావర్కార్, ముస్లింల పక్షాన మాట్లాడిన మౌలానా మౌదూది ఆ తేజో మూర్తులలో కొందరు మాత్రమే.


ఆ ఉదాత్తుల భావాలు, ఆలోచనలతో మీరు అంగీకరించినా లేక విభేదించినా వారు ఉత్కృష్ట రాజకీయ తాత్త్వికులు అనే వాస్తవాన్ని మీరు నిరాకరించలేరు. అవును, వారు రాజకీయ క్రియాశీలురు. అయితే వారి రాజకీయ కార్యాచరణ భావి భారతీయ సమాజ నిర్మాణం గురించిన విశాల దార్శనికతతో ప్రేరణ పొందింది. సమున్నత లక్ష్యాలకు పరిపూర్ణంగా నిబద్ధమైన రాజకీయ కార్యాచరణ అది. దైనందిన రాజకీయాలలో పాల్గొంటూనే సర్వసాధారణమైన పాక్షికతలు, పక్షపాతాలకు అతీతంగా ఆలోచించారు. సమాజంతో సంభా షించారు. ప్రజలకు విపులంగా వివరించేందుకు తమ భావాలకు స్ఫూర్తిదాయకమైన అక్షర రూపమిచ్చారు. భారతదేశం, భారతీయుల బాగోగులే వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎల్లెడలా జరుగుతున్న సంఘటనలు, వాటి పూర్వాపరాలను సమగ్రంగా తెలుసుకునేవారు. చదవడం, రాయడం ఆంగ్లంలోనే అయినప్పటికీ భారతీయ భాషల మహోన్నత సాంస్కృతిక వారసత్వం, సాహిత్య వైభవం వారి మేధో కృషికి, సమాజ సేవా కార్యకలాపాలకు ఒక స్ఫూర్తిగా, ఆలంబనగా ఉండేవి. ఆధునికత, సంప్రదాయంపై వారు విశాల దృక్పథంతో భిన్న రీతుల్లో వివేచించారు. అయితే పూర్తిగా దేశీయ అంటే విలక్షణమైన భారతీయ ఆధునికత రూపుదిద్దుకోవడానికి సమష్టిగా దోహదం చేశారు ఆ దేశభక్తులు, మానవతావాదులు విశిష్టమైన రాజకీయ ఆలోచనల సంచయాన్ని సృష్టించారు. ఆ భావాల సంచయమే మన రాజ్యాంగాన్ని విశిష్టంగా రూపొందించింది. భిన్న భావజాలాలు ప్రభవించి వర్ధిల్లడానికి, విభిన్న రాజకీయ కార్యాచరణలకు ఆస్కారమిచ్చింది.

స్వతంత్ర భారతావని తొలి పాతికేళ్లలో ఈ మహోదాత్త రాజకీయ చింతనా సంప్రదాయం ఆకస్మికంగా అంతరించిపోయింది. 1970 దశకం తొలినాళ్లకు ప్రస్తావిత చింతకులు చాలా మంది కీర్తిశేషులయ్యారు. రాజకీయ చింతనలో రాజకీయ నాయకుల ప్రాబల్యం కొనసాగుతున్నప్పటికీ వారి ఆలోచనలు 1947లో ప్రజలకు మార్గదర్శకంగా ఉన్న రాజకీయ భావాలతో ఎంత మాత్రం పోల్చదగ్గవి కావు. వ్యక్తులుగా కూడా ఆ నేతలకు పాతతరం ఉదాత్తులకు మధ్య చాలా తేడా ఉన్నది. ఆ నాటికి సోషలిస్టు భావుకతలో ఇంకా మినుకు మినుకుమంటూ మిగిలి వున్నది లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవ' భావన మాత్రమే. చారు మజుందార్ సిద్ధాంతాలు మార్క్సిజంకు తుది సృజనాత్మక భాష్యాలు. వినోబాభావే చింతన ఏకపక్షమైనదే అయినప్పటికీ గాంధేయవాదులలో ఆయన ప్రముఖుడు. ఎమ్ఎస్ గోళ్వాల్కర్ 'హిందూత్వ' వాదాలను ప్రచారం చేస్తూనే ఉన్నారు. గ్రామీణ భారతదేశ అభ్యున్నతికి ఒక విశిష్ట కార్యక్రమాన్ని ప్రతిపాదించిన దార్శనికుడు చౌదరి చరణ్ సింగ్. ఈ జాబితా అసంపూర్ణమైనది. అయితే ప్రస్తావితులు అందరూ దేశ ప్రజలను ప్రభావితం చేసినవారనడంలో సందేహం లేదు.

ఇరవయో శతాబ్ది తుది సంవత్సరాలకు వచ్చేసరికి రాజకీయ క్రియాశీల–చింతకులు కూడా చాలా వరకు శాశ్వతంగా నిష్క్రమించారు. మిగిలి ఉన్న కిషెన్ పట్నాయక్, సచ్చిదానంద సిన్హా, రామ్‌దయాళ్ ముండా, ధరమ్‌పాల్, బిడి శర్మ ప్రధాన స్రవంతి రాజకీయాలకు వెలుపలే ఉండిపోయారు. అప్పటి నుంచి రాజకీయ కార్యాచరణలపై వివేచించిన, వాటిని ప్రభావితం చేసిన అర్థవంతమైన రాజకీయ చింతన ఏదీ మనకు లేకుండా పోయింది. రాజకీయ ఆలోచనా శక్తి క్షీణించిపోవడం, మరింత ధైర్యంగా, స్పష్టంగా ఆధునిక భారత రాజకీయ చింతన 'మరణం' గురించి మాట్లాడడమంటే రాజకీయ వ్యవహారాల గురించి నిశిత వివేచన చేసే ప్రశస్త మేధావులు, ఆలోచనాపరులు, రచయితలు మనకు ఇంకెంతమాత్రం లేరని చెప్తున్నట్టుగా భావించనవసరం లేదు. అటువంటి చింతకులు, భావుకులు ఉన్నారు. బహుశా ఇంతకు ముందు కంటే ఎక్కువ మందే ఉన్నారు. అయితే రాజకీయాలు, కనీసం వాటి సంకుచితార్థంలో సైతం వారి చింతనకు కేంద్రంగా లేవు. మన ఎరుక, అనుభవంలోకి వస్తున్న వర్తమాన రాజకీయ చింతనలోని ఏ స్రవంతిలోనూ మేధో కృషిని రాజకీయ కార్యాచరణలతో సంధాయకం చేసే ఒక సుసంగత సంభాషణ, ఒక శక్తిమంతమైన వాదన, ఒక అర్థవంతమైన చర్చ లేవు. అయితే ఇందుకు గౌరవప్రదమైన మినహాయింపులు లేకపోలేదు. అభివృద్ధి నమూనాపై నిశిత విమర్శలు, బహుళ ప్రత్యామ్నాయాల అన్వేషణ, స్త్రీవాద, అంబేద్కరైట్ శ్రేణులలో సందర్భానుసారమైన చర్చలు, వాదోపవాదాలు రాజకీయ చింతనా సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతున్నాయి. మొత్తం మీద రాజకీయ చింతన క్రమంగా విశ్వ విద్యాలయాలకు పరిమితమయింది. రజనీ కొఠారి, డిఎల్ సేథ్, ఆశీస్ నంది, పార్థా చటర్జీ, సుదీప్త కవిరాజ్, రాజీవ్ భార్గవ మొదలైన ప్రశస్త రాజకీయ సైద్ధాంతిక వేత్తలను మన విశ్వ విద్యాలయాలు సృష్టించాయి. అయితే వారి భావాలు రాజకీయ కార్యాచరణలను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పేందుకు **(మిగతా 11వ పేజీలో)**

# సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం

## ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం



- డీవీవీఎస్ వర్మ

**కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పాలక పక్షాల రాజకీయ విధానాలు సంక్షోభపు అంచుకు చేరుకున్నాయి. "అప్పులతో అభివృద్ధి-బడ్జెట్ పరిధిలో సంక్షేమం" అన్న విధానాల అమలుకు కాలం దగ్గర పడింది. ఇతరత్రా అదనపు నిధులు సమకూర్చుకునే దారులు మూసుకుపోతున్నాయి. ముందుగా కేంద్ర బడ్జెట్ ఇస్తున్న సంకేతాలను చూద్దాం. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 50 లక్షల కోట్లుగా వున్న అప్పులు 2025 నాటికి ఒక కోటి 82 లక్షల కోట్లకు చేరుకుంటుంది. దానికి చెల్లించాల్సిన వడ్డీ ఏటా 11 లక్షల కోట్లు. కేంద్ర బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపు దీనికే దక్కింది. ఈ ఏడాదికి కొత్తగా చేసే అప్పు 14 లక్షల కోట్లు. వడ్డీకి పోగా మిగిలేది మూడు లక్షల కోట్లే. ఈ ఏడాది కొత్త అప్పు తగ్గింది అవసరాలు లేక కాదు, అప్పులు పుట్టని స్థితికి చేరుకున్నాం. పర్యవసానంగా సంక్షేమానికి కత్తిరింపులు వేశారు.**

ప్రపంచదేశాల మానవాభివృద్ధిలో సూచీలో మన దేశం 134వ స్థానంలో వున్నది. ఆకలి సూచీలో 121 స్థానంలో వుంది. ఈ స్థితి మారాలంటే అందరికీ ఉచితంగా చదువు, ఆరోగ్య సేవలందించాలి. అందుకు తగిన కేటాయింపులు లేవు. ఉపాధికి చేసిన కేటాయింపులు కార్పొరేట్లకు సహాయపడేవిగా ఉన్నాయి. ఉపాధినిచ్చే ఉత్పత్తి రంగానికి నిధులు లేవు. రైతు సంఘాలు కోరుతున్న విధంగా అన్ని పంటలకు స్వామినాథన్ సిఫారసుల మేరకు లాభసాటి మద్దతు ధరలను చట్టబద్ధంగా కల్పించే అవకాశం లేదు. ఉచిత రేషన్ బియ్యం మినహా పెరిగిన ధరల భారాన్ని తగ్గించే విధంగా జీఎస్టీ బాదుడు నుండి ఉపశమనం కల్పించే ఆశ లేదు. మొత్తం మీద బడ్జెట్‌లో అభివృద్ధికి అవసరమైన నిధులు, తాత్కాలిక ఉపశమనానికి పేదల సంక్షేమానికి నిధులు లేవు. రాష్ట్రాలకు అదనపు నిధులిచ్చే పరిస్థితి లేకపోగా పన్నుల పంపకంలోనూ రకరకాల పద్ధతుల్లో కోతలు పెడుతున్నారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వాల స్థితి మరింత దారుణంగా మారింది. అవి ఇప్పటికే అప్పుల కుప్పలుగా వున్నాయి. ఎన్నికల్లో గెలుపు కోసం చేసిన వాగ్దానాలు నెరవేర్చలేని స్థితిలో సతమతమౌతున్నాయి. ప్రస్తుత ఆర్థిక వనరుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని ముందుకు సాగించే అవకాశాలు లేవు. వీటి బడ్జెట్ల పరిధిలో తాత్కాలిక ఉపశమన సంక్షేమ పథకాలు విస్తరించే వీలులేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ పాలనా విధానాలు చరమాంకానికి చేరుకున్నాయి. ఈ తరహా పాలన అనివార్యంగా సంక్షోభంలో పడుతుంది. ఈ సంక్షోభం నుండి దేశ ప్రజలను ఒడ్డుకు చేర్చడానికి ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం అవుతుంది. ముందుగా గత పదేళ్ళ మోదీ పాలన లో జరిగిన దానిని పరిశీలించాలి. ప్రపంచంలోనే అత్యధికంగా అంతరాలు పెరిగిన దేశంగా మారింది. 2013 నాటికి 50 మంది బిలియనీర్లు అంటే 100 కోట్లకు పైబడిన డాలర్ల సంపద గలవారు లేదా 8000 కోట్లకు రూపాయలకు పైబడిన సంపద గలవారు వుంటే 2024 నాటికి 169 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచ బిలియ నీర్లలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి దూసుకు పోయింది. ఈ 169 మంది బిలియనీర్ల దగ్గరే 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది.

ఆక్స్ ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో ఒక శాతం దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా 10 శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర మొత్తం దేశ సంపదలో 77 శాతం గుట్టపడింది. ఇలా ఒక దశాబ్ద కాలంలోనే జరిగిన అరుదైన దేశ సంపద కేంద్రీకరణ మీద ప్రపంచంలో అనేక మంది ఆసక్తితో చర్చిస్తున్నారు. స్థూలంగా 10 ఏళ్ల మోదీ పాలన ప్రధానంగా కార్పొరేట్ల కోసం సాగిన పాలన. దాని పర్యవసానంగానే దేశ సంపద వారి పంచకు చేరింది. కార్పొరేట్లకు కారు చౌకగా రైతుల ఆహార ఉత్పత్తులను కట్టబెట్టడానికే స్వామినాథన్ సిఫార్సు మేరకు లాభసాటి ధరను చట్టబద్ధం చెయ్యడానికి మోదీ ప్రభుత్వం మొండిగా తిరస్కరిస్తున్నది. ప్రధానంగా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కార్మిక హక్కులను కత్తిరించే లక్ష్యంతోనే 40 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను తెచ్చింది.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన

మోదీ పెద్దనోట్ల రద్దు, జీఎస్టీలతో లక్షలాది చిన్న పరిశ్రమలను, వ్యాపారాలను మూతపెట్టి నిరుద్యోగ సైన్యాన్ని పెంచారు. ఈ బడ్జెట్‌లో ఉద్యోగ కల్పన ముసుగుతో కార్పొరేట్లకు, బడా కంపెనీలకు ఎదురు జీతాలు ఇచ్చే పథకాలను ప్రకటించారు. గత పదేళ్లలో 35 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారు. వారికే దాదాపు 20 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశారు. గతంలో 10 శాతం వున్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారు. మరో పక్క పేదలు, సామాన్యులపై జీఎస్టీ పన్నులను అన్ని నిత్య జీవ అవసరాలకు విస్తరింపచేసి ధరల మంట మండిస్తూ వారి జీవితాలను దుర్భరం చేశారు. ఒకపక్క రోజూ పేదల జేబులను కొల్లగొడుతూ వారిని శాశ్వతంగా పేదలను చేసి 80 కోట్ల మందికి ఉచిత రేషన్‌తో చేతులు దులుపుకుంటున్నారు. ఇది మోదీ పాలన సంగ్రహ చిత్రం. దేశంలో ప్రస్తుతం నెలకొన్న ప్రధాన వైరుధ్యాన్ని ఇది స్పష్టం చేస్తున్నది. దేశ సంపదను కార్పొరేట్లు స్వంతం చేసుకుంటూ పోతున్నారు. మరో పక్క రైతులు, సామాన్యులు, పేదలు కార్పొరేట్ల అనుకూల పాలనలో నలిగిపోతున్నారు. 10 శాతంగా వున్న కార్పొరేట్ల దోపిడీకి-75 శాతం చితికి పోతున్న దేశ ప్రజలకీ మధ్య నెల కొన్న వైరుధ్యమే ప్రస్తుత ప్రధాన వైరుధ్యంగా గుర్తించాలి. కార్పొరేట్లను కట్టడి చేసి వారి దగ్గర పోగుపడ్డ సంపదను పునః పంపిణీ చేసే నినాదాన్ని మోదీని గద్దె దించే సాధనంగా చేసుకోవాలి. దేశంలో 10 శాతం దగ్గర పోగు పడ్డ సంపదను పునః పంపిణీ అన్నది ప్రత్యామ్నాయ రాజకీయం నినాదం కావాలి. ఇది కార్పొరేట్ల మీద నాలుగు పన్నులు విధించడం ద్వారా సులభంగా సాధించవచ్చును.

- మొదటిది ప్రస్తుతం 22 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును మరికొంత పెంచడం.
- రెండవది సంపద పన్నును వృద్ధి క్రమానుగతంగా విధించడం.
- మూడవది ప్రస్తుతం వున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పన్నును వృద్ధిక్రమానుగతంగా విధించి దానిని జాతీయ సంక్షేమ నిధిగా మార్చడం.
- నాలుగవది తొలగించిన వారసత్వ పన్ను స్థానంలో తిరిగి ప్రపంచదేశాల స్థాయిలో విధించడం.

ఇవి కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీకి దారితీస్తుంది. దేశంలో నిజమైన ప్రత్యామ్నాయ సంక్షేమ రాజ్యాన్ని సాధించగలుగుతుంది. పైన సూచించిన నాలుగు పన్నులో ఒక శాతం మంది దగ్గర పోగుపడ్డ సంపద మీద కనీసం రెండు శాతం సంపద పన్ను విధిస్తే ఎనిమిది లక్షల కోట్లు వస్తాయని, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే 6.67 లక్షల కోట్లు వస్తాయని ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక తత్వవేత్త ప్రభాత్ పట్నాయక్ లెక్కతేల్చారు. పైన పేర్కొన్న నాలుగు పన్నులనూ దేశంలో పది శాతం కుబేరుల మీద వృద్ధి క్రమానుగతంగా పన్నులు విధిస్తే 20 లక్షల కోట్లకు మించిన అదనపు నిధులు సమకూరతాయి. అయినా ఇలా పునఃపంపిణీకి పన్నుల ద్వారా తీసుకునే సొమ్ము కుబేరుల సంపదలో అతి చిన్న భాగంగానే వుంటుంది.

## ప్రజా ఉద్యమంగా ప్రత్యామ్నాయ రాజకీయం

ప్రత్యామ్నాయ రాజకీయం పూర్తిగా భిన్నమైంది. వ్యవస్థాగత మార్పులను సాధించే లక్ష్యం కోసం, ప్రజల నిత్యజీవన సమస్యల పరిష్కారం కోసం పాలక పక్షం మీద పోరాటానికి పూనుకుంటుంది. కేవలం అధికార మార్పిడి మాత్రమే ఏకైక లక్ష్యం కాదు వ్యవస్థాగత మార్పులను సాధించే అధికార మార్పిడి లక్ష్యంగా వుంటుంది. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాల రూపకల్పనకు ఇదే ప్రాతిపదిక అవుతుంది. ప్రత్యామ్నాయ రాజకీయం ఒక కొత్త రాజకీయం. ప్రస్తుత పాలకపక్ష రాజకీయం ప్రజలను “లబ్ధిదారులను” చేసింది. ప్రత్యామ్నాయ రాజకీయం వారిని “ హక్కుదారులను” చేస్తుంది. కొత్త రాజకీయానికి తగిన కొత్త ఆకాంక్షలను ప్రజల్లో కల్పించాలి. స్థూలంగా మార్క్స్ ప్రకటించినట్లు ఒక సిద్ధాంతమే కాదు, ఒక ఆకాంక్ష, ఒక నినాదం ప్రజల బుర్రలను ఆవహిస్తే అది ప్రజా సమూహాలను ఒక భౌతిక శక్తిగా నడిపిస్తుంది. ఈ కొత్త రాజకీయం అలాంటి భావజాలాన్ని ఒక ఆకాంక్షగా ప్రజలకు అందించగలగాలి. ఒక ఆకాంక్ష లేదా ఒక నినాదం భౌతిక శక్తిగా మారాలంటే మూడు అంశాలు జత పడాలి. మొదటిది ఆనాటి ప్రధాన వైరుధ్యం చుట్టూ అత్యధికులను ఆకర్షించే నినాదం వుండాలి. రెండవది ఈ నినాదం ఆచరణ సాధ్యమేనని ప్రజలు విశ్వసించే వివరణ కలదై వుండాలి. మూడవది అది వారిని “హక్కుదారులను” ఎలా చేస్తుందో స్వతంత్ర జీవనానికి ఎలా దారి తీస్తుందో నిర్దిష్టమైన వివరణ వుండాలి. అప్పుడు మాత్రమే ఆ నినాదం ప్రజల బుర్రల లోకి ఎక్కుతుంది. ఈ పరిణామం జరిగితే విశాల ప్రజా ఉద్యమంగా కొత్త రాజకీయం ముందుకు సాగుతుంది. మొదటగా పాలనా సంక్షోభ పరిష్కారానికి తగిన ప్రత్యా మ్నాయ రాజకీయానికి అత్యధికులకు మేలు చేసే “సంపద పునః పంపిణీ” అన్నది నినాదం. రెండవది నాలుగు రకాల పన్నుల ద్వారా కార్పొరేట్ల సంపదను కట్టడి చేసి ఆచరణ సాధ్యమైన అదనపు నిధుల సమీకరణ మార్గాలు వెల్లడించడం. మూడవది సంపద పునః పంపిణీ ద్వారా హక్కుగా పొందే సంక్షేమం, స్వతంత్ర జీవనం గురించి కొన్ని ప్రతిపాదనలు ప్రస్తావించుకుంటే ప్రత్యామ్నాయ రాజకీయ ప్రజా ఉద్యమానికి అవసరమైన మూడు అంశాలు పరిపూర్తి అవుతాయి.

- బడ్జెట్ నిధులతోపాటు సంపద పునఃపంపిణీ అదనపు నిధులతో శ్రమ జీవులకు పేదల కుటుంబాలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే మౌలిక ఆదాయాన్ని కల్పించడం.

**(మిగతా 11వ పేజీలో)**

# పదునెక్కుతున్న మోదీ వ్యూహ ప్రతివ్యూహాలు



- ఎ.కృష్ణారావు

**కంసుడిని కృష్ణుడు హతమార్చకపోతే కృష్ణుడిని హత మార్చేందుకు కంసుడు తన ప్రయత్నాలను మానుకునేవాడు కాదని భాగవతంలో దశమస్కంధం చదివిన వారికి అర్థమవుతుంది. రాజకీయాలు కూడా అదే విధంగా ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలియనిది కాదు. లోక్‌సభలో బీజేపీ మెజారిటీ 240 సీట్లకు తగ్గిపోయినప్పటి నుంచీ కొంచెం వెనక్కు తగ్గినట్లు కనపడిన మోదీ స్వాతంత్ర్య పర్వదినం నుంచే తన ఆయుధాలు సంధించడం ప్రారంభించారు. దీనిని బట్టి ఆయన తన సహజ లక్షణాలు కోల్పోలేదన్న విషయం అర్థమవుతోంది.**

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుసటి రోజు నుంచీ ఇండియా కూటమి తగ్గేదే లేదన్నట్లుగా కొదమసింహంలా దూకుడు ప్రదర్శిస్తూ మోదీ సేనను ఆత్మరక్షణలో పడేసేందుకు ప్రయత్నించడం ప్రారంభించింది. ఇటీవల ముగిసిన 18వ లోక్‌సభ తొలి సమావేశాల్లో రాహుల్ నేతృత్వంలో ఇండియా కూటమి అవకాశం దొరికినప్పుడల్లా ప్రభుత్వంపై దాడిని తీవ్రతరం చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగానికి అడుగడుగునా అడ్డు తగిలేందుకు రాహుల్‌గాంధీ స్వయంగా సారథ్యం వహించారు. ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాల వ్యవహార శైలితో అనేక సందర్భాల్లో సభాపతులు నిరాశా నిస్పృహలకు గురికాగా, అధికారపక్ష పెద్దలు చేష్టలుడిగిపోయారు. చివరకు శక్తి కూడ దీసుకుని అనురాగ్ ఠాకూర్, నిర్మలా సీతారామన్‌తోపాటు ఒకరిద్దరు బీజేపీ నేతలు ప్రతిపక్షంపై విరుచుకుపడకపోతే, తొలి సమావేశాల్లో ప్రతిపక్షాలకు తిరుగులేకుండా పోయేది. నీట్ ప్రశ్నపత్రాల లీక్, కులగణన, కనీస మద్దతు ధర, మణిపూర్‌తో పాటు అనేక అంశాలు ప్రతిపక్షాలకు ఆయుధాలయ్యాయి. వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వమే సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించేందుకు ముందుకు రావడం మారిన పరిస్థితులకు నిదర్శనం.

పార్లమెంట్ సమావేశాలు ముగిశాయో లేదో, ఆగస్టు 10న అదానీ స్టాక్ మార్కెట్ వ్యవహారంలో హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడించిన తాజా అంశాలతో ప్రతిపక్షాలు మరింత రెచ్చిపోయాయి. అదానీ గ్రూప్ సంస్థలు తమ షేర్లను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించిన విదేశీ నిధుల్లో సెబి చైర్మన్, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని వచ్చిన ఆరోపణల ఆధారంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ ఆరోపణలపై జేపీసీ ఏర్పాటుకు డిమాండ్ చేసింది. అదే సమయంలో కులజనగణన, రిజర్వేషన్లపై కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. మరో మూడు నెలల్లో జరగనున్న హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు కమలనాథులను చికాకు పెట్టేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోకూడదని నిర్ణయించాయి. కాని మోదీని కూడా తక్కువ అంచనా వేయలేం. ఆగస్టు 15న ఎర్రకోట ప్రసంగంతో ఎదురు దాడి చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రసంగంలో ఆయన రెండు కీలకాంశాలను ప్రకటించారు. అవినీతిపై తాను ప్రకటించిన యుద్ధాన్ని తీవ్రతరం చేస్తానని మోదీ చేసిన వ్యాఖ్యలు గత అయిదేళ్లుగా అనేక మంది ప్రతిపక్ష నేతలపై జరుగుతున్న ఏజెన్సీల చర్యలు ఆగిపోవన్న విషయం ధ్రువీకరిస్తున్నాయి. ఇక ఇంత కాలం కొనసాగిన మతతత్వ పౌరస్మృతి బదులు లౌకిక పౌర స్మృతి దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉన్నదని మోదీ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ప్రతిపక్షాల కులజనగణన డిమాండ్‌ను అడ్డుకునేందుకు మోదీ ఈ ఆయుధాన్ని బయటకు తీసినట్లు కనబడుతోంది.

అవినీతిని ఎంత మాత్రమూ సహించేది లేదని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన మరునాడే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై మైసూరు భూమి కుంభకోణానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్ అవినీతి నిరోధక చట్టంలో బహుళ ప్రాచుర్యం పొందిన సెక్షన్ 17ఏ కింద అనుమతిని మంజూరుచేశారు. మైసూరులో సిద్ధరామయ్య సతీమణి పార్వతి ఆమె పేరున లేని భూమిని ప్రభుత్వానికి ఇచ్చినందుకు బదులుగా 14 స్థలాలు అక్రమంగా పొందారని ఆరోపణలు రాగా, ఈ నిర్ణయం తనది కాదని, బీజేపీ హయాంలోనే ఈ స్థలాలను కేటాయించారని సిద్ధరామయ్య వాదిస్తున్నారు. సిద్ధరామయ్య నిర్ణయం తీసుకోనప్పుడు ఆయనపై 17ఏ క్రింద ఎలా చర్య తీసుకుంటారన్న చర్చ జరుగుతున్నప్పటికీ కర్ణాటక గవర్నర్ నిర్ణయం దేశవ్యాప్తంగా బీజేపీయేతర ముఖ్యమంత్రులను ఉలిక్కిపడేలా చేసిందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా

ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అప్రమత్తంగా ఉండేలా మోదీ చేయగలిగారనడంలో సందేహం లేదు. ఇప్పటికే జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు గవర్నర్లు ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంఘర్షణాయుత వైఖరిని అవలంబిస్తున్నారు. మోదీ ఎక్కడి నుంచైనా ఎదురుదాడి చేయగలరని సిద్ధరామయ్య వ్యవహారంతో ప్రతిపక్షాలకు అర్థమైంది. ఇదే సమయంలో కోల్‌కతాలో హత్యాచారానికి బలైన ఒక యువ డాక్టర్ విషాద ఉదంతాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ సహజంగానే విస్తృత యత్నాలు చేస్తోంది.

రాజకీయాల్లో అదును చూసుకుని ఎదురు దాడులు చేయడం మాత్రమే కాదు, అవసరమైనప్పుడు వెనక్కు తగ్గడం కూడా అవసరం. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో మధ్య స్థాయి పోస్టుల్లో సివిల్ సర్వీసు అధికారులను కాకుండా బయటి నుంచి వ్యక్తులను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన విడుదల చేసిన మూడు రోజుల్లోనే మోదీ సర్కార్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. దాదాపు 45 జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన చేసిన వెంటనే కాంగ్రెస్‌తోపాటు బీజేపీ మిత్రపక్షాలు కూడా విరుచుకుపడడం ఇందుకు కారణం. ఈ నిర్ణయం రాజ్యాంగం కల్పించిన దళితులు, ఓబీసీలు, ఆదివాసీల రిజర్వేషన్లకు వ్యతిరేకమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. బయటి వ్యక్తులను నియమించడం యుపిఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువకుల హక్కులను దోపిడీ చేయడమేనని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం లభించకుండా చేసేందుకే ఈ నియామకాలు చేస్తున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. ఎన్డీఏ మిత్రపక్షాలు జనతాదళ్ (యు), లోక్ జనశక్తి (రాంవిలాస్) కూడా ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొమ్మని కోరాయి. దీనితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయానికి అనుగుణంగా నియామకాలు జరగాలని అభిలషిస్తున్నందువల్ల బయటి నుంచి వ్యక్తుల నియామకానికి సంబంధించి ప్రకటన వెనక్కు తీసుకోవాలని కేంద్రమంత్రి జితేందర్ సింగ్ యుపిఎస్‌సి చైర్మన్‌కు లేఖ రాశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ బిల్లు, సాగు చట్టాలు, డేటా సంరక్షణ బిల్లు, బ్రాడ్‌కాస్ట్ బిల్లుతోపాటు పలు నిర్ణయాలను వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. బయటి వ్యక్తులను నియమించాలన్న విషయాన్ని కాంగ్రెస్ హయాంలో కూడా పరిశీలించారని, మోదీ ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ అమిత్ మాలవీయ రాహుల్‌ను విమర్శించిన రెండు రోజులకే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం గమనార్హం. త్వరలో ఎన్నికలు జరుగనున్న హర్యానాలో తమ విజయానికి ఓబీసీలు, దళితులపై పూర్తిగా ఆధారపడుతున్న బీజేపీ రాహుల్ విమర్శతో వెంటనే వెనక్కు తగ్గాల్సి వచ్చిందనడంలో సందేహం లేదు.

దేశంలో మాత్రమే కాదు, మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తున్నది. బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు తర్వాత ఆ దేశ ప్రధాన మంత్రి హసీనాకు ఆశ్రయం కల్పించడం భారత్‌కు సమస్యాత్మకంగా పరిణమించింది. ఆమెను ఏ దేశానికి పంపించాలో తెలియక మనం సతమతమవుతుండగా యుద్ధ నేరాల క్రింద ఆమెను విచారించేందుకు బంగ్లా తిరిగి పంపాలని ఆ దేశం నుంచి డిమాండ్ వస్తోంది. ఇక అమెరికాలో అత్యంత కీలకమైన నాటో శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న సమయంలోనే మోదీ రష్యాలో రెండు రోజులు పర్యటించి పుతిన్‌ను కౌగలించుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రధానాంశంగా నాటో సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్న తరుణంలో మోదీ తన రష్యా పర్యటనను వాయిదా వేసుకోవాలని అమెరికా కోరినప్పటికీ ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. యుద్ధ సమయంలో వ్యూహాత్మక స్వతంత్రత అన్న మాటకు అర్థం లేదని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ స్పష్టంగా ప్రకటించారు. భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రతను తాము గౌరవిస్తామని, కాని సంక్షోభ సమయాల్లో భారత అమెరికాలు కలిసికట్టుగా, విశ్వాసపాత్రమైన స్నేహితులుగా వ్యవహరించాలని తెలుసుకోవాలని ఆయన ఒక రక్షణ సదస్సులో చెప్పారు. తమతో సంబంధ బాంధవ్యాలను అలుసుగా తీసుకోవద్దని ఆయన హెచ్చరించారు. రష్యా చైనాకు జూనియర్ భాగస్వామిగా మారుతోందని, ఆ దేశాన్ని విశ్వసనీయ భాగస్వామిగా తీసుకోవడం మంచిది కాదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సల్లివాన్ స్పష్టం చేశారు. మోదీ పుతిన్‌ను గాఢంగా కౌగలించుకున్న దృశ్యాలు విడుదలైన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ పర్యటన శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగించిందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తప్పని సరై ఉక్రెయిన్‌తోపాటు రష్యాను బద్ధశత్రువుగా భావిస్తున్న పోలండ్‌కు వెళ్లి నాటో దేశాలను శాంతింపచేసే ప్రయత్నం చేశారు. “మీరెవరో, మీ శత్రువెవరో తెలిస్తే వంద యుద్ధాలు జరిగినా భయపడనక్కర్లేదు. మీ గురించి మాత్రమే తెలిసి మీ శత్రువు గురించి తెలియకపోతే, గెలుపుతోపాటు ఓటమికి కూడా సిద్ధంగా ఉండాలి. మీ గురించి కానీ, మీ శత్రువు గురించి కానీ ఏమీ తెలియకపోతే ప్రతి యుద్ధంలోనూ ఓడిపోవాల్సిందే” అని చైనా సైనిక వ్యూహకర్త సున్ సు ‘ద ఆర్ట్ ఆఫ్ వార్’లో రాశారు. 13 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా, 10 సంవత్సరాలకు పైగా ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్రమోదీకి ఈ విషయం బాగా తెలిసే ఉండవచ్చు. ❑

# సెబీ చీఫ్ లాలూచీ బహిర్గతం

- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

**అమెరికాకు చెందిన పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన తాజా నివేదిక సెబీ ప్రధాన అధికారి మాధబి పురి బుచ్ పాత్ర గురించి తీవ్రమైన ప్రశ్నలు ముందుకు తెచ్చింది. అదానీ గ్రూపు వివిధ నిబంధనల ఉల్లంఘనలకు, షేర్ల రేట్ల విషయంలో మాయాజాలానికి పాల్పడిందనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఆ నియంత్రణ సంస్థకి ఆమె బాధ్యత వహిస్తున్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకారం సెబీ చైర్‌పర్సన్ బుచ్ 2015లో 'గ్లోబల్ డైనమిక్ ఆపర్చునిటీ ఫండ్' అన్న దాంట్లో పెట్టుబడులు పెట్టారు. సరిగ్గా ఆమె సెబీ పూర్తి కాలపు సభ్యురాలిగా బాధ్యత స్వీకరించడానికి ముందే 2017లో ఆమె వాటిని తన భర్త ఖాతాకు బదలాయించారు. ఆ నిధులను నిర్వహించేది ఆమె భర్త అయినా 2018లో బుచ్ స్వయంగా ఇచ్చిన మెయిల్‌తో వాటి నుంచి బయటపడ్డారు. పెట్టుబడులు మళ్లీ ప్రారంభమయ్యాయి.**

విదేశాల్లోని ఈ సంస్థలో బుచ్ పెట్టుబడులు పెట్టినట్లు ఒక సమాచార వేగు ఇచ్చిన ప్రకటన ఆధారంగా హిండెన్‌బర్గ్ నిర్ధారించింది. గౌతమ్ అదానీ సోదరుడైన వినోద్ అదానీ నిర్వహిస్తున్న 'బెర్ముడా మారిషస్ ఫండ్'లో అది భాగంగా ఉంది. అప్పటికే గౌతమ్ అదానీపై సెబీ దర్యాప్తు సాగుతున్నా పెట్టుబడులు పెట్టారు.

### తొలి నివేదిక సంచలనం-సుప్రీం కోర్టు

హిండెన్‌బర్గ్ 2023 జనవరిలో విడుదల చేసిన నివేదిక సంచలనం కలిగించిన సంగతి గుర్తు చేసుకోవాలి. అదానీ గ్రూప్ చాలా బాహాటంగా దశాబ్దాల తరబడి స్టాక్ మార్కెట్ మాయాజాలానికి పాల్పడిందని, లెక్కలు తారుమారు చేసిందని ఆ నివేదిక ఆరోపించింది. ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాత అదానీ గ్రూప్ అనేక విదేశీ సంస్థల పేరుతో తన స్వంత నిధులనే అటూ ఇటూ తిప్పి తమ కంపెనీలలో పెట్టుబడి పెట్టిందీ కళ్లకు కట్టినట్లు వివరాలు నమోదుచేసింది. అదానీ గ్రూపు చట్ట ఉల్లంఘనల పట్ల తగు విధంగా వ్యవహరించడంలో సెబీ వైఫల్యం ఉందేమో దర్యాప్తు చేయడానికి 2023 మార్చిలో సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యులతో నిపుణుల బృందాన్ని నియమించింది. అంతేకాక ప్రభుత్వ రంగ సంస్థల తరఫున వున్న వాటాలకు సంబంధించిన వ్యవహారాలలో ఏమైనా ఉల్లంఘనలు జరిగాయేమో నిర్దిష్టంగా విచారించాలని ఆదేశించింది. అదానీ కంపెనీలకు సంబంధిత పక్షాలు నడిపిన లావాదేవీల సమాచారం వెల్లడించడంలో వైఫల్యాలు, షేర్ల రేట్లలో కుంభకోణాలు ఏమైనా ఉన్నాయేమో చూడాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలపైన, అదానీ కంపెనీకి విదేశీ పెట్టుబడుల ప్రవాహంపైన జరిపిన సెబీ దర్యాప్తులో ఏ తప్పూ కనుగొనలేక పోయిందని 2023 మేలో కోర్టుకు నిపుణుల కమిటీ తెలియ జేసింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే అదానీ గ్రూపునకు సంబంధించిన వివిధ ఉల్లంఘనల ఆరోపణలపై సెబీ అంతకన్నాముందే దర్యాప్తు జరుపుతున్నది. ఈ విషయం లో ఎలాంటి తీవ్ర ఉల్లంఘనలు ఉన్నట్లు నిరూపించడంలో విఫలం కావడం బట్టి చూస్తే సెబీ వైఫల్యం అనుమానాస్పద మని, ప్రశ్నార్థకమని హిండెన్‌బర్గ్ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. బుచ్ స్వయానా వినోద్ అదానీకి సంబంధించిన విదేశీ సంస్థలో పెట్టుబడులు పెట్టడమే ఇందుకు కారణం అవుతుంది.

### ఎప్పుడూ చెప్పలేదే ?

హిండెన్‌బర్గ్ నివేదికలోని ఆరోపణలను అసంబద్ధమైనవని వ్యక్తిగత శీలహననమేనని చైర్‌పర్సన్ బుచ్, అలాగే సెబీ ఖండించాయి. ఈ ఫండ్‌ను నెలకొల్పిన అనిల్ అహూజా తన భర్తకు బాల్యమిత్రుడు కావడం వల్లనే పెట్టుబడులు పెట్టామని బుచ్ ఒక ప్రకటనలో చెబుతున్నారు. ఆ పెట్టుబడులు పెట్టిన విషయం తమకు సరైన సమయంలోనే తెలియజేశారని, అలాగే అవసరమైనప్పుడు ఆమె ఆ వ్యవహారాలకు దూరంగా ఉన్నారని సెబి అంటున్నది. అయితే ఆమె అదానీకి సంబంధించిన దర్యాప్తులలో దూరంగా ఉన్నారని చెప్పగల నిర్దిష్టమైన సమాధానం లేదు. బుచ్ విదేశీ నిధులకు సంబంధించి తన భాగస్వామ్యాన్ని సుప్రీంకోర్టుకు గాని ఆరుగురు నిపుణుల బృందానికి కానీ 2023 మార్చిలో కోర్టు నియమించిన

బృందానికి గాని ఆమె తెలియజేసినట్లు సమాచారం లేదు. అదానీ గ్రూపుపై వచ్చిన 22 ఆరోపణలలో 20 విషయాలను దర్యాప్తు ముగించినట్లు మాత్రమే సెబీ సుప్రీంకోర్టుకు తెలిపింది. మిగిలిన వాటి దర్యాప్తును మరో రెండు, మూడు నెలల్లో ముగించనున్నట్టు తెలియజేసింది. మరో సమస్యపై కూడా దర్యాప్తు ముగించినట్టు ఇక ఒకటి మాత్రమే మిగిలినట్టు సెబీ 2024 జనవరిలో కోర్టుకు తెలియజేసింది. అదానీ గ్రూపు కంపెనీలకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు దొరికినట్టు చెప్పనేలేదు. చైర్ పర్సన్‌గా బుచ్ ఆ కంపెనీలపై దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే రెండుసార్లు అదానీతో సమావేశమైన విషయాన్ని కూడా వెల్లడించలేదు. దీన్నిబట్టి చూస్తే ఆమెపై వచ్చిన తీవ్ర ఆరోపణలకు ప్రాధాన్యత లభిస్తున్నది. సెబీ చీఫ్ వ్యక్తిగత అంత:కరణ, అలాగే ఒక స్వతంత్ర నియంత్రణ సంస్థ అధిపతి నుంచి ఆశించే ఉన్నతస్థాయి ప్రమాణాలకు సంబంధించిన సమస్య ఇది. ఈ రెండు కోణాల రీత్యా మాధబి బుచ్ తన స్థానం నుంచి తక్షణం తప్పుకోవాల్సి ఉంటుంది.

### కేంద్ర సమర్థన-వాస్తవాల నిర్ధారణ

బీజేపీ, మోడీ ప్రభుత్వం సెబీ చీఫ్‌పై వచ్చిన ఈ ఆరోపణలను వెనక్కు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. భారతదేశ స్టాక్ మార్కెట్‌ను ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడానికి కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు విదేశీ సంస్థలతో కుమ్మక్కు అవుతున్నాయని ఆరోపిస్తున్నాయి. సెబీ చీఫ్‌కు వత్తాసుగా ఇలాంటి దారుణమైన వినాశకరమైన సమర్థనకు దిగడం చిన్నశ్రేణి మదుపరులలో గానీ, ప్రజలలో కానీ విశ్వాసం పాదుకొల్పడం సాధ్యం కాదు. ఒక నయా ఉదారవాద వ్యవస్థలో నియంత్రణ సంస్థలను బడా కంపెనీలు ఏ విధంగా గుప్పిట పెట్టుకోగలవో బుచ్ ఉదంతం బహిర్గతం చేస్తోంది. కనుక ఈ సరికొత్త సాక్ష్యాల నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ గ్రూపు సాగించిన దారుణమైన నియమోల్లంఘనలనూ స్టాక్ మార్కెట్ మాయాజాలాలనూ కూడా కోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయించడం మరింత శ్రేయస్కరం అవుతుంది. లేదంటే ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరపటం ఏకైక మార్గంగా వుంటుంది. ❑

## చింతనాత్మక రాజకీయాలు యేవీ?

(5వ పేజీ తరువాయి)

ఆస్కారం లేనే లేదు. రాజకీయ చింతనను విశ్వ విద్యాలయాల రాజనీతిశాస్త్ర విశారదులు స్వీకరించి స్వాధీనం చేసుకోవడమనేది ఒక మేధోపరమైన విపత్తు మాత్రమే కాకుండా ఒక రాజకీయ అనర్థం కూడా. మన రాజకీయాల లోని ప్రస్తుత దుస్థితి, శోచనీయ పరిస్థితులకు చైతన్య శీల రాజకీయ చింతన క్షీణించిపోవ డమే ప్రధాన కారణం. భారత రాజ్యాంగ నిర్మా తలు నెలకొల్పిన మన సమున్నత ప్రజాస్వా మిక గణతంత్రరాజ్యాన్ని మళ్లీ సాధించు కుని, సంరక్షించుకునేందుకు ఆధునిక భారత రాజకీ య చింతనా సంప్రదాయాన్ని పునరుద్ధరిం చుకుని పునశ్శక్తిమంతం చేసుకోవడమనేది చాలా చాలా అవసరం. మన రాజకీయాలలోని ప్రస్తుత దుస్థితికి చైతన్యశీల రాజకీయ చింతన క్షీణించిపో వడమే ప్రధాన కారణం. భారత రాజ్యాంగ నిర్మాత లు నెలకొల్పిన మన సమున్న త ప్రజాస్వామిక గణతంత్రరాజ్యాన్ని మళ్లీ సాధించుకుని, సంరక్షించుకునేందుకు 'మరణిం చిన' ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయాన్ని పునరుద్ధరించుకుని పునశ్శక్తి మంతం చేసుకోవడమనేది చాలా చాలా అవసరం. ❑

## సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం

(ఏడో పేజీ తరువాయి)

- అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు, ఆహార భద్రత, నివాస వసతులను హక్కుగా కల్పించడం.
- కులపరమైన లింగ పరమైన మతపరమైన వివక్ష ను తొలగించడానికి ప్రత్యేక నిధుల కేటాయింపు.
- స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు చట్టబద్ధంగా వ్యవసాయ పంటలన్నింటికీ లాభసాటి ధరలు అందించడం.
- ప్రకృతి వైపరీత్యాలకు పరిహారాల చెల్లింపు- పంటల వారీగా రైతులే నిర్వహించుకునే ప్రత్యామ్నాయ మార్కెట్లకు నిధులు నిరుద్యోగులకు అర్హతకు తగిన ఉపాధి కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచడం.
- వృద్ధులకు, వేతన జీవులకు ఆదాయ పన్ను మినహాయింపు గణనీయంగా పెంచడం వగైరాలు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

పాలనా సంక్షోభ కాలం సుదీర్ఘ కాలం వుండదు.పరిష్కారానికి ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటుంది. కార్పొరేట్ల పెత్తనం కొన సాగించడానికి పాలకపక్షం మెజారిటీ మతవాద నినాదాన్ని జత కలిపి ఫాసిస్టు మూకల పాలన రూపం ధరిస్తుంది. లేదా ప్రత్యా మ్నాయ రాజకీయం ఒక ఉద్యమంగా విస్తరించి ప్రజా సంక్షేమ రాజ్యాన్ని సాధిస్తుంది. ఇలాంటి పాలనా సంక్షోభ కాలంలో ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమం ఒక తప్పనిసరి తక్షణ అవసరం. అందుకు సిద్ధం కావడమే అందరి కర్తవ్యం కావాలి. ❑

**(గమనిక : ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమంలో భాగంగా సాగాల్సిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమం కూడా అవసరమైందే. వ్యాస పరిమితి రీత్యా దానిని ప్రస్తావించలేదు.)**

# నాకిది.. నీకది మన రక్తంలోనే ఉందా?



- రాహుల్ కుమార్

రాజకీయ నాయకత్వం, వ్యాపారవర్గం, ఉద్యోగస్వామ్యం (బ్యురాక్రసి), ఆశ్రిత పక్షపాతం.. వీటి లోతుల్లోకి వెళ్లకుండా మన ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవటం కష్టం. ఆశ్రిత పక్షపాతం ఒక్కో దేశంలో ఒక్కో మోతాదులో ఉండొచ్చు. అసలెక్కడా లేకపోవటం అనేది చాలా అరుదు. మన దేశంలో దాని మోతాదు మించిపోయి ఎన్నో విపరిణామాలకు దారి తీస్తోంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్‌పర్సన్ మాధవి బుచ్‌పై ప్రముఖ పెట్టుబడుల వ్యవహారాల పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ ఇటీవల చేసిన ఆరోపణలతో వ్యాపార రంగం, ప్రభుత్వాల మధ్య నెలకొన్న ఆశ్రిత పక్షపాత ధోరణులపై మళ్లీ చర్చ మొదలైంది. వీటి వల్ల కొందరు వ్యాపారవేత్తలకు అనుచిత లాభాలు కలగటం నిజం. ఇందుకోసం పెద్దగా శోధించాల్సిన అవసరం లేదు. దాదాపుగా అన్ని రంగాల్లో పక్షపాతాన్ని చూడటం సగటు భారతీయుడికి నిత్యానుభవమే. కులం, మతం, ప్రాంతం, బంధుత్వాల ఆధారంగా పక్షపాత ప్రదర్శనను గమనించని వ్యక్తిని కనిపెట్ట టం మన సమాజంలో కష్టసాధ్యమైన పనిగా భావించొచ్చు! వ్యక్తి గుణగణాలకంటే కుల, మత, ప్రాంత, వర్గ అభిమానాలకు ప్రాధాన్యం ఇవ్వటమనేది అనేక కారణాల వల్ల మనలో పాతుకుపోయింది.

అవునన్నా కాదన్నా మనం గొప్పగా భావించే హిందూ సామాజిక వ్యవస్థలోనే దీనికి పునాదులు ఉన్నాయి. కులాల ఒడిలో పెరిగి, బలపడి, చైతన్యాన్ని పొందిన సగటు మనిషి ఆలోచన నిరంతరం 'మనవాళ్లను గుర్తించటం వైపు మొగ్గుతూనే ఉంటుంది. ఆ 'మనవాళ్ల'తో తాదాత్మ్యం కోసం తహతహలాడు తూనే ఉంటుంది. చిన్నాచితకా ప్రయోజనాల కోసం ప్రదర్శితమ య్యే ఈ తరహా కుల, తెగ పక్షపాత ప్రీతితో జరిగే నష్టాలకు ఒక పరిమితి ఉంటుంది. కానీ సమాజ వన రులు, ప్రభుత్వాలపై ఆధిపత్యం చలాయించే వర్గాలు ప్రదర్శించే పక్షపాతంతో కలిగే విపరిణామాలు అసాధారణంగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థనూ, సంపద పంపిణీని ఎన్నో విధాలుగా అవి ప్రభావితం చేస్తాయి.

అందుకే వ్యాపార, రాజకీయ, ఉన్నత ఉద్యోగ వర్గాల మధ్య జరిగే నాకిది.. నీకది (క్విడ్ ప్రొక్వొ) వ్యవహారాల గురించి చాలా విశ్లేషణలు వస్తున్నాయి. దానికితోడు ఆర్థిక విధానాల రూపకల్పనలో పెరిగిపోతున్న వ్యాపారవర్గాల పాత్రపై లోతైన పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే రాజకీయాల్లో వేగంగా పెరుగుతున్న ఆ వర్గాల ప్రమేయంపైన చాలా అధ్యయనాలూ సాగుతున్నాయి. టొరంటో విశ్వ విద్యాలయం, క్లెమాంట్ మకెన కళాశాలలో రాజకీయాలను బోధించే కాంత మురళి, అసీమా సిన్హాలు ఈ రెండు అంశాలపై ఇటీవల చాలా విషయాలను వెలుగులోకి తెచ్చారు.

ప్రభుత్వం–వ్యాపార వర్గం మధ్య నెలకొన్న అనుచిత సంబంధాలను అర్థం చేసుకోటానికి మనం 1950 నుంచి పరిశీలన మొదలు పెట్టాలి. 1980ల వరకూ పరిశ్రమ–వ్యాపారానికి సంబంధించి ప్రభుత్వ జోక్యం విపరీతంగా ఉండేది. ప్రైవేటు రంగంపై లెక్కలేనన్ని నియంత్రణలు కొనసాగేవి. నచ్చిన రంగంలో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఉండేది కాదు. ఒకవేళ అనుమతి ఇచ్చినా ఎంత ఉత్పత్తి చేయాలో ప్రభుత్వమే నిర్దేశించేది. డిమాండును బట్టి ఉత్పత్తి పెంచుకునే వెసులుబాటు లేదు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకునే అవకాశమూ దొరికేది కాదు. అన్నిటికి ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సిందే. దీన్నే లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్‌గా ఈసడించుకునేవారు. కావాల్సిన యంత్రాలనూ, వస్తువులనూ స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలనే ఆలోచనలతో ఆ తరహా ఆర్థిక విధానాలకు రూపకల్పన చేశారు. వలసపాలన కింద నలిగిపోయిన అనుభవంతో సొంత కాళ్లపై నిలబడాలన్న అప్పటి సంకల్పాన్ని తప్పుపట్టలేం. సంకల్పం ఎలా ఉన్నా ఫలి తాలు మాత్రం అనుకున్న విధంగా రాలేదు. అనేక పరిశ్రమల స్థాపనలో ప్రభుత్వానికే పెద్ద పీట వేశారు. కొన్ని రంగాల్లో ప్రైవేటు రంగానికి కనీస ప్రవేశం కూడా ఇవ్వలేదు. విదేశాల సాయంతో కొన్ని పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటు చేసినా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఉండేది కాదు.

ప్రైవేటు రంగం చొరవను కట్టడి చేయటం వల్లే 1950–80ల మధ్య ఆర్థికప్రగతి అంతంత మాత్రంగా ఉందని చెప్పటానికి బోలెడు అధ్యయనాలు ఉన్నాయి. ఆగ్నేయాసియా దేశాలతో పోలిస్తే భారత్ మందగమనానికి దీన్నే ప్రధాన కారణంగా చెప్పేవారు. ఆ కాలంలో మన ఆర్థిక వృద్ధి సగటున మూడు శాతానికి అటు ఇటుగా ఉండేది. ఇక్కడో విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. అదుపు లేని లాభాపేక్ష చరిత్రలో చాలా అనర్థాలకు కారణమైంది. అయితే అది నాణేనికి ఒక వైపు చిత్రమే. లాభాలను గరిష్ఠంగా పొందే లక్ష్యంలో భాగంగా ఎన్నో కొత్త ఆవిష్కరణలూ జరిగాయి. కొత్త సాంకేతికతలూ అందు

బాటులోకి వచ్చాయి. కాలక్రమేణా జన జీవితాన్నీ మెరుగుపర చాయి. నాణేనికది రెండో చిత్రం! జనహిత దృష్టితో కొన్ని సాంకేతిక ఆవిష్కరణలూ వచ్చాయి. కానీ వాటి సంఖ్య పరిమితం. సోషలిస్టు విప్లవాలకు నెలవైన రష్యా, చైనాల్లో ఒక దశ దాటిన తర్వాత అవి కనీస స్థాయికి పడిపోయాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాశ్చాత్య దేశాల పరుగును రష్యా, చైనాలు అందుకోలేకపోయాయి. ప్రయోగశీలతకు ప్రాణమైన చొరవ, స్వేచ్ఛలు కనుమరుగయ్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే కొత్త ఆవిష్కరణలకూ సాంకేతిక అభివృద్ధికీ నిత్యం దోహదం చేసే క్యాపిటలిజానికి ప్రత్యామ్నాయం లేదనే వాదనలు 1990ల తర్వాత బాగా ఎక్కువయ్యాయి. ఇందిరాగాంధీ తొలిసారి ప్రధాని గా ఉన్న కాలంలో (1967-77) ప్రైవేటు రంగంపై ఆంక్షలను మరింతగా పెంచారు. బ్యాంకులను జాతీయం చేశారు. వ్యాపార గుత్తాధిపత్యాన్ని నియంత్రిస్తూ చట్టం తెచ్చారు. గరీబీ హటావో లాంటి జనాకర్షణ మంత్రాలను పఠించారు. సోషలిజం వైపు మొగ్గుతున్నట్లు ప్రవర్తించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మొత్తాన్ని తన చుట్టూ తిప్పుకొని విపరీత కేంద్రీకరణతో అంతా ఢిల్లీ వైపు చూసే విధంగా రాజకీయాలను మార్చివేశారు.

లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్‌తో ప్రతి కీలక అనుమతికి సూట్ కేసులతో డబ్బులు పెట్టుకుని దిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టే సంస్కృతి పెరిగేటట్లు చేశారు. బడా లావాదేవీల విషయంలో అలా ఆనా డు క్విడ్ ప్రొక్వొ దేశంలో బలంగా వేళ్లూనుకుంది. అయినా విధానాలను పూర్తిగా ప్రభావితం చేసే స్థాయికి వ్యాపారవర్గం చేరుకోలేదు. ఉన్న విధానాల పరిధిలోనే క్విడ్‌ప్రొక్వొతో కొన్ని వర్గాలు బాగానే బలపడ్డాయి. బయటి కంపెనీలతో పోటీపడే పరిస్థితి లేదు. రాజకీయ పరపతిగల వ్యాపారులు తాము నిలదొ క్కుకున్న రంగంలోకి ఇతరుల నుంచి పోటీ రాకుండా చేసుకో గలిగారు. అంటే క్విడ్‌ప్రొక్వొ వల్ల ప్రైవేటు చొరవను కట్టడి చేశా రు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అడ్డుకట్టను వేయ గలిగారు! మరోవైపు పరిమిత పోటీతో లాభాలకూ ఇబ్బంది ఉండేది కాదు.

ఆశించిన స్థాయిలో జరగని అభివృద్ధి, అంతంతమాత్రంగా ప్రభుత్వరంగ సంస్థల తీరు, విపరీతంగా పెరిగిన జనాభా, నిరు ద్యోగ సమస్య, అన్నిస్థాయిల్లో విస్తరించిన అవినీతితో 1970ల నాటికి పరిస్థితి విషమించింది. అసంతృప్తులు, ఆందోళనలు చుట్టు ముట్టటంతో అధికారాన్ని కాపాడుకోటానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించారు. చివరికి 1977 ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలయ్యారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన(1980) తర్వాత ప్రైవేటు రంగానికి సడలింపులు ఇవ్వటం మొదలు పెట్టారు. కొంత మెరుగుదల కనిపించినా 1990 నాటికి విదేశీ ద్రవ్య నిల్వలు అడుగంటాయి. మొదటి గల్ఫ్ యుద్ధం, సోవియ ట్ రష్యా పతనం, మండల్ కమిషన్ సిఫార్సులు-వాటికి పోటీగా బీజేపీ చేపట్టిన రామాలయ రాజకీయాలు, రాజీవ్ గాంధీ హత్య తదితర పరిణామాలతో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దీంతో 1991లో పెద్దఎత్తున ఆర్థిక సంస్కరణలకు పూనుకొన్నారు. వీటితో పెట్టుబడిదారులకు కావాల్సినంత స్వేచ్ఛ వచ్చింది. లైసెన్స్-పర్మిట్-కోటారాజ్ నాటి ఆంక్షలు తొలగిపోయాయి. విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచుకున్నాయి. వృద్ధి రేటు బాగా పెరిగింది. చాలా సౌకర్యాలు, వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. మరోవంక వ్యాపారవర్గ జోక్యమూ విధానాల్లో ఎక్కువైపోయింది. స్వదేశీ-విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి రాష్ట్రాల మధ్య పోటీ పెరిగింది.

అధికార కమిటీల్లో వ్యాపార వర్గానికి చోటు లభించింది. విధానాల వల్ల లబ్ది పొందే పరిస్థితి నుంచి విధానాల రూప కల్పనలో ప్రధాన పాత్ర పోషించే స్థాయికి వ్యాపారవర్గం ఎదగటాన్ని మన ఆర్థిక చరిత్రలో కీలక పరిణామంగా కాంత మురళి వర్ణించారు. ఇదంతా పైకి చాలా ప్రగతిశీలకంగానే కనిపిస్తుంది. క్విడ్‌ప్రొక్వొ దగ్గరకు వచ్చేసరికి అసలు సంగతులు బయటపడతాయి. పారదర్శక విధానాలు అమలై అది పూర్తిగా అంతరిస్తే బొగ్గు, స్పెక్ట్రమ్, స్టాక్‌మార్కెట్ కుంభకోణాల ఆరోపణ లు తలెత్తేవి కావు. అలాగే భూములు, గనుల కేటాయింపుల్లో, భారీ ప్రాజెక్టుల కాంట్రాక్టులను ఇవ్వటంలో, ప్రభుత్వరంగం బ్యాంకులు పెద్ద ఎత్తున మంజూరు చేసే రుణాల్లో ఆశ్రితపక్ష పాతాన్ని చూపిస్తున్నారనే విమర్శలూ వచ్చేవి కావు.

పోటీతో కూడిన వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాలను పారదర్శకంగా ప్రభావితం చేయటం ఒక పద్ధతి. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఉంది. దీనికి భిన్నంగా రాజకీయ పార్టీలకు గోప్యంగా భారీగా నిధులు సమకూర్చటం, వ్యాపార వర్గానికి చెందిన వారే నేరుగా చట్టసభల్లోకి అడుగు పెట్టటం ఎన్నో వైపరీత్యాలకు దారితీస్తోంది. ఎన్నికల్లో భారీగా డబ్బును వెదజల్లే పరిస్థితి ఇందులో ప్రధానమైంది. సామాన్యుల కు చట్టసభల్లో చోటు లేకుండా పోతోంది. వారి కోసం విధానాల రూపకల్పనా క్షీణించిపోతోంది. అభివృద్ధి ఫలాలను అధికులకు చేర్చే విధానాలు వెనుకంజ పడుతున్నాయి.

చట్ట సభలకు వ్యాపారవర్గాలు ఎన్నికవ్వటం ఎలా పెరుగు తుందో చెప్పటానికి అసీమా సిన్హా 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల నేపథ్యాన్ని విశ్లేషించారు. మొత్తం 542 సభ్యు ల్లో 154 మంది వ్యాపార నేపథ్యం నుంచే వచ్చారు. అంటే 28.4 శాతం మంది అన్న మాట! 1991-96 నాటి పరిస్థితి తో(14.2 శాతం) పోలిస్తే ప్రాతినిధ్యం 100 శాతం పెరిగింది. ఈ ప్రాతినిధ్యం ఇలా పెరుగుతూ పోతే రూపంలో మాత్రమే ప్రజాస్వామ్యం మిగిలి సారంలో ధనస్వామ్యం అధికారం చలా యిస్తుంది! దాని ఛాయలు ఇప్పటికే స్పష్టంగా కనపడుతున్నాయి! ఆదాయ, సంపద పరమైన అసమానతల్లో భారత్ ప్రపంచ రికార్డును స్థాపించటమే ఇందుకు నిదర్శనం. ❑

# కార్పొరేట్ల సంపద పునః పంపిణీకి ఉద్యమిద్దాం

# అంతరాల సమాజానికి అడ్డుకట్ట వేద్దాం

## ప్రజా సంక్షేమ సమాజాన్ని సాధించుకుందాం

**ప్రపంచంలో అత్యంత అసమానతలు వున్న దేశం - భారతదేశం**

**పది శాతంగా వున్న కుబేరుల వద్ద 77 శాతం దేశ సంపద పోగుపడింది.**


**ఒక శాతం వున్న బిలీయనీర్లు, కార్పొరేట్ల దగ్గర 53 శాతం దేశ సంపద**


**దేశ జనాభాలో దిగువన వున్న 50 శాతం దగ్గర కేవలం 4.1 శాతం సంపదే.**

**ఆదాయంలోనూ అంతరాలే..**




**సంపదపరంగా భారతదేశాన్ని విభజిస్తే**




భారత రాజ్యాంగము

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని
సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర
రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి
మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ
న్యాయాల్ని
ఆలోచనా భావప్రకటనా మతవిశ్వాస ఆరాధనా
స్వేచ్ఛను
హోదాల్లోనూ అవకాశాలలోను
సమానత్వాన్ని
సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే
సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభ లో
1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని
స్వీకరించి శాసనీకరించి ఆమోదించి
మనకు మనము సమర్పించుకుంటున్నాము

## నవంబరు 26 - రాజ్యాంగ దినోత్సవం

### రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ దినం

ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో నవంబరు 26వ తేదీకి ముందుగా రాజ్యాంగ వ్యాస రచన, ప్రసంగ పోటీలు నిర్వహించాలి. విద్యా సంస్థలలో సామూహికంగా లేదా తరగతి గదులలో రాజ్యాంగ పీఠికను చదివించాలి. రాజ్యాంగాన్ని గౌరవిస్తానని, పరిపాలన రాజ్యాంగబద్ధంగా వుండాలని, రాజ్యాంగ పీఠిక వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాలు, సాధన కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలి. ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు తమ పని ప్రదేశాలలో రాజ్యాంగ పీఠికను చదివి, ప్రతిజ్ఞ చేయాలి. ప్రజా సంఘాలు తమ సమావేశాలలో లేదా ఆఫీసులలో ఈ కార్యక్రమం నిర్వహించాలి.

**రాజ్యాంగ పీఠక వాగ్దానం చేసిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాల కోసం ప్రతిజ్ఞ చేద్దాం.**

## జనవరి 26 - రిపబ్లిక్ డే

### రాజ్యాంగ పీఠిక దీక్షా దినం

రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26 రిపబ్లిక్ డేను రాజ్యాంగ పీఠిక దీక్షా దినంగా నిర్వహించాలి. ప్రతి పట్టణంలో కార్మిక సంఘాలు, అన్ని ప్రజా సంఘాలు, వృత్తి సంఘాలు రాజ్యాంగ పరిరక్షణ మీద ఆసక్తిగల సంస్థలు, సంఘాలు ఉమ్మడిగా "పీఠిక దీక్షా దినం" జరపాలి. జాతీయ జెండాతో వివిధ సంఘాల బ్యానర్లు, బాడ్జీలతో అన్ని సంఘాల సభ్యులు పాల్గొనేలా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలి. సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం కోసం అందరికీ సమాన అవకాశాల సాధన కోసం సాగే ఉద్యమంగా దీనిని నిర్వహించాలి.

**ప్రాథమిక హక్కుల్ని కాపాడుకుందాం. పౌరుల విధులను నిర్వహిద్దాం. ఆదేశిక సూత్రాల అమలుకు అసమానతలు లేని సమాజం కోసం దీక్షా దినం చేపడదాం.**

# ప్రభుత్వోద్యోగుల్ని ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరేందుకు అనుమతించాలా?

- ఇండియన్ కరెంట్స్ - అనువాదం: బోడపట్ల రవీందర్,

**రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థ. హిందూ రాజ్య స్థాపన దాని లక్ష్యం. కానీ అది మోసపూరితంగా ఒక సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటుంది. అది మన రాజ్యాంగంలో వక్కాణించబడిన భారత జాతీయ వాదానికి విరుద్ధంగా హిందూ జాతీయ వాదం కోసం కృషి చేస్తుంది. ఇది హిందువులను ఒక జాతిగా పరిగణిస్తుంది కాబట్టి దానికి అనుగుణంగానే తన లక్ష్యాలను నిర్దేశించుకుంది. భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి, మన దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని బీజేపీకి చెందిన నాయకులు పదే పదే డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సర్సంగ్ చాలక్ క.సుదర్శన్ 2000 సంవత్సరంలో ఆర్‌ఎస్‌ఎస్ అధినేతగా ఎన్నికైన సందర్భంగా ఇదే విషయాన్ని ప్రకటించాడు. బీజేపీ స్వయం సమృద్ధి చెందిందని, ఎన్నికల ప్రచారంలో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు తమకు అవసరం లేదని, 2024 ఎన్నికలకు ముందు బీజేపీ అధ్యక్షుడు జే.పీ.నడ్డా ప్రకటన చేశాడు. కానీ 2019 ఎన్నికల వరకు బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుగా నిలిచింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిజ్ఞ, ప్రార్థనలు తన లక్ష్యం గురించి మనకు ఏమి చెబుతాయి ?**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని, దాని రాజకీయ సంతతిని రూపొందించడంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్రను, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల రచనలు, వారి చర్యల ద్వారా తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. బీజేపీకంటే ముందుగా ఉన్న భారతీయ జన సంఘ్ స్థాపనలో హిందూ మహాసభ నాయకుడైన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి పనిచేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన సిద్ధాంతకర్త, నాటి ఆర్‌ఎస్‌ఎస్ అధినేత ఎం.ఎస్.గోల్వాల్కర్(గురూజీ), జనసంఘ్ లేక బీజేపీలో శిక్షణ పొందిన ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, ప్రచారకుల పాత్రను గురించి వివరించాడు.

**గోల్వాల్కర్ ఇలా రాశాడు :** "ఉదాహరణకు, మాలో కొంత మంది స్నేహితులకు వెళ్లి రాజకీయాల్లో పనిచెయ్యాలని చెపితే, వారికి దానిలో ఆసక్తి ఉందని లేదా రాజకీయాలు వారికి ప్రేరణ అని అర్థం కాదు. నీరు లేని చోట చేపలు చనిపోయిన విధంగా వారు రాజకీయాల కోసం మరణించరు. ఒకవేళ రాజకీయాల నుండి విరమించుకోవాలని వారికి చెప్పినా వారికి ఎలాంటి అభ్యంతరం ఉండదు. వారి విచక్షణతో ఎలాంటి అవసరం ఉండదు" జనసంఘ్ లేదా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సూచనలను తప్పకుండా అనుసరించాలనే విషయాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది.

**గురూజీ ఇంకా ఇలా చెప్పాడు :** "మా స్వయం సేవకుల్లో కొందరు (కార్యకర్తలు) రాజకీయాల్లో పనిచేసే విషయం మాకు తెలుసు. అక్కడ వారు బహిరంగ సభలు, ప్రదర్శనలకు సంబంధించిన పని చేయాలి. నినాదాలు ఇవ్వాల్సి ఉంటుంది." ఆ లక్ష్యాలకు అనుగుణంగానే ఆర్‌ఎస్‌ఎస్, స్వయం సేవకుల్ని పెంచి పోషించి, శిక్షణ ఇచ్చిన తరువాతనే అనేక సంస్థల్ని ప్రారంభించింది. మహాత్మాగాంధీ హంతకుడైన నాథూరామ్ గాడ్సే ఒక శిక్షణ పొందిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వానికి సంబంధించి ఎలాంటి రికార్డులు ఆ సమయంలో దాచి పెట్టలేదు. కాబట్టి గాంధీజీ హత్యకు సంబంధించి ఆధారాలు ఏవీ దొరక్కుండా ఆర్‌ఎస్‌ఎస్ జాగ్రత్తపడింది. హంతకుడు, ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యుడైన నాథూరామ్ గాడ్సేను సంఘ్ నుండి బహిష్కరించ లేదు. లేదా అతడు ఆ సంస్థను వదిలి పెట్టి వెళ్లలేదని గాడ్సే కుటుంబం విశ్వసిస్తుంది.

**హిందూ జాతీయ వాదంపై విజ్ఞాన సంపన్నుడైన షంసుల్ ఇస్లాం ఇలా పేర్కొన్నాడు :** "ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర ప్రచురణ సంస్థ అయిన సురుచి ప్రకాశన్, ఝుండేవాలన్, న్యూఢిల్లీ 1977లో 'పరమ్ వైభవ్ కే పాత్ పర్' అనే గ్రంథాన్ని ప్రచురించింది. దానిలో వివిధ లక్ష్యాల సాధన కోసం ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించిన 40కిపైగా సంస్థల వివరాలను ఇచ్చారు. మూడు ప్రధాన సంస్థల్లో బీజేపీ ఒక రాజకీయ సంస్థగా ఉంది. ఏబీవీపీ, హిందూ జాగరణ్ మంచ్, విశ్వ హిందూ పరిషత్, స్వదేశీ జాగరణ్ మంచ్, సంస్కార్ భారతి లాంటి సంస్థలు ఆ జాబితాలో ఉన్నాయి. అదేవిధంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన, ప్రతిజ్ఞలు, సంఘ్ అనుచరులు హిందూ దేశానికి కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేస్తాయి. ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన ఇలా : "ఓ ప్రభువా,

**(మిగతా 22వ పేజీలో)**


# భిన్నత్వంలోనే భారతీయత మూలాలు



- రొమిల్లా థాపర్

**ఏ దేశపు గతమైనా సరళ రేఖ కాదు. ఏకైక సాంస్కృతిక జీవనం కాబోదు. భిన్న సంస్కృతులు, జీవన శైలులు, క్రతువులు, ఇరుగు పొరుగు ప్రాంతాల(దేశాల)తో ఆర్థిక, సాంఘిక, వాణిజ్య లావాదేవీల కలబోతలోనే గతం నిండి ఉంటుంది. కానీ ఈ కీలక వాస్తవిక పునాదిని గుర్తించ నిరాకరిస్తోంది హిందూత్వ. హిందూత్వ రాజకీయ కార్యక్రమానికి అనుకూలమైన విషయాలను చరిత్ర పేరుతో సోషల్ మీడియా మొదలు టీవీ సీరియళ్ల వరకూ, పాఠశాల బోధనాంశాల వరకూ ఇష్టం వచ్చినట్లు ఊహాజనిత విషయాలతో నింపటానికి ప్రయత్నం జరుగుతున్నది. దీన్ని ప్రశ్నించకుండా నిజమైన చరిత్రను భావితరాలకు అందించలేము. ఈ అడ్డగోలు వాదనలను ప్రశ్నించటం దేశ ద్రోహం కానే కాదు.**

నిజమైన భారతీయత మూలాలు క్రీస్తు పూర్వం నాటి నుండీ ఉనికిలో ఉన్న సాంస్కృతిక భిన్నత్వంలోనే ఉన్నాయి. కానీ, ఇప్పుడు మన ముందున్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి. సహేతుకమైన ఆధారాల తార్కిక, శాస్త్రీయ విశ్లేషణ మదింపు ద్వారా మాత్రమే ఏ దేశపు గతాన్నైనా తవ్వి తీయటం, అధ్యయనం చేయటం సాధ్యమవుతుంది. గతం గురించి తలెత్తే ప్రశ్నలకు ఒకే రకమైనవో ఒక్క ప్రశ్నకు ఒక్క సమాధానంగానో నిర్ధారించుకోలేని ప్రశ్నలు. సమకాలీన చారిత్రక పరిశోధకులు ఆర్య జాతి ఉనికి గురించిన చర్చను పదే పదే ముందుకు తెస్తున్నందున ఈ ప్రశ్నకు వున్న మూలాలు, నేటి ఏ సందర్భంలో ఈ ప్రశ్న మరోసారి ప్రాధాన్యత పొందిందో లోతుగా పరిశీలించాలి. ప్రస్తుతం రెండు పరస్పర భిన్నమైన కోణాల్లో భిన్న లక్ష్యాలు సాధించే ఉద్దేశంతో ఈ చర్చను ముందుకు తెస్తున్న విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలి. 19వ శతాబ్దంలో సంస్కృతంలో ఉన్న భారతీయ రచనలను అధ్యయనం చేస్తున్న యూరోపియన్ మేధావులకు సంస్కృత భాషకు యూరోపియన్ భాషలకు మధ్య సారూప్యత ఉన్నట్లు కనిపించింది. సంస్కృతం మధ్య ఆసియా ప్రాంతంలో పుట్టి భారతదేశానికి ప్రయాణించి ఇక్కడ స్థిరపడి పోయింది. తొలినాటి భారతీయ ఆర్యులకు, యూరోపియన్ ఆర్యులకు మధ్య జన్యుపరమైన సంబంధం ఉండవచ్చన్న అభిప్రాయం చలామణిలో ఉండేది. ఆర్య అన్న పదం భాషకు సంకేతంగా మారిందే తప్ప జాతికి కాదు.



ఇర్ఫాన్ హబీబ్

క్రీస్తు పూర్వం రెండో సహస్రాబ్ది తొలినాళ్లలో పచ్చిక బయళ్ల కోసం కానీ లేదా పర్యావరణ కారణాల రీత్యాగానీ మధ్య ఆసియా ప్రాంతం నుంచి మొదలైన వలసలు రెండు స్రవంతులుగా ప్రయాణించాయి. ఓ స్రవంతి ఇరాన్ వైపు వలస వెళితే మరో భాగం పశ్చిమ భారతంవైపు వలస వచ్చింది. ఈ వలసల గురించి ఇరాన్ భాషలో వెలువడిన గ్రంథం అవస్థలో వివరంగా ప్రస్తావించారు. ఇరానియన్ ఆర్యులు, ఇండో ఆర్యుల మధ్య భాషాపరమైన సామ్యం ఉండేది. రెండు బృందాల అక్షర మాల దగ్గర దగ్గరగా ఉండేది. వలస పాలన నాటి మేధావులు పూర్వకాలం నాటి వేద సంస్కృతి, పశువుల కాపర్లతో స్థిరీకరించబడిన ఆర్య సంస్కృతి ఒక్కటేనని భావించారు. మాక్స్ ముల్లర్ ఇదే వాదనను ముందుకు తెచ్చాడు. కల్నల్ ఆల్కాట్ వంటి వారు వేదాలతో మొదలుపెట్టి హిందూయిజం వరకూ అనూచానంగా సంబంధం ఉందని వాదించారు. ఇందులో భాగంగానే ఆర్య సమాజ్ వంటి సంస్థల ద్వారా ఆర్యుల సంస్కృతిని ప్రచారం చేయటానికి కృషి జరిగింది. అయితే 1920 దశకం నాటి తవ్వకాల్లో ఆర్యుల నాగరికతకు సుమారు వేయి సంవత్సరాల పూర్వమే భారత గడ్డపై ఉనికిలో ఉన్న సింధు నాగరికత వెలుగులోకి రావటం భారతదేశం అంటే ఆర్యావర్తమేనన్న వాదనకు సవాలు విసిరింది.

1920 నాటి పురావస్తు ఆవిష్కరణల ప్రాధాన్యతను మరుగు పరుస్తూ ఆర్యులే భారతీయ మూలవాసులు అన్న వాదనను నిరూపించే ప్రయత్నమే 1930 దశకంలో హిందూత్వ చరిత్రకు

తొలి పునాదులు వేసింది. భారతీయతకు, హిందూత్వానికి ఇండో ఆర్యన్ నాగరికతే పునాదన్న వాదనతోపాటు భారత దేశ చరిత్ర హిందూ, ముస్లిం ధార్మిక స్రవంతుల మధ్య జరిగిన ఘర్షణ చరిత్రే అన్న వాదన ఈ పునాదులు బలోపేతం కావటానికి దారితీసింది. యాభై ఏళ్లుగా ఈ రెండు సిద్ధాంతాల డొల్లతనాన్ని చరిత్ర పరిశోధకులు రుజువు చేస్తూనే ఉన్నారు. అందువల్లనే హిందూత్వవాదులు నిర్మించబూనుకున్న భారతదేశ చరిత్రకు, చరిత్ర పరిశోధకులు నిర్మించిన భారతదేశ చరిత్రకు మధ్య పొసగని వైరుధ్యం నెలకొంది. వైదిక రచనలు ఈ అధ్యయనానికి కేంద్రంగా ఉన్నాయి. అయితే కాలక్రమంలో అనేక నూతన ఆధారాలు, చరిత్ర పరిశోధనా పద్ధతులు అందు బాటులోకి రావటంతో మొత్తం చరిత్ర పరిశోధన తీరు తెన్నులు కొత్త పుంతలు తొక్కాయి. గతంలో ఏం జరిగి ఉండొచ్చు అన్న ప్రశ్నకు వినూత్న సమాధానాలు ముందుకొచ్చాయి.

భౌగోళిక శాస్త్రం, పురావస్తు పరిశోధనలు, భాషా శాస్త్రం, జన్యు నిర్మాణ శాస్త్రం వంటి రంగాల్లో సాగుతున్న ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలు ప్రాచీన భారత చరిత్ర గురించిన హిందూత్వ ప్రాజెక్టును నిరంతరం సవాలు చేస్తున్నాయి. భౌగోళిక విస్తృతి రీత్యా చూస్తే వైదిక నాగరికత కంటే హరప్ప నాగరికత విశాల భూభాగంలో విస్తరించి ఉంది. హరప్పా కాలం నాటి నివాసాలు, నిర్మాణాలు ఉత్తరాన పామీర్ ముడి మొదలు దక్షిణ భారతం వరకూ, ఒమన్, బెలూచిస్తాన్ వరకూ విస్తరించిందని ఈ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. హరప్పా వాసులు మెసొపటేమియా వాసులకు రాగి వంటి ఖనిజ వనరులు రవాణా చేసినట్లు ఆధారాలున్నాయి. కానీ వేద సంస్కృతికి నేటి ఆఫ్ఘనిస్తాన్–పంజాబ్ మొదలు తూర్పున ఉన్న గంగానదీ పరీవాహక ప్రాంతానికి సాగిన వలసలను మాత్రమే ప్రస్తావిస్తుంది. అంటే రుగ్వేద రచయితలకు డోవాబ్ ప్రాంతానికి అవతల ఉన్న ఇరాన్ ఇరాక్ ఒమన్ ప్రాంతాల గురించి తెలీదు. కానీ అంతకు పూర్వమే ఉనికిలో ఉన్న హరప్పా నాగరికులకు ఈ ప్రాంతంతో ఆర్థిక సాంస్కృతిక లావాదేవీలున్నాయి.

చరిత్ర పరిశోధన మూలవనరుగా భాషా శాస్త్రం పోషించిన పాత్ర తెలుసుకోవటానికి వేదాల్లో ప్రయోగించిన భాష, వర్ణించిన క్రతువులను పరిశోధకులు పరిశీలించారు. భాష, పద ప్రయోగం, వ్యాకరణాల గురించి కూడా అధ్యయనం జరుగు తోంది. వైదిక సంస్కృతం పవిత్రమైన భాషగా గుర్తింపు పొందటంతో 20వ శతాబ్దం ఆరంభం వరకూ భాషా శాస్త్ర ప్రమాణాలకు సంస్కృతం దూరంగా ఉంది. కానీ 20వ శతాబ్ది ఆరంభం నుండీ ఈ ప్రమాణాలు సంస్కృతానికి కూడా వర్తింప చేయటంతో వేదకాలం నాటి సంస్కృతం కూడా సమకాలీన భాషల్లాగానే ఉనికిలోకి వచ్చిన సాధారణ భాష అని తేలిపోయింది.

ద్రవిడ భాషలు అధ్యయనం చేసినా సంస్కృతం గురించి కూడా అవగతమవుతుంది. వేదాల్లో ద్రవిడ భాషకు సంబంధించిన పద ప్రయోగం కూడా కనిపిస్తుంది. ఈ వివరాలన్నీ పరిశీలిస్తే ఇతర సంస్కృతి, జీవన శైలిలను ప్రస్తావించటానికి దస్య, అసుర వంటి పదాలు, దాసవర్ణాలు వంటిపద ప్రయోగం చేశారు. దాసులు దేవుడిని పూజించరు. ఇండో ఆర్యన్ భాషను పలికేటప్పుడు అపశృతులుంటాయి. కాలక్రమంలో దస్యుల్లో సంపన్నులను ఆర్యుల్లో విలీనం చేసుకోవటం మొదలైంది. దీనికి సంబంధించిన అనేక ఉదాహరణలు ఐతరేయ బ్రాహ్మణ గ్రంథంలో కనిపిస్తాయి. ఇదే తరహాలో పురావస్తు శాస్త్ర పరిశోధనలు కూడా అనేక విషయాలను ముందుకు తెస్తున్నాయి.

హిందూత్వ వాదులు చెప్తున్నట్టు భారతదేశం కేవలం హిందూయిజం, హిందూ సంస్కృతి మాత్రమే భారతదేశపు గతం కాదనీ, భారతదేశంలో భాష, సంస్కృతి, జీవనశైలి, ఆహార వ్యవహారాలు వంటి విషయాల్లో వైవిధ్యం, బహుళత్వం, భిన్నత్వం క్రీస్తు పూర్వం మూడో శతాబ్ది నాటికే ఉనికిలో ఉన్నాయని రుజువు చేసే పరిశోధనా ఫలితాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయి. వీటన్నింటి సారాంశం ఆర్యులు భారతీయులు కాదన్నదే. కానీ ఆర్యులు భారతీయులు కాకపోతే హిందూత్వ ప్రాజెక్టు పునాదుల్లోనే కకావికలమవుతుంది. పైన ప్రస్తావించిన చారిత్రక పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక విశ్లేషణలు, జన్యు అధ్యయనాలు ఆర్యులు బయటి ప్రాంతం నుండి వలస వచ్చారని నిస్సందేహంగా రుజువు చేస్తున్నాయి.

ఏ దేశపు గతమైనా సరళ రేఖ కాదు. ఏకైక సాంస్కృతిక జీవనం కాబోదు. భిన్న సంస్కృతులు, జీవన శైలులు, క్రతువులు, ఇరుగు పొరుగు ప్రాంతాల (దేశాల)తో ఆర్థిక, సాంఘిక, వాణిజ్య లావాదేవీల కలబోతలోనే గతం నిండి ఉంటుంది. కానీ ఈ కీలక వాస్తవిక పునాదిని గుర్తించ నిరాకరిస్తోంది హిందూత్వ. హిందూత్వ రాజకీయ కార్యక్రమా నికి అనుకూలమైన విషయాలను చరిత్ర పేరుతో సోషల్ మీడియా మొదలు టీవీ సీరియళ్ల వరకూ, పాఠశాల బోధనాంశాల వరకూ ఇష్టం వచ్చినట్లు ఊహాజనిత విషయాలతో నింపటానికి ప్రయత్నం జరుగుతున్నది. దీన్ని ప్రశ్నించకుండా నిజమైన చరిత్రను భావితరాలకు అందించ లేము. ఈ అడ్డగోలు వాదనలను ప్రశ్నించటం దేశ ద్రోహం కానే కాదు. ఈ దేశాన్ని లౌకిక ప్రజాతంత్ర సమాజంగా కాపాడుకో వాలంటే రంగురంగుల పోస్టులు, పోస్టర్లు, పాఠాల మరుగున పడిన నిజమైన చరిత్రను తవ్వి తీయటమే చరిత్ర పరిశోధన లక్ష్యంగా ఉండాలి. ❑

**(ప్రఖ్యాత చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ 90వ జన్మదినం సందర్భంగా రొమిల్లా థాపర్ ప్రసంగ పాఠం)**

# పాఠ్య పుస్తకాల్లో పొలిటికల్ కూడికలు, తీసివేతలు



- కొప్పర్తి వెంకటరమణమూర్తి

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల సవరణ కాండ ఈ సంవత్సరం కూడా కొనసాగింది. ఈసారి 12వ తరగతి రాజనీతి శాస్త్ర పాఠ్య పుస్తకం 'స్వాతంత్ర్యానంతర భారత రాజకీయాలు'లో చోటు చేసుకున్న మార్పులు చేర్పులూ వాస్తవాలను సగం కప్పి సగం విప్పి, జరిగిన సంఘటనల మీద విద్యార్థులకు పాక్షిక దృష్టిని కలిగిస్తున్నాయి. రెండేళ్ల క్రితం కోవిడ్ నేపథ్యంలో సిలబస్ తగ్గింపు నెపంతో ఈ పుస్తకం నుంచే హిందూ ముస్లిం ఐక్యత కోసం గాంధీ చేసిన కృషి పట్ల హిందు మత తత్వ వాదులు చూపిన వ్యతిరేకత, గాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థల రద్దు వంటి చారిత్రక వాస్తవాల తోపాటూ చిప్కో ఉద్యమం, దళిత పాంథర్స్, మద్య పాననిషేధ ఉద్యమం, నర్మద బచావో అందోళన, సమాచార హక్కు ఉద్యమం వంటి ప్రజా ఉద్యమాలు తొలగించబడ్డాయి. ఈ ఏడాది అయోధ్య సమస్య, గుజరాత్ అల్లర్ల వంతు వచ్చింది. ప్రజాస్వామిక, న్యాయ పద్ధతుల ద్వారా అయోధ్య సమస్య పరిష్కారమైనట్టు పేర్కొంటున్న ఈ పుస్తకం నుంచి గుజరాత్ మారణ హోమం పూర్తిగా మాయమైంది.

మొదటిసారి 2007లో ప్రచురితమై 2023 దాకా కొనసాగిన పాత ప్రతిలో అయోధ్య సమస్య అనే అంశం క్రింద ఉన్న వివరణ సంక్షిప్త రూపం ఇది : బాబ్రీ మసీదు 16వ శతాబ్ది కట్టడం. దాన్ని బాబర్ సేనాని నిర్మించాడు. ఇది శ్రీరాముడు జన్మించిన స్థలంగా భావిస్తున్న చోట నిర్మితమైన ఆలయాన్ని పడగొట్టి నిర్మితమైనదిగా భావింపబడింది. ఈ అంశం చుట్టూ హిందూ ముస్లింలు తమ వర్గాలను సమీకరించుకున్నాయి. ఇది మత హింసకు దారితీసింది. ప్రజల మద్దతు కూడగట్టడానికి బీజేపీ రథయాత్రను నిర్వహించింది. కరసేవకులు 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదును విధ్వంసం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేసింది. దేశవ్యాపితంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కూల్చివేతను విపత్కర సంఘటన (disastrous event)గా అభివర్ణించింది.

కాగా, నవీకరింపబడిన (updated) కొత్తప్రతి 2024లో ప్రచురితమై అమలులోకి వచ్చింది. దీనిలో పైన పేర్కొన్న విషయం మొత్తం తొలగింపబడి క్రింది విషయం వచ్చి చేరింది. దాని సంక్షిప్త రూపం ఇలా ఉంది. ఇది శ్రీరాముని జన్మభూమికి చెందిన వివిధ వాదనలున్న అంశం. 1528లో శ్రీరాముని జన్మ స్థలంలో మూడు గుమ్మటాల నిర్మాణం జరిగింది. దీని మీద హిందూ ప్రతీకలూ, ఆనవాళ్లూ ఉన్నాయి. ఈ పవిత్రస్థలం కోసం సంవత్సరాల తరబడి న్యాయపోరాటం జరిగింది. 1992 లో కట్టడం కూలగొట్టబడినపుడు ప్రజాస్వామ్యం ఒక సవాలును ఎదుర్కొన్నది. చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కారం కుదిరి సుప్రీంకోర్టు ఆ స్థలాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్టుకు రామాలయ నిర్మాణానికి ఇస్తూ, వక్ఫ్ బోర్డుకు వేరొక స్థలం కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మనలాంటి బహుళత్వం కలిగిన సమాజాలు ఈ విధంగా ప్రజా స్వామ్యపద్ధతిలో సమస్యలు పరిష్కరించుకోవాలి. భారతీయ నాగరికతలోనే కలిసిపోయిన ఆ తత్వానికి ఇది సమున్నత ఉదాహరణ అనీ అంటూ 2019 నాటి సుప్రీంకోర్టు తీర్పులోని కొన్ని ఉటంకింపులతో ముగిసింది.

రెండు ప్రతులలోని అంశాల వివరణలో ఎంతో వైరుధ్యం కనిపిస్తుంది. పాత ప్రతిలో Ayodhya dispute అని సమతూకంతో ఉన్న ఉపశీర్షిక కొత్తప్రతిలో తక్కువ తీవ్రత కలిగిన Ayodhya issueగా మారింది. జరిగిన పరిణామా లను పాతప్రతి వాస్తవికంగా, తార్కికంగా, బాహాటంగా వివరించగా కొత్తప్రతి వివరణ నర్మగర్భంగా, ఖాళీలతో, వాక్యాల మధ్య అన్వయలేమితో సాగింది. అక్కడ నిర్మితమైన కట్టడాన్ని బాబ్రీ మసీదుగా పాతప్రతి స్పష్టం చేయగా కొత్తప్రతి దానిని మూడు గుమ్మటాల కట్టడం అనింది. అది ఏమిటో దానిని ఎవరు నిర్మించారో ఇక్కడ జవాబులు లేవు. మసీదు నిర్మాణానికి ముందు ఉన్న ఆలయ ప్రదేశం శ్రీరాముని జన్మస్థలం అనేది ఒక విశ్వాసం అని పాతప్రతి విస్పష్టంగా చెప్పగా, కొత్తప్రతి దానిని శ్రీరాముని జన్మస్థలంగా నిర్ధారించి మాట్లాడింది. చారిత్రక వ్యక్తి జన్మస్థలానికీ, పురాణ వ్యక్తి జన్మ స్థలానికి మధ్య ఉండవలసిన శాస్త్రీయత, ఊహాత్మకతల మధ్య విభజనను కొత్తప్రతి పాటించలేదు. ఏ చారిత్రక ఆనవాళ్లులేని శ్రీరాముడనే పురాణపురుషుడి జన్మస్థలం చారిత్రకం కాజాల దని అది గుర్తించలేదు. (ఇది ఈ దేశంలో మెజారిటీ మతస్థులు అది శ్రీరాముని జన్మభూమేనని కలిగిఉన్న విశ్వాసాన్ని వ్యతిరే కించడం కాదు, శాస్త్రీయమైన అవగాహన కలిగిన అంశాలు మాత్రమే ఉండవలసిన పాఠ్యగ్రంథంలో ఒక విశ్వాసం ఉన్నపుడు 'అది విశ్వాసం' అని చెప్పకపోవడాన్ని మాత్రమే ఖండించడం.) బాబ్రీ మసీదు కూల్చివేతకు ముందు, తర్వాత

జరిగిన పరిణామాలను పాతప్రతి సంక్షిప్తంగానైనా సమగ్రంగా ఉండేటట్లు వివరించగా కొత్తప్రతి దానిని ముందు జరిగిన పరిణామాలను అంటే ఎవరు ఎందుకు కూల్చారో చెప్పకుండా హఠాత్తుగా ప్రస్తావించి వదిలేసింది. మొదటిసారి చదువుతున్న విద్యార్థిని అనేక సందేహాలకు గురిచేస్తుందీ పరిస్థితి. పాఠ్య గ్రంథం విద్యార్థికి వీలైనంత స్వయంగా అర్థం చేసుకునేటట్లుండాలన్న మౌలికసూత్రాన్ని కొత్తప్రతి పాటించలేదు. పైగా మసీదు కూల్చివేతను 'ప్రజాస్వామ్యం ఎదుర్కొన్న సవాలు' గా స్థూలంగా వర్ణించి తప్పించుకోవడానికి చూసిందే కానీ 'లౌకికత్వం ఎదుర్కొన్న ప్రమాదం' అనడానికి సిద్ధపడలేదు. పాతప్రతి హిందూ, ముస్లింలు తమతమ వర్గాలను కేంద్రీకరించుకోగా ఇది 'జాతీయ' సమస్యగా పరిణమించిందని అనగా కొత్తప్రతి మూడు గుమ్మటాల కట్టడం మీద హిందూ చిహ్నాలు ఉండడం 'జాతి' గౌరవానికి సంబంధించిన అంశంగా పేర్కొన్నది. అంటే పాత ప్రతి రెండు మతాలను కలిపి జాతి అని సంబోధించగా కొత్తప్రతి మెజారిటీ మతాన్నే జాతి అని అన్నది. కొత్తప్రతిలో వాచకం మెత్తగా, ఒప్పిస్తున్నట్టు సాగింది కానీ ఈ సమన్వయ దృక్పథం వెనుక అసలు రహస్యం జరిగిన పరిణామాల్ని కప్పిపుచ్చడమేనని అర్థమౌతున్నది. ఇక, పూర్తిగా తొలగింపుకు గురైన పాఠ్యభాగం Gujarat riots. కరసేవకులతో నిండి అయోధ్య నుంచి తిరిగి వస్తున్న రైలు బోగీకి గోద్రా స్టేషన్‌లో ఎవరో నిప్పంటించడం, 57 మంది మరణించడం, అది ముస్లింల దుశ్చర్యగా భావించి వారి మీద మరుసటి రోజు మొదలు నెల రోజులపాటు మారణహోమం సాగటం, 1100 మంది మరణించటం, అందులో అత్యధికులు ముస్లింలు కావడంతోపాటు జాతీయ మానవ హక్కుల కమీషన్ దమన కాండను అదుపుచెయ్యడంలో గుజరాత్ ప్రభుత్వ దారుణ వైఫల్యాన్ని తప్పు పట్టడం వంటి అంశాలున్న ఈ ఉపశీర్షిక మొత్తం ఎత్తివేయబడింది. ఈ అల్లర్లు ప్రభుత్వ యంత్రాంగానికి కూడా మతపక్షపాతం ఉంటుందని రుజువుచేశాయనీ, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడంవల్ల జరిగే ఇటువంటి ప్రమాదాలపట్ల జాగరూకత వహించాలనీ, ఇవి ప్రజాస్వామ్యానికి సవాళ్లు అనీ చేసిన వ్యాఖ్యలు కూడా తొలగించబడ్డాయి.

ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలలో సందర్భం పట్ల మౌలిక అవగాహన కలిగించడానికి అసలైన చారిత్రక పత్రాలు, చిత్రాలు ముద్రింపబడతాయి. ఇవి సందర్భాన్ని చదువరి హృదయానికి, ఆలోచనకూ దగ్గరగా తీసుకువచ్చి మరింత లోతు అధ్యయనం వైపు నడిపిస్తాయి. కొన్ని సందర్భాలలో వాచకంకన్నా ఇవి చూపే ప్రభావం ఎక్కువ. పై రెండు సందర్భాలలో పాతప్రతిలో ముద్రింపబడిన సంఘటనల నాటి వార్తాపత్రికలలో ముద్రింపబడిన వార్తల నకళ్లు కొత్త ప్రతిలో మొత్తంగా మాయమయ్యాయి. వీటిల్లో హిందూస్తాన్ టైమ్స్ ప్రచురించిన 'బాబ్రీ మసీదు విధ్వంసం–కళ్యాణ్ ప్రభుత్వాన్ని రద్దు చేసిన కేంద్రం' అనే శీర్షిక, 'అయోధ్య, బిజెపి దారుణ వైఫల్యం–అద్వానీని ముందే హెచ్చరించాను – కానీ మితవాదులకు ఇక్కడ స్థానం లేదు' అని పయనీర్ ప్రచురించిన వాజ్‌పేయి ఆక్రోశం, పయనీరే ప్రచురించిన 'కూల్చివేతపై పశ్చాత్తపం లేదు' అన్న అద్వానీ బాధ్యతా రాహిత్యం, స్టేట్స్‌మన్ ప్రచురించిన 'ప్రపంచవ్యాపిత ఆగ్రహ ప్రతిస్పందన' అనే వార్త ఉన్నాయి.

గుజరాత్ విషయానికి వస్తే తొలగింపుల్లో హిందుస్తాన్ టైమ్స్ ప్రచురించిన 'మండుతున్న గుజరాత్' అనే వార్త, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన 'కంటికి కన్ను సూత్రంతో గుడ్డిదైన గాంధీనగర్' అనే పతాక శీర్షిక, ఒక పత్రిక (పేరు లేదు) ప్రచురించిన 'గుజరాత్ సంఘటనలు మాయని మచ్చలు– ప్రపంచానికి నా ముఖం ఎలా చూపించను' అన్న వాజ్‌పేయి ఆవేదన, మరో పత్రిక ప్రచురించిన 'ఆగని గుజరాత్ మారణ హోమం' అనే శీర్షిక ఉన్నాయి. వీటితోపాటు తొలగింపుల్లో 1947 ఫిబ్రవరి 27న రాజ్యాంగ పరిషత్తు సలహా సంఘం ముందు 'మైనారిటీలను కాపాడలేమని మన మీద ఉన్న అపప్రథను తొలగించుకుని వాటిని పరిరక్షించుకోవడంలో మనలను మించిన వారు లేరని రుజువు పరచుకోవలసి ఉంది' అన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ మాటలు ఉన్నాయి. అలానే, గుజరాత్ సంఘటనను, వాటి నివారణలో ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా తప్పు పట్టి, ఈ గాయాన్ని త్వరగా మాపుకుని శాంతి యుతమైన, తాళైక్యత (harmony) కలిగిన సమాజం కోసం ఎదురుచూడాలని, ఈ మహత్తర ఆశయసాధన రాజ్యాంగ విలువల పరిరక్షణ ద్వారా సాధ్యపడాలని కాంక్షించిన జాతీయ మానవహక్కుల కమీషన్ 2001–02 వార్షిక నివేదిక ఉటంకింపు కూడా కత్తిరింపబడింది. చివరిగా, అప్పటి ప్రధాని వాజ్ పేయి 'గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రికి నా సందేశం ఒకటే – అతను రాజధర్మాన్ని పాటించాలి. పరిపాలకుడు కులం, మతం, జాతి ఆధారంగా ప్రజలపట్ల వివక్ష చూపరాదు' అన్న మాటలు కూడా తొలగింపబడ్డాయి.

సాధారణంగా ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో ఒక సందర్భాన్ని చదువుతున్నపుడు చదువరికి రావలసిన, లేదా రాదగ్గ అవకాశం ఉన్న ఆలోచనలను, ప్రశ్నలను కార్టూనులద్వారా స్ఫురింపజేయటం ఉంటుంది. అటువంటి రెండు కార్టూనులు కూడా గుజరాత్ సందర్భంలో ఎగిరిపోయాయి. అందులో ఒకదానిలో ఒక యువతి 'మన భవిష్యత్తు ఇలాగే ఉండబోతుందా, దీనిని కేవలం గతకాలపు ఘటనగా మార్చలేమా?' అని అంటూండగా, రెండవదానిలో ఒక యువకుడు 'ఇందుకు బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టలేమా, కనీసం రాజకీయంగానైనా శిక్షించలేమా ? అని ప్రశ్నిస్తూ ఉంటాడు.

ఈ సందర్భంగా ఎన్‌సిఈఆర్‌టి డైరక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ.

'హింసను ప్రేరేపించి, పౌరులను కుంగుబాటుకు గురిచేసే ప్రమాదముంటుందని భావించి' వాటిని తొలగించినట్టు చెబుతూ 'పిల్లలు పెద్దయ్యాక ఎలాగూ తెలుసుకుంటారు. ఇప్పటి నుంచే వాటి గురించి తరగతి గదిలో ఎందుకు ?' అని తమ చర్యనుసమర్థించుకున్నారు (ఆంధ్రజ్యోతి 17.6.24 వార్త). నిజానికి ఈ పుస్తకం చదువుకునే విద్యార్థి వయసు 17 సంవత్సరాలు ఉంటుంది. మరో ఏడాదిలో ఓటు హక్కు లభించే అతనికి/ఆమెకు దేశ రాజకీయాలను దాచిపెట్టి చెప్పవలసిన అవసరం ఏముందీ ? వాటి మీద సరైన అవగాహన రాజనీతి శాస్త్ర గ్రంథం కాక, మరేది ఇవ్వగలదు ? ఒకవేళ, తొలగింపు సమర్ధనే నిజమైతే, అది 1984లో ఇందిరాగాంధీ మరణానంతరం ఢిల్లీలో, ఇతర ఉత్తరభారత ప్రాంతాలలో జరిగిన శిక్కుల ఊచకోతకు కూడా వర్తించాలి. అయినపుడు రెండు వేల మంది శిక్కుల మరణానికి దారితీసిన కారణాలు, అనంతర పరిణామాలూ, చివరికి ఈ దారుణ ఘటనల పట్ల 2005లో అప్పటి ప్రధాని మన్‌మోహన్‌సింగ్ పార్లమెంటులో శిక్కు సమాజంతోపాటు యావత్ భారతజాతిని క్షమాపణలు కోరుతూ తాను సిగ్గుతో తలవంచుకుంటున్నట్టు చేసిన పశ్చాత్తాప ప్రకటనను తొలగించాలి. కానీ, కొత్తప్రతిలో దానిని యథాతథంగా ఉంచేశారు. ఏమిటీ వలపక్షం ? ❑

# ప్రభుత్వోద్యోగుల్ని ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరేందుకు అనుమతించాలా?

(16వ పేజీ తరువాయి)

హిందూ రాజ్యంలో అంతర్భాగంగా వున్న మేము నీకు గౌరవంతో వందనం చేస్తున్నాం/నీ కోసం మేము నడుం బిగించాం/దీని సాధన కోసం మాకు మీ ఆశీర్వాదాలివ్వండి." ప్రతిజ్ఞ కూడా అంతే సూటిగా ఉంది: "నా పవిత్రమైన హిందూ మతం, హిందూ సమాజం, హిందూ సంస్కృతిని పెంపొందించడం ద్వారా భారతవర్ష గొప్పతనాన్ని సాధించడానికి నేను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడిని అయ్యాను." ఆర్‌ఎస్‌ఎస్ ఒక 'సాంస్కృతిక సంస్థ' అనే ముసుగు, అనేక మంది భావోద్వేగాలను ఆకర్షించడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించడానికి ఉపయోగపడుతుంది. ఆర్‌ఎస్‌ఎస్ స్వభావం గురించి స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో పాల్గొన్న

ముఖ్యమైన నాయకులకు స్పష్టత ఉంది. పంజాబ్ శరణార్థుల కోసం వాఘా వద్ద ఏర్పాటు చేసిన ఒక ప్రధాన రవాణా శిబిరంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రదర్శించిన వారి సామర్థ్యం, క్రమశిక్షణ, ధైర్య సాహసాలను గాంధీజీ పరివారంలోని ఒక సభ్యుడు ప్రశంసిం చాడు. 'హిట్లర్ నాజీలు, ముస్సోలినీ నాయకత్వంలోని ఫాసిస్టు లు అలానే ఉంటారనే' విషయాన్ని మర్చిపోకూడదని గాంధీజీ వెంటనే తిరిగి చమత్కరించాడు. **ఆర్‌ఎస్‌ఎస్, ఒక నిరంకుశ దృక్పథం గల మత సంస్థ అని గాంధీ వర్ణించాడు. ఆర్‌ఎస్ ఎస్‌కు ఫాసిజం లక్షణాలు ఉన్నాయని నెహ్రూ అభిప్రాయం.** "ఆర్‌ఎస్‌ఎస్ చాలా రహస్యంగా ఉంటుంది. దాని ఫలితంగానే అది ఫాసిస్ట్ మార్గాల్లో అభివృద్ధి చెందింది. అది కచ్చితంగా ప్రజల శాంతియుత సహ జీవనానికి విఘాతం కలిగిస్తుందని" భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అభిప్రాయ పడ్డాడు.

**సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇలా అన్నాడు :** "గాంధీజీ హత్య కేసుకు సంబంధించి మా వద్ద ఉన్న నివేదికల ప్రకారం ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభల కార్యకలాపాల ఫలితంగా ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలు దేశంలో ఇలాంటి ఘోరమైన విషాదం చోటు చేసుకునే వాతావరణాన్ని సృష్టించాయి. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలు ప్రభుత్వం, రాజ్యం ఉనికికి ముప్పును కలిగించాయి. నిషేధం విధించినప్పటికీ ఆ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టలేదని మా నివేదికలు చెబుతున్నాయి. వాస్తవానికి, సమయం గడిచే కొద్దీ ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు మరింత ధిక్కారాన్ని ప్రదర్శిస్తూ, విధ్వంసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి."

ఆర్‌ఎస్‌ఎస్ మూడుసార్లు నిషే ధించబడి, సాంస్కృతిక సంస్థ అనే ముసుగును ధరించడం ద్వారా ఆ నిషేధం నుండి బయటపడిన విషయాన్ని మనం గుర్తుచేసుకోవాలి. ప్రభుత్వోద్యోగులు రాజకీయాల్లో పాల్గొనడం పై విధించిన నిషేధం, మన (బ్యూరోక్రసీ) ఉద్యోగస్వామ్యం రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉందనీ, రాజకీయ పక్షపాతం లేకుండా ఉందనే విషయాన్ని నిర్ధారిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనే ప్రభుత్వోద్యోగు లపై విధించిన ఈ నిషేధం యాభై సంవత్సరాలకుపైగా అమలులో ఉంది. ఇలా జరగడం ఇది మూడోసారి. జనతా పార్టీ, అటల్ బిహారీ వాజపేయిలు కూడా రాజకీయ వ్యవహారాలకు నాయకత్వం వహించారు. కానీ ఈ నిషేధాన్ని ఎత్తివేయలేదు. నరేంద్రమోడీ గడిచిన పది సంవత్సరాలకు పైగా అధికారంలో ఉంటున్నాడు. ఆయన ఇప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకుంటున్నాడు ? ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్, అత్యున్నత నాయకునిపై విమర్శలు చేస్తున్న తరువాతే ఈ నిర్ణయమా ? భారతీయ సంస్కృతికి, ఆర్‌ఎస్‌ఎస్ అందిస్తున్న సేవలను సాంస్కృతిక కార్యకర్తలు, సామాజిక శాస్త్రవేత్తలు అంచనా వేయాల్సిన అవసరం ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ అనే ముసుగును తొలగించి, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దాని రాజకీయ ఎజెండాను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది అత్యున్నతమైన రాజకీయ వేషం. ❑

# బౌద్ధ విగ్రహాల్నే కాదు, బోధి వృక్షాన్ని కూడా కొట్టేశారు !



- డాక్టర్ దేవరాజు మహారాజు

**బోధి-అంటే జ్ఞానం. బుద్ధుడికి ఏ చెట్టు కింద జ్ఞానోదయ మైందో ఆ చెట్టును బోధి వృక్షం-అని అంటున్నాం. బీహార్‌లో గయా జిల్లాలోని బుద్ధగయలో మహాబోధి మందిర పరిసరాల్లో ఒక రావిచెట్టు ఉంది. దాని కింద సాధారణ శకానికి ముందు 531లో గౌతముడికి జ్ఞానోదయమై బుద్ధుడయ్యాడు. ఈ చెట్టుకు ఆసక్తికరమైన కథ ఉంది. దాన్ని పెళ్లగించి, నాశనం చేయాలని ఎందరు ఎన్నిసార్లు ప్రయత్నించినా అది మళ్లీ మళ్లీ చిగురిస్తూనే వచ్చింది. బౌద్ధాన్ని నాశనం చేయాలని ఎందరు ప్రయత్నించినా, అది ఎలాగైతే విశ్వవ్యాప్తమవుతూ వచ్చిందో బుద్ధగయలోని బోధివృక్షం కూడా అలాగే పునరుజ్జీవనం పొందుతూ వచ్చింది. ఈ విషయం చాలా విచిత్రంగా తోస్తుంది, అయితే అది నిజం!**



ఈ బోధి వృక్షాన్ని నాశనం చేయాలన్న తొలి ప్రయత్నం సాధారణ శకానికి ముందు మూడవ శతాబ్దంలో జరిగింది. అశోక చక్రవర్తి బౌద్ధమతావలంబి అని అందరికీ తెలుసు. కానీ, అతని రాణులలో చివరిదైన త్రిశ్యరక్షిత దొంగచాటుగా ఆ వృక్షాన్ని నరికేయించింది. అప్పుడు అశోకుడు ఎక్కడో సుదూర ప్రాంతం పర్యటనలో ఉన్నాడు. హడావుడిగా కంగారులో చేసిన ఆ ప్రయత్నం వల్ల చెట్టు మొత్తానికి మొత్తంగా నాశనం కాలేదు. కొద్ది కాలానికే ఆ చెట్టు మొలకలు పైకి లేచి పెరగడం ప్రారంభించాయి. ఒక రకంగా అది రెండోతరం వృక్షం- అయ్యింది. సుమారు 800 ఏండ్లు బతికింది. గాంధార ప్రాంతానికి చెందిన త్రిశ్యరక్షితకు అసూయ ఎక్కువ. అశోకుడు బౌద్ధం పట్ల ఎక్కువ ధ్యాస పెట్టడం ఆమెకు ఇష్టం ఉండేది కాదు. ఓర్వలేనితనంతో కుట్రలు చేయడం ఆమె నైజం. అశోకుడి కుమారుడు గుడ్డి వాడు కావడానికి ఈమే కారణం. కుట్రలన్నీ బయటపడి, మొహం చెల్లక, చివరకు ఆత్మహత్య చేసుకుని జీవితం ముగించుకుంది. ఒక రకంగా తన అకృత్యాలకు తనే శిక్ష వేసుకుంది.

ఇక రెండోసారి ఆ వృక్షాన్ని నాశనం చేయాలన్న దురాలోచన ఏడవ శతాబ్దం (జ.ఋ) లో బెంగాల్ రాజు శశాంకకు వచ్చింది. ఇతను బౌద్ధానికి బద్ధ విరోధి. ఆ చెట్టు ప్రాశస్త్యాన్ని భరించలేక పోయాడు. అందుకే అది మళ్లీ పెరగకుండా వ్రేళ్లతో సహా నాశనం చేయాలని ప్రయత్నించాడు. చెట్టు మొదటికే నరికేయించి, వ్రేళ్లను తగులబెట్టించాడు. అయినా ఈసారి మరో అద్భుతం జరిగింది. కొన్నేళ్ల తర్వాత కాలకుండా ఉండి పోయిన భూమి లోలోపలి పొరల్లోని వ్రేళ్లు మళ్లీ ప్రాణం పోసుకుని మొలకెత్తాయి, మొక్క పైకి లేచింది. దీన్నే మూడవ తరం వృక్షం అని అన్నారు. ఇది సుమారు 1250 ఏండ్లు బతికింది. సాధారణ శకం 1876లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆ చెట్టు విరిగిపోయి, బాగా నాశనమైపోయింది. భారతదేశ ఆర్కియాలజీ విభాగపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న నాటి బ్రిటీషు అధికారి లార్డ్ అలెగ్జాండర్ కన్నింగ్హామ్ 1880లో శ్రీలంక అనురాధపురం నుంచి బోధి వృక్షపు శాఖను తెప్పించి మళ్లీ అక్కడే బుద్ధ గయలో నాటించా డు. ఒక రకంగా ఇప్పుడున్నది నాలుగవ తరం వృక్షం అని చెప్పుకోవచ్చు-బ్రిటీష్ కాలంలో దేశంలోని బుద్ధ స్థావరాలన్నిం టినీ తవ్వించి గత చరిత్రను వెలుగులోకి తెచ్చినవాడు కన్నింగ్హామ్. ఒకప్పుడు బుద్ధ గయలోని బోధివృక్షం నుండి చిన్న మొలకను తీసుకుపోయి, అక్కడ శ్రీలంకలోని అనురాధ పురంలో నాటించింది అశోక చక్రవర్తి కూతురు-సంఘమిత్రే. ఏండ్లకేండ్లు గడిచిన తర్వాత-మళ్లీ శ్రీలంక-అనురాధపురం నుండే కన్నింగ్హామ్, అదే బోధి వృక్షాన్నుండి మొలక తెప్పించి మళ్లీ ఇక్కడ బుద్ధగయలో నాటించడం విశేషం ! ఆ విధంగా ఆ బోధి వృక్షం తనను తాను సంరక్షించుకున్నట్టయ్యింది. సాధారణ శకా నికి ముందే శ్రీలంక ఒక బౌద్ధ దేశంగా ప్రసిద్ధి పొందింది. ఇప్ప టికీ ప్రపంచస్థాయి

బౌద్ధ క్షేత్రాలలో ఇది ముఖ్యమైంది. మధ్యప్ర దేశ్ రాజధాని భోపాల్‌కు విదీశాకు మధ్య గల సలామత్‌పూర్ కొండ మీద 2012 జ.జులో అప్పటి శ్రీలంక అధ్యక్షుడు మహేంద్రరాజపక్సే తన వెంట తెచ్చిన బోధి మొక్కను స్వయంగా నాటాడు. ఇప్పుడు అది ఒక వివిఐపి వృక్షం. రాష్ట్ర వ్యవసాయ శాఖ నుండి ఒక వృక్ష శాస్త్రవేత్త వచ్చి చెట్టు ఆరోగ్యం పరీక్షించి వెళతాడు. వృక్ష రక్షణ కోసం ఎల్లప్పుడూ అక్కడ పోలీసు నిఘా ఉంటుంది. ఇది యునెస్కో గుర్తించిన సాంచీ బుద్ధిస్ట్ కాంప్లెక్స్‌కు ఐదు కి.మీ. దూరంలో ఉంటుంది. బౌద్ధ దేశం గనక, శీలానికి ప్రాధాన్యత ఇచ్చే దేశం గనక–మొదట శ్రీలంక పేరు శీలాన–శిలోన్ అని ఉండేది. అదే వాడుకలో సిలోన్ అయ్యింది! బౌద్ధాని కి 'పంచశీల' రూపొందింది.

- 1. ప్రాణుల్ని హత్య చేయకుండా ఉండే శీలాన్ని (గుణాన్ని) నేను స్వీకరిస్తున్నాను.
- 2. దొంగతనం చేయకుండా ఉండే శీలాన్ని స్వీకరిస్తున్నాను.
- 3. వ్యభిచారం చేయకుండా ఉండే శీలాన్ని నేను స్వీకరిస్తున్నాను.
- 4. అసత్యమాడకుండా ఉండే శీలాన్ని నేను స్వీకరిస్తున్నాను.
- 5. మత్తు కలిగించే మదిర, ఇతర మాదక ద్రవ్యాలు సేవించ కుండా ఉండగలిగే శీలాన్ని స్వీకరిస్తున్నాను అని బౌద్ధం స్వీకరించేవారు. ప్రతిన బూనుతారు.
- బుద్ధం శరణం గచ్ఛామి–నేను బుద్ధుడి శరణులోకి వెళుతు న్నాను. ధ్ధమ్మం శరణం గచ్ఛామి–నేను ధర్మం శరణులోకి వెళుతున్నాను. సంఘం శరణం గచ్ఛామి–నేను సంఘం శరణలోకి వెళుతున్నాను–అంటూ తథాగత భగవాన్ అర్హంత్ సమ్యక్ సంబుద్ధకు నమస్కరించుకుంటారు.

వైదిక మతస్థులు తమ ధర్మాన్ని తాము ప్రచారం చేసుకోవచ్చు. కానీ, అది అంత సులభమైన పనిగా అనిపించ లేదు. అప్పటికే ఆసియా దేశాలన్నింటా బౌద్ధం బలంగా నాటుకుపోయింది. దాన్ని నాశనం చేసి, ఆ స్థానాన్ని ఆక్రమించాలన్న కుట్రలో భాగంగానే బౌద్ధ విగ్రహాల్ని, బౌద్ధారామాల్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని వాటి రూపు రేఖలు మార్చి, వారి ఇష్ట ప్రకారం కల్పిత దేవీ దేవతల దేవాలయాలుగా ప్రచారం చేశారు. వారి జీవనాధారం వారు చూసుకున్నారు. పాలి, ప్రాకృత భాషల్ని మరుగుపరిచి, సంస్కరించబడ్డ తమ సంస్కృతానికి ప్రాధాన్యమిచ్చుకున్నారు. పైగా ఆ భాష తమ పురోహిత వర్గం లో మాత్రమే ఉండే విధంగా కట్టుదిట్టం చేసుకున్నారు. బౌద్ధం లోని పదాలు వేరు, వైదిక మతస్థులు మార్చుకున్న అర్థాలు వేరు. ఆ రెండూ ఒకటేనేమో అని చాలామంది పొరబడుతున్నారు. ఉదాహరణకు ధమ్మపదంలోని ధమ్మం వేరు. మూలకాల కలయికతో ఏర్పడే రసాయని క ధర్మం వేరు. 'ధర్మం చెయ్యి బాబూ!' అని అర్థించడంలోని ధర్మం వేరు. ఆలోచించగల వారికే ఆ తేడా తెలుస్తుంది. బౌద్ధంలో జ్ఞానోదయం పొందిన దివ్యుల్నే– 'దేవతలు' అంటారు. వైదికులు ఊహించుకున్న వారిని దేవతలు–అని అంటారు. అక్కడ జ్ఞానంతో పనిలేదు. వారి దేవతలకు మహి మలు వుంటాయని భావిస్తారు. వైదిక మత విరోధి అయిన బుద్ధుణ్ణి, సాధారణ శకం ఏడవ శతాబ్దం తర్వాత మెల్లగా వైది కులు తమ దశావతారాల్లో కలుపుకున్నారు. సా.శ:. 8వ శతాబ్దంలో శంకరాచార్య తన 'దశావతార స్తోత్రం'లో బుద్ధుణ్ణి యజ్ఞ విరోధిగా వర్ణించారు. విష్ణు సహస్ర నామాల్లో 782–806 మధ్య 24 పేర్లు బుద్ధుడికి సంబంధించినవే. వీటిలో బుద్ధుణ్ణి అహింసావాదిగా యజ్ఞాల్ని నిరసించిన వాడిగానే చెప్పారు. శ్రీనాథుడి శృంగార నైషధంలో, ముద్దు పళని–రాధికా స్వాంతనంలో జయదేవుడి అష్టపదుల్లో బుద్ధుడు జీవకారుణ్య మూర్తిగా – యజ్ఞ విరోధిగానే వర్ణించ బడ్డాడు. ఇక బ్రాహ్మణుడికి వైదికులు ఇచ్చుకున్న అర్థం వేరు. బౌద్ధం చెప్పిన అర్థం వేరు. జన్మ వల్లనో, గోత్రం వల్లనో, లేక వివిధ రకాల జడలు, పిలకలు ధరించినందు వల్లనో ఎవరూ బ్రాహ్మణులు కాదు. సత్యం పలికేవారు, ధర్మాన్ని ఆచరించే వారు, మనో వాక్కాయ కర్మలందు శుచీ, శుభ్రత గల వారు మాత్రమే బ్రాహ్మణులు – అని ధమ్మపథంలోని ఒక గాథ చెపు తుంది. బౌద్ధం ప్రకారం శీల సంపదగలవాడే బ్రాహ్మణుడు, బ్రాహ్మణ 'కులం'లో పుట్టినవారు కాదు. మనుశాస్త్రంలోని – కుల వ్యత్యాసాల్ని – పురుషాధిపత్యాన్ని, శూద్ర కులాల బానిసత్వాన్ని, అస్పృశ్యతను బుద్ధుడు తీవ్రంగా వ్యతిరేకించారు.

వజ్రయాన కాలంలో రాజులు బుద్ధుణ్ణి బౌద్ధ భిక్షువుగా కాకుండా, ఆయన యువరాజుగా ఉన్నప్పటి శిల్పాలను చెక్కించారు. ఆయనకు 'అవలోకేతేశ్వర' అని నామకరణం చేశారు. ఆ అవలోకేతేశ్వర విగ్రహాలే చాలా హిందూ దేవీ దేవతలుగా మార్పు చెందాయి. బుద్ధుని నైతిక ధర్మాన్ని నాశనం చేయడం కోసం బ్రాహ్మణార్యులు ఉద్దేశ పూర్వకంగా శివుడు, కృష్ణుడువంటి పాత్రలు సృష్టించి, వీటితో అసభ్యకరమైన కథలల్లి బుద్ధుణ్ణి అవమానపరిచారు. విషయం లోతుగా అర్థం చేసుకోవాలంటే, ఎవరికైనా సరే సహనం, సంయమనం అవసరమౌతాయి. ల–రలతో తమిళంలో అసలు మాటలు లేవు. లంక–రావణ వంటి పదాలు ద్రావిడ సంస్కృతిలో లేవు. అవి ఉత్తర భారతదేశం నుండి వచ్చినవి. పుష్యమిత్రుని దృష్టిలో ఉంచుకుని రాముడి పాత్రను సృష్టించారు. అశోకుడి రాజ భవనాన్ని దృష్టిలో ఉంచుకుని రావణుడి భవనానికి రూపకల్పన చేశారు. మౌర్యుల రాజ మందిరం అగ్నికి ఆహుతి కావడం, అందుకు సంబంధించి ఆధారాలు దొరకడం వల్ల ఆంజనేయుడి లంకా దహనాన్ని సృష్టించారు. ఇక ఆంజనేయుడు తన తోకతో లంకను తగులబెట్టాడని చెపుతున్నవన్నీ 'బౌద్ధ చైత్యాలు'! మరి ఆంజనేయుడనే కల్పిత

**(మిగతా 29వ పేజీలో)**



# ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి నిర్మాణాత్మక సూచనలు

- వడ్డే శోభనాద్రీశ్వరరావు



**మహారాజశ్రీ గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ముఖమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి..**

**పార్లమెంటు మాజీ సభ్యులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాయు లేఖ**

అయ్యా,

గత ఐదేళ్ల వై.ఎస్.ఆర్.సి.పి. పరిపాలనలో రామాయపట్నం, బందరు పోర్టుల వద్ద బ్రేక్ వాటర్స్ నిర్మాణం, కొన్ని నూతన మెడికల్ కాలేజీల స్థాపన, విజయవాడలో బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం కాంప్లెక్స్ నిర్మాణం మొదలైన కొన్ని కార్యక్రమాలు చేపట్టినా, కాల్వలు, డ్రెయిన్లు, రహదారుల నిర్వహణ, ఇరిగేషన్ డ్యాంల నిర్వహణ, గేట్లు బాగుచేత వంటి విషయాలపై ఏ మాత్రం శ్రద్ధ చూపని అసమర్థపాలన సాగించారు. ఇసుక, మద్యం, పేదలకు ఇండ్ల స్థలాల కోసం భూసేకరణ స్కాంలు, ప్రైవేట్, ప్రభుత్వ భూముల కబ్జాలు, ప్రతిపక్షాల వారిపై భౌతిక దాడులతో కొనసాగిన అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. తిరిగి రాష్ట్రంలో పాలనను గాడిలో పెడతారని, అన్ని ప్రాంతాలలోని, అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధిని చేకూరుస్తారని, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తారని, చట్టబద్ధ పాలనను అందిస్తూ, రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితులను ఏర్పరుస్తారనే గంపెడాశతో టి.డి.పి.కి భారీ మెజారిటీతో అధికారాన్ని ప్రజలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు తక్కువ సమయంలో భూము లు స్వాధీనం చేసుకోగలగటానికి (MODEL CONCLUSIVE LAND TITLING ACT) రాష్ట్ర ప్రభుత్వాలకు పంపగా, వై.ఎస్.జగన్ సదరు చట్టాన్ని మార్పులు చేసి, రైతులకు, భూ యజమానులకు మరింత నష్టం జరిగేలా మార్చినందున, మీరు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా అధికారాన్ని చేపట్టిన వెంటనే ఆ చీకటి చట్టాన్ని ఉపసంహరించినందుకు రైతుల పక్షాన అభినందనలు, ధన్యవాదములు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గత ప్రభుత్వం వలన రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్లు రుణభారం వున్నందున, ఉన్న నిధులను అతి త్వరలో తక్కువ ఖర్చుతో సత్ఫలితాలను ఇవ్వగల స్కీమ్‌లను చేపట్టి ఎక్కువ మంది ప్రజలకు మేలు చేకూర్చాల్సి వుంది. రాష్ట్ర విభజన దరిమిలా నవ్యాంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా నిర్ణయించినందున, ఆనాడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గడ్డుగా వున్నందున, 35 వేల మంది రైతులు సుమారు 33,700 ఎకరాల భూములను 'ల్యాండ్ పూలింగ్' విధానంలో అందించి చరిత్రను సృష్టించారు. ఏపీసీఆర్‌డీఏతో రైతులు చేసుకొన్న అగ్రిమెంట్ ప్రకారం మూడేళ్లలో రైతులకు కేటాయించిన నివాస-వాణిజ్య ప్లాట్ల లే అవుట్లను రహదారులు, డ్రైన్లు, మున్నగు మౌలిక వసతులతో సహా అభివృద్ధి చేయాలని ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ పూర్తికాలేదు. మన సొంత గడ్డపై నుంచి పరిపాలన సాగాలనే లక్ష్యంతో సెక్రటేరియట్, శాసనసభ-శాసనమండలి, సముదాయం మరియు ఏపీ హైకోర్టు భవనాలను నిర్మించి ప్రభుత్వ పరిపాలన సాగించారు. వనరుల కొరత వలన ఉద్యోగులు, శాసనసభ్యులు, న్యాయమూర్తుల కోసం నిర్మించబడిన భవనాలను పూర్తి చేసి సంబంధీకులకు అందించటం జరగలేదు.

రాష్ట్ర ప్రభుత్వం రాజధానిలో సుమారు రూ.10,150 కోట్లు ఖర్చు చేసింది. విభజన చట్టంలో హామీ ఇవ్వబడిన విధంగా రాజధానికి అవసరమైన ప్రభుత్వ భవనాలకు, మౌలిక వసతుల కు రూ.17 వేల కోట్లు అవసరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలియపరిచినప్పటికీ కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి వచ్చింది.

100 అడుగుల లోతు నుండి PILE FOUNDATION లతో సెక్రటేరియట్‌కు జి-7 అంతస్థులకు డిజైన్ చేసినప్పటికీ జి-1 అంతస్తులు మాత్రమే వెలగపూడి సమీపంలో నిర్మించటం జరిగింది. అసెంబ్లీ - కౌన్సిల్ కాంప్లెక్స్ మరియు హైకోర్టు భవనములు, నిర్మించబడటం వాటిలో కార్యకలాప ములు అప్పటి నుండి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇవి వుండగా, తిరిగి భారీ వ్యయంతో 40 అంతస్తుల బ్లాక్లు 4-46 అంతస్తుల బ్లాకు 1లలో నూతన ఐకానిక్ సెక్రటేరియట్, నూతన ఐకానిక్ అసెంబ్లీ-కౌన్సిల్ కాంప్లెక్స్ మరియు నూతన ఐకానిక్ హైకోర్టు భవనములను కట్టాలనే ప్రతిపాదనను ప్రస్తుత పరిస్థితులలో వాయిదా వేయటం సముచితమని భావిస్తున్నాను. ముందుగా

రైతులకు ఇచ్చిన ప్లాట్ల లేఅవుట్లకు రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యములు వెంటనే కల్పించాలి. అలాగే విజయవాడ పడమర బైపాస్ నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చింది. తూర్పు బైపాస్ నిర్మాణ ఆవశ్యకతను కేంద్ర ఎన్.హెచ్.ఎ.ఐ. గుర్తించి ఆమోదించి ముందుకు తీసుకువెళ్ళ దానికి సిద్దంగా వున్నట్లు తెలుస్తూ వుంది. ఇట్టి పరిస్థితులలో 1250 ఎకరాల భూమిని సేకరించి 97 కిలోమీటర్ల అంతర్ వలయ రహదారిని రూ.6,900 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో నిర్మించవలసిన అవసరం ఇప్పట్లో ఎంత మాత్రం లేదు. భవిష్యత్లో 25 లేక 30 సంవత్సరాల తర్వాత బహుశా అవసరం కాగల ఔటర్ రింగ్ రోడ్డు (ఒ.ఆర్.ఆర్) కొరకు ఇప్పుడే వేలాది ఎకరాల భూసేకరణ చేయాలనుకోవటం, రోడ్డు నిర్మించాలను కోవటం (వ్యయం కేంద్ర ప్రభుత్వానిదే అయినప్పటికీ) సరికాదు. హెచ్.ఎమ్.డి.ఎ.లో వలేగాక కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఏటా కనీసం 2 పంటలు పండే వ్యవసాయ భూములను సేకరించవలసి వుంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయాధారిత రాష్ట్రం. కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార, నాగావళి, మహేంద్ర తనయ మున్నగు పలు నదులు వున్నప్పటికీ ఇప్పటికి లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు వర్షాధారముగానే వున్నాయి. సాగు నీటి సదుపాయం కల్పించినప్పుడు పంటల దిగుబడులు, ఉత్పత్తి పెరిగి, రైతులకు అధిక ఆదాయం, వ్యవసాయ కార్మికులకు ఎక్కువ పనిదినాలు లభించుతాయి.

పట్టిసీమ ద్వారా 80 టి.యం.సి.లపైగా గోదావరి నీరు కృష్ణా ఆయకట్టుకు చేరుతూ వుంది. (పోలవరం ప్రాజెక్టు వలన సిద్ధించు ప్రయోజనం) పోలవరం జాతీయ ప్రాజెక్టును విభజన చట్టంలోని హామీ ప్రకారం ప్రారంభం నుండి చివరి వరకు పూర్తి చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అందువలన కేంద్రం నుండి నిధులు రాబడుతూ, ఎడమ కాల్వ పనులు కొనసాగించటం, పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయుటకు ప్రాధాన్యతనిస్తూ, ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి కొనసాగించాలి. రాష్ట్ర ప్రభుత్వ నిధులను ఇప్పటికే నిర్మాణంలో వున్న వంశధార-నాగావళి లింకు, వెలుగొండ, 1-2 దశలు, గాలేరు-నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ, మున్నగు పథకాలను పూర్తి చేసేందుకు, మరియు గుంటూరు చానల్ పర్చూరు వరకు పొడిగింపు, పల్నాడులో వరికపూడిశెల మున్నగు చిన్న నీటి పథకాలను, వివిధ జిల్లాల్లో వున్న చిన్నచిన్న నదులపైన, డ్రైన్ల పైన చెక్ డ్యాంలు నిర్మించి లిఫ్ట్ స్కీంల ద్వారా సాగునీటి సౌకర్యాన్ని విస్తరింపచేయాలి. నాగార్జునసాగర్ 2వ దశ, వైకుంఠపురం బ్యారేజ్ పనులను ముందుకు తీసుకు వెళ్ళాలి. ఇప్పటికే గుండ్లకమ్మ నిర్మాణం పూర్తయినా, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ పనులు, అలాగే రాయలసీమలో చెరువులకు కలుపు కాలువల నిర్మాణం మున్నగునవి పూర్తికానందున నిర్దేశిత ఆయకట్టుకు పూర్తి ప్రయోజనం చేకూరటం లేదు.

శ్రీశైలం ప్రాజెక్టు Apron ప్రంజ్ పూల్ వద్ద భారీ వరద వలన భారీ గొయ్యి ఏర్పడింది. 2009 భారీ వరద పునరావృతమైతే డ్యాం భద్రతకు ప్రమాదం వుంటుందని పలు నివేదికలు హెచ్చరిస్తూ ఉన్నప్పటికీ, రెండు దశాబ్దాల కాలం గడచినా ఇప్పటి వరకు గోతిని పూడ్చకపోవడం ఎంతమాత్రం సరికాదు. పొరపాటున శ్రీశైలం డ్యాంనకు ప్రమాదం జరిగితే సంభవించగల నష్టాలు అంచనాలకు అందవు. కావున సాధ్యమైనంత త్వరలో సదరు గోతిని పూడ్చవలసి వుంటుంది. ఎన్.టి.ఆర్. గారు సీఎంగా ప్రకాశం జిల్లాలో ఎన్. జయప్రకాశ్ కలెక్టరుగా వుండగా, పలు వాగులపైన రైతుల భాగస్వామ్యంతో చెక్ డ్యామ్లు కట్టి, లిఫ్టు ఏర్పాటు జరిగిన విధానాన్ని ఇతర జిల్లాలలో కూడా అమలు చేయాలి.

1999-2004 మధ్యన సాగు నీటి సంఘాలతో చెరువులలో పూడికలు తీయించటం, చెక్ డ్యాంలు నిర్మాణం, కాంటూరు కందకాలు మున్నగు జల సంరక్షణ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యాలతో చేపట్టటం జరిగింది. 2014-19 మధ్య కాలంలో ప్రజల భాగస్వామ్యాన్ని జోడించనందున సరైన ఫలితాలు చేకూరలేదు. నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఏర్పడింది. భూముల రీసర్వే జరగవలసిన ఆవశ్యకతను గుర్తిస్తూనే, అదే సమయంలో తగు వ్యవధి ఇచ్చి, రైతులకు నష్టం చేకూరని విధంగా భూ యజమాని భూ విస్తీర్ణం, సర్వే నెంబరు-సబ్ డివిజన్, సరిహద్దుదారుల వివరాలతో పాస్ పుస్తకములు ఇవ్వవలసి వుంటుంది. లోగడ వై.ఎస్.జగన్ ఫొటోలతో ఇవ్వబడిన పట్టాదారు పాస్ పుస్తకములను రద్దు పరచి, తిరిగి ప్రభుత్వ మెహరుతో ఇచ్చుటకు, జగన్ ఫొటోతో ముద్రించబడిన సర్వే రాళ్ళను తొలగించి వేరే రాళ్ళను ఏర్పాటు చేయటం అవసరం. 32 మంది ఆత్మ బలిదానంతో (తెలుగు ప్రజలు) ఆంధ్రులు సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితులలోనూ అమ్మేందుకు అంగీకరించ రాదు. అవసరమైన ఐరన్ మరియు బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్కు కేటాయించేలా కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావలసి వుంటుంది.

కేజీ బేసిన్లో సగం వాటాను మన రాష్ట్రం సాధించుకుంటేనే ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చాలా దోహదపడుతుంది. కాకినాడ ప్రాంతంలో లోగడే ఎక్వైర్ చేసిన వేలాది ఎకరాల భూములలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ స్థాపన ఈనాటికీ జరగలేదు. ఇప్పుడు బి.పి.సి.ఎల్ సహకారంతో పెట్రోలియం రిఫైనరీస్ & పెట్రో కెమికల్ కాంప్లెక్స్ను కాకినాడలో కాని, మచిలీపట్నంలో కాని ఏర్పాటు చేయించండి. ప్రతి మండల కేంద్రంలో చిన్నపాటి ప్రభుత్వ స్థలంలో గాని, ఏఎంసీ ఆవరణలో గాని, రైతు బజారును ఏర్పాటు చేసి, రైతులు

పండించే కూరగాయలు, పండ్లు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు అమ్మే అవకాశం ఏర్పరచాలి. కూరగాయలు, పండ్లు వృథా కాకుండా నివారించుటకు రైతు బజార్లలో ఒక చిన్న గదిని నిర్మించి, దానిలో 1 లేక 2 ఏసీ మిషన్లు ఏర్పాటు చేసి రైతులకు మేలు చేకూర్చాలి. లోగడ 1999-2004 మధ్య దాదాపు ప్రతి మండల కేంద్రంలో పి.హెచ్.సి. భవనాలను నిర్మించి వైద్య సేవలను మెరుగుగా అందించుటకు కృషి జరిగింది. ఇప్పుడు పెద్ద గ్రామాలలో ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు, ఢిల్లీలోని "మొహల్లా క్లినిక్" తరహాలో చిన్న వైద్యశాలలను ఏర్పరచి పేదలకు, సామాన్యులకు వైద్య సేవలు అందించేం దుకు కృషి జరగాలి. ఉపాధ్యాయుల యొక్క వేతనాలు గణనీయంగా పెరిగినా, విద్యా ప్రమాణాలు తగినంతగా పెరగటం లేదనేది కనిపిస్తూనే వుంది. ఈ అంశంపైన వివిధ వర్గాలతో చర్చించి పాఠశాలలలో విద్యా ప్రమాణాలు మెరుగయ్యేందుకు చర్యలు చేపట్టాలి. ఉన్నత విద్యనభ్యసించిన వారిలో నైపుణ్య కొరతను అధిగమించేందుకు "స్కిల్ డెవలప్‌మెంట్ కోసం గతంలో మీరు చేపట్టిన చర్యలను మరింత విస్తృతపరచాలని సూచిస్తున్నాను. రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళిక రూపొందించు సమావేశంలో సన్న, చిన్నకారు రైతులకు ప్రత్యేకంగా కౌలు రైతులకు, పేదలకు తప్పనిసరిగా బ్యాంకు రుణం లభ్యమయ్యేందుకు నిర్ణయాలు జరగాలి. ఈ లేఖ మిమ్ములను విమర్శించుటకు ఉద్దేశించినది కాదు. 2014 నుండి 2019లో విజయవాడ, విశాఖపట్నం నగరాలలో మెట్రో రైళ్లను, ఒ.ఆర్.ఆర్., ఐ.ఆర్.ఆర్. "అమరావతి - బెంగుళూరు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే" పథకాలతోపాటు "పోలవరం, అమరావతి" రెండు అంశాలనే ప్రాధాన్యతాంశాలుగా పదేపదే మాట్లాడటం, భారీ సంఖ్యలో రైతుల పొలాలను 22 చుక్కల భూముల జాబితాలో చేర్చటం, గ్రామస్థాయిలో జన్మభూమి కమిటీల ఏర్పాటు మున్నగు అంశాలు ప్రజలలో అసంతృప్తికి దారితీసి ఒక్క పర్యాయం చూద్దామని వై.ఎస్.ఆర్. కుమారునిగా వై.ఎస్. జగన్‌కు అవకాశం ఇచ్చి, దరిమిలా లెంపలు వేసుకున్నారు. అటువంటి పరిస్థితులు తిరిగి పునరావృతం కాకూడదనే కాంక్షతో ఈ లేఖ రాస్తున్నాను. ఇప్పుడు టి.డి.పి. సహకారంతో కేంద్రంలో ప్రభుత్వం వుంది. రాష్ట్ర సమస్యలు, రాష్ట్రాభివృద్ధితోపాటు రైతాంగం యొక్క నూటికి నూరుపాళ్ళు న్యాయమైన డిమాండ్లు.

- 1.సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం +50% (d¾2+50%) చట్టబద్ద యం.ఎస్.పి. మరియు
- 2.ఒక్క పర్యాయం పంట రుణాల మాఫీ.
- 3.గ్రామీణ M.G.N.R.E.G.Pని వ్యవసాయానికి అనుసంధానం చేయుట.
- 4.రైతుల వ్యవసాయ పంపు సెట్లకు ప్రీ-పెయిడ్ ఎలక్ట్రిసిటీ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలి.
- 5.సుదీర్ఘ పోరాటాల ద్వారా కార్మికలోకం సాధించుకున్న 42 కార్మిక చట్టాలను రద్దు పరిచి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను కేంద్రంతో మాట్లాడి ఉపసంహరింప చేయండి.
- 6. మహారాష్ట్రలో 196, యు.పి.లో 116, కర్ణాటకలో 73 షుగర్ ఫ్యాక్టరీలు కేంద్ర నూతన ఇథనాల్ విధానమును అనుసరిస్తూ పనిచేస్తూ వుండగా మన రాష్ట్రంలో సహకార చక్కెర ఫ్యాక్టరీలు 10లో కేవలం 1, ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీలు 19లో కేవలం 4 మాత్రమే పనిచేస్తూ వుండటం అత్యంత దురదృష్టకరం. తమరు చొరవ తీసుకుని షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలను రైతు, కౌలు రైతు సంఘాలను, కార్మిక సంఘాలతో చర్చించి ఫ్యాక్టరీలు నడిచేందుకు తగు చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను.
- 7.ప్రకాశం జిల్లా పామూరు వద్ద National Investment Manufacturing Zone (NIMZ) ను అభివృద్ధి చెయ్యాలి.
- 8.జగన్ స్వార్థానికి బలైన లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను రైతులకు తిరిగి వాపస్ ఇవ్వాలి.
- 9.ప్రపంచ ఆకలి సూచికలో భారత్ స్థానం 111 / 125. ఎ.పి.లో ఐదేళ్ళలోపు పిల్లలు 32% అండర్ వెయిట్, 31% Stunded, నేపథ్యంలో అన్న క్యాంటిన్లను పునః ప్రారంభించడం చాలా మంచి పని. పేద గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఆహారంతోపాటు రోజూ ఒక కోడిగుడ్డు మరియు చిన్నపిల్లలకు పాలు ఇచ్చే ఏర్పాటు చేయించండి. ఈ పథకం నిర్వహణలో రోటరీ, లయన్ లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలను, దాతలను, ఎన్.ఆర్.ఐ.లను భాగస్వాములను చెయ్యండి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇవ్వబడిన హామీలు 1) రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, (2) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు (3) రాష్ట్రంలో ఒక మేజర్ పోర్టు (4) కడపలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపన అంశాలపై కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి చేసి సాధిస్తేనే ప్రగతి సాధ్యపడుతుంది.


భారత రాజ్యాంగంలో పౌరులకు ప్రసాదించబడిన ప్రాథమిక హక్కులు, ఫెడరల్ విధానం ద్వారా రాష్ట్రాల హక్కుల పరిరక్షణ, మైనారిటీలు, మహిళలు, పేదలు, దళితులు, ఆదివాసీల ప్రయోజనాల పరిరక్షణ మున్నగు అంశాల పట్ల ప్రజలపక్షాన, కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడితెచ్చి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని, ఈ లేఖలో పేర్కొన్న అంశాలను 'అమలు చేస్తూ, మన రాష్ట్ర, సమగ్ర సత్వర అభివృద్ధికి కృషి చేస్తూ, సర్వజనుల అభిమానాన్ని చూరగొనగలగాలని ఆకాంక్షిస్తున్నాను. ❑

# భారత స్వాతంత్ర్యోద్యమం : తెలంగాణ ముస్లిం యోధులు



- ప్రతాపనేని రామకోటేశ్వరరావు

**చరిత్ర మీద ఉన్న ఆసక్తితో ప్రముఖ చరిత్ర పరిశోధకుడు సయ్యద్ నశీర్ అహ్మద్ కలం నుండి వెలువడిన "భారత స్వాతంత్ర్యోద్యమం - తెలంగాణ ముస్లింయోధులు" అనే గ్రంథాన్ని ఇటీవలనే చదవడం జరిగింది. మధ్య యుగాల చరిత్ర గురించి ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ రామ్ పునియాని, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం వీరుల గురించి సయ్యద్ నశీర్ అహ్మద్ సాధికారికంగా చెప్పగలరని, ఈ పుస్తకాన్ని చదివిన తర్వాత నేను గట్టిగా చెప్ప గలను. ప్రత్యేకంగా ఈ పుస్తకం తెలంగాణ సమాజం నుండి గత మూడు శతాబ్దాలుగా సాగిన వివిధ వలస, ఆధిపత్య వ్యతిరేక పోరా టాలలో, అలాగే సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాలలో తెలంగాణ గడ్డ మీద పుట్టి పెరిగిన, ఇతరత్రా వేరే ప్రాంతాల నుం డి ఇక్కడకు వచ్చి ఇదే తమ మాతృభూమిగా భావించిన వందలాది ముస్లిం యోధులను మనకు పరిచయం చేసింది.**




**రచయిత : సయ్యద్ నశీర్ అహ్మద్**
**పేజీలు : 352 - వెల : రూ. 500.00**
**ప్రతుల కొరకు రచయిత సయ్యద్ నశీర్ అహ్మద్ ను సంప్రదించవచ్చు.**
**మొబైల్ నంబర్ : 94402 41727.**

ఆ యోధులు హిందువులైన, ముస్లింలైనా వారి జ్ఞాపకాలు నేటి తరానికి అందుబాటులో లేవు. మన ఎరుకలోనే జరిగిన ఇటీవల సంఘటనలను వాటిలో పాల్గొన్న ఎందరో వీరులు కనుమరుగయ్యారు. తెలంగాణకు సంబంధించి నంత వరకు ఈ పుస్తకం ఆ కొరత తీర్చింది. నశీర్ అహ్మద్ ఈ పుస్తకంలో ముస్లిం వీరులకే పరిమితం కాకుండా ఆయా ఉద్యమాల్లో పాల్గొన్న అనేక మంది హిందూ వీరులను మనకు పరిచయం చేశారు. పుస్తకం గురించి వివరాల్లోకి వెళ్ళే ముందు ఈ పరిశోధనాత్మక పుస్తకం రచయిత సయ్యద్ నశీర్ అహ్మద్ గురించి రెండు మాటలు చెప్పాలి. సయ్యద్ నశీర్ అహ్మద్ చిర కాలంగా నాకు మంచి మిత్రుడు. సైఫియా కాలేజీ, భోపాల్ యూనివర్సిటీలో 1976 - 78లలో మేమిద్దరం యం.కామ్.లో సహాధ్యాయులం. ఆ సమయంలో చదువును కొనసాగిస్తూనే మా ఆసక్తులను, అభిప్రాయాలను పంచుకున్న కాలం. చదువుతో పాటు ఆ రోజుల్లో నశీర్ ఎక్కువగా వ్యంగ్య (కార్టూన్) చిత్రాలను వేయడం మీద చిన్న, చిన్న కథలను, కవితలు వ్రాయడం మీద ఆసక్తి కనపరచే వాడు. అప్పటి అతని చాలా రచనలు పత్రికల్లో వచ్చాయి. తరువాత కాలంలో తన జీవిక కోసం ప్రభుత్వ ఉద్యోగం చేపట్టి దానిని వదిలేసి లాయర్‌గా, ఆ తరువాత తన ఆసక్తి మేరకు "ఉదయం" దినపత్రిక రిపోర్ట్‌గా, ఆపై ఉదయం గుంటూరు జిల్లా చీఫ్ రిపోర్టర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ఏ పనిలో ఉన్నా నిబద్ధతతో పనిచేయడం మొదటి నుంచి అతనికి అలవాటు. ఈ సమయంలోనే అతని ఆసక్తి చరిత్ర రచనవైపు మరలింది. స్వతంత్ర భారతదేశంలో చరిత్ర రచనలో ముస్లిం వీరుల పాత్రకు సరైన ప్రాధాన్యత, గౌరవం దక్కలేదు. ఈ విషయం లో వామపక్షాలు, వామపక్షవాదులు నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శించారు. అదే నశీర్ అహ్మద్‌ను విపరీతమైన ఆవేదనకు గురిచేసింది. లౌకిక వాదులలో కొందరు ముస్లిం సమా జాన్ని ఓటు బ్యాంకుగా పరిగ ణించటం మొదలుపెట్టారు. ఇది మెజారిటీ హిందూ సమాజానికి మేమే అధినాధులమని చెప్పుకునే ఆర్.యస్.యస్ పరివారానికి అంది వచ్చిన అవకాశం అయింది. వామపక్షాలు ముస్లిం తదితర మైనారిటీ సమాజాలలో ఒక ప్రత్యేక కార్యక్రమంతో కేంద్రీకరించి పని చేయకపోవడం, లౌకికవాదులలో కొందరు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడంతో గత 30 సంవత్స రాలుగా ఈ సమూహం పూర్తిగా ఒంటరితనం అనుభవిస్తున్నది. ఈ విషయంలో ముస్లిం సమాజంలోని మేధావులు సమూహం ఒంటరితనం నుంచి బయటపడటానికి చాలా కృషి చేయాల్సి



**నశీర్ అహ్మద్**

ఉంది. అందులోని అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా నిలబడి పురోగామి ముస్లిం సమాజ నిర్మాణానికి గట్టి ప్రయత్నం చేయాల్సి ఉంది. ముస్లిం సమాజం మతతత్వం ప్రభావం నుండి బయటకు తేవడానికి ఇతర లౌకికవాద మిత్రులతో కలిసి ముస్లిం మేధావులు తమ కృషిని ఇంకా పెంచాలి. ముస్లిం సమాజం ఆర్థిక స్థితిగతుల మీద, వారి విద్య, ఉపాధి కల్పన మీద ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రవేశం మొదలగు విషయాలను పరిశీలించి వారి పురోభివృద్ధికి తగు సూచనలు చేయడానికి సచార్ కమిటీని ప్రభుత్వం నియ మించింది. కమిటీ రిపోర్టు ప్రకారం కొన్ని రంగాల్లో ముఖ్యంగా, ప్రభుత్వ ఉద్యోగాలలో, ముస్లిం సమాజం దళిత వర్గాల కన్నా వెనుకబడి ఉండడం గమనంలోకి తీసుకోవాలి. విద్య తదితర రంగాలలో పూర్తి వెనుకబాటుతనమే.

ఈ నేపథ్యంలో నశీర్ అహ్మద్‌కు ముస్లింలలో ఎందరో యోధులు స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన విషయాలు 'టైం మిషన్' లోలా కళ్ల ముందు కదలాడింది. అది అతనిని భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర రచనకు, అందులో ముస్లిం సమాజం చేసిన అసమాన పోరాటాలు, త్యాగాల గురించి వ్రాయడానికి పురికొలిపింది. కొందరు వ్యక్తులు ఒక సమూహంగా లేదా ఆర్థిక, అంగబలం గల పెద్ద పెద్ద పరిశోధన/ప్రచురణ సంస్థలో లేదా విశ్వ విద్యాల యాలలోని చరిత్ర పరిశోధన విభాగాల్లో చేయాల్సిన పనిని ఒక్కడే తలకెత్తుకున్నాడు. అతని కుటుంబ ఆర్థిక వనరులు అంతంతమాత్రమే అయినా వెరవలేదు. ఒకసారి తన గమ్యం నిర్ణయించుకున్న తరువాత వెనుతిరిగి చూడలేదు. ఎంత శ్రమ కైనా ఓర్చుకున్నాడు. అతని కుటుంబం, అతని మిత్ర బృందం అతని వెనుక నిలిచింది. అంతే విషయసేకరణ కోసం ఎంత దూరమైన వెళ్లాడు. అంతటి కఠోరదీక్షతో మరుగున పడిన ఎంద రో వీరులను మన కళ్ల ముందు సాక్షాత్కారింపజేసాడు. పలు సంస్థలు, జర్నలిస్టు మిత్రుల సహకారంతో, సహాయంతో ఆ మహానుభావుల వందలాది ఊహా చిత్రాలను సేకరించి మనకు అందించాడు. ఈ విషయ సేకరణ, పుస్తక ప్రచురణ ఒక ఎత్తు అయితే వాటిని ప్రజలకు పరిచయం చేయడంలో కూడా ఒక విధంగా ఒంటరి పోరాటమే చేశాడు. పుస్తక ప్రదర్శనలు, సమయోధుల చిత్రపటాల ప్రదర్శనలు, సెమినార్‌లు, సభలు, సమావేశాలు ఒకటేమిటి అన్ని మార్గాల్లో ఆ రచనలను భారత దేశంలోనే కాదు విదేశాలలోని ప్రజల వద్దకు తీసుకెళ్లాడు. భారతావనిలోని అన్ని రాష్ట్రాలలోని ప్రధాన నగరాల్లో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి భారత స్వాతంత్ర్య సంగ్రామం చరిత్ర ను, చారిత్రక సంఘటనలను, అందులో ముస్లిం వీరుల ఘన చరిత్రను ప్రస్తుత తరానికి పరిచయం చేశాడు, చేస్తున్నాడు. దశాబ్దాల తరబడి చరిత్ర రచనలో ముస్లిం వీరులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది వారి పాత్రకు తన శక్తి మేర న్యాయం చేశాడు, చేస్తున్నాడు. ఇప్పటి వరకు భారత స్వాతంత్ర్య పోరాటం లో ముస్లింల పాత్ర గురించి దాదాపు 24 పుస్తకాల వరకు మన కు అందించారు. ఈ గ్రంథాలు చాల వరకు ఆంగ్లం, హిందీ, ఉర్దూ, తమిళం, గుజరాతీ, కన్నడం భాషల్లో అనువదించబడి ప్రచురితం అయ్యాయి. ఈ గ్రంథాలు చదివితే ముస్లిం సమా జం నుండి ఎందరు వీరులు మన దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారో మనకు అర్థం అవు తుంది. ఇదే సమయంలో ఇంకో విషయం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు మేమే దేశ భక్తులం మిగతా వారం తా దేశ ద్రోహులు అని రోజూ అబద్ధ ప్రచారాలతో ఊదరగొట్టే సంఘ పరివారం స్వతంత్ర పోరాటంలో ఏ ఒక్కరోజు, ఏ ఒక్క నిమిషం పాల్గొనలేదు. అయినా వర్తమాన భారతంలో పరివారం నాయకులు ప్రజలను మతం మత్తులో ముంచి హేతుబద్ధ ఆలోచ నలకు ఆస్కారం లేకుండా చేస్తున్నారు. దీనికితోడు ప్రజలు కులా ల వారీగా, ప్రాంతాల వారీగా విడిపోయి తమలో తాము కొట్లాడుకుంటున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కుల మత ప్రాంతీయ తత్వాలకు అతీతంగా యువతను చైతన్య పరి చేందుకు వాస్తవ చారిత్రక పరిస్థితులను ప్రజానీకానికి తెలియ పరిచేందుకు నశీర్ రచనలు తోడ్పడతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ రోజు రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు యావత్ భారతదేశంలో మాతృభూమి విముక్తి కోసం సాగిన స్వాతంత్ర్యం పోరాటంలో కాని, అన్యాయానికి వ్యతిరేకంగా జరి గిన వందలాది పోరాటాలలో పాల్గొన్న లక్షలాది ముస్లిం వీరుల గురించి గానీ, సాధికారికంగా ఆధారాలతో సహా చెప్పగల వ్యక్తి మిత్రుడు నశీర్ అని గర్వంగా చెప్పగలను.

"భారత స్వాతంత్ర్యోద్యమం – తెలంగాణ ముస్లిం యోధులు" పుస్తకం గురించి. బీజ రూపంలో ఇంతకుముందు వ్రాసిన తన పుస్తకాలలో తెలంగాణా ముస్లిం యోధులలో కొందరి గురించి నశీర్ అహమ్మద్ ప్రస్తావించారు. స్వాతంత్ర్యానికి పూర్వం భారత దేశం బ్రిటిష్ ఇండియాగా , స్థానిక సంస్థానాలుగా విభజించ బడి విభిన్న రాజుల ఏలుబడిలో ఉన్నది. కొన్ని సంస్థానాలు హిందూ రాజుల ఏలుబడిలో, మరికొన్ని సంస్థానాలు ముస్లిం రాజుల ఏలుబడిలో ఉన్నాయి. అప్పటి హైదరాబాద్ సంస్థానం (రాజ్యం) ముస్లిం నవాబైన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఆధీనంలో ఉంది. ఇది స్వాతంత్ర పూర్వ భారత దేశంలో అతి పెద్ద సంస్థా నం. ఆసఫ్ జాహి వంశీయులు హైదరాబాద్ రాజ్యాన్ని 1724 లో ఏర్పాటు చేసిన తర్వాత భారతదేశంలో అతి పెద్ద సంస్థా నంగా అవతరించింది. ఆ తరువాత కాలంలో ఈస్టిండియా కంపెనీ అధికారం బాగా స్థిర పడుతున్న కాలంలో అధికారం లోకి వచ్చిన నిజాం వంశపు రాజులు రకరకాల రాజీల క్రింద శ్రీకాకుళం నుండి గుంటూరు వరకు, ఆ తర్వాత దత్తమండలం గా ప్రసిద్ధి చెందిన బళ్ళారి జిల్లాతో సహా ఇప్పటి రాయలసీమను

బ్రిటిష్ వారికి దారాదత్తం చేసారు. అదే సందర్భంలో బ్రిటిష్ వారికి నమ్మకమైన మిత్రులుగా నిజాం నవాబులు రూపాంతరం చెందారు. స్వాతంత్ర్య ఉద్యమ గాలులు భారత దేశమంతా ఉధృతంగా వీస్తున్నాయి.అవి సంస్థానాల ప్రజలను కూడ ప్రభావితం చేయడం మొదలు పెట్టాయి. నిజాం లొంగుబాటు విధానాలకు వ్యతిరేకంగా కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు సమైక్యంగా ఉద్యమించిన చరిత్రను, అందులో కొందరు రాజ కటుంబీకులు కూడా పాల్గొని దీర్ఘకాలం ఖైదీలుగా బంధించబడిన చరిత్రను నశీర్ ఈనాటి తరానికి తెలియచేయడం అభినందనీయం.

మరీ ముఖ్యంగా నిజాం దర్బార్‌లో పనిచేస్తున్న నూరల్ ఉమ్రా బహదూర్, రాజ కుటుంబీకుడైన మీర్ గోహర్ అలీఖాన్, బ్రిటిష్ రెసిడెంట్ మీద సాహసోపేతమైన దాడి చేసిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ లాంటి త్యాగధనుల చరిత్ర నేటి తరం తెలుసుకోవాలి. ఈ తుర్రేబాజ్ ఖాన్ సాహసోపేతమైన చర్య కారణంగానే ఇప్పటికీ "నువ్వేమైనా తురుంఖాన్‌వా" అనే నానుడి తెలంగాణ ప్రజల నోళ్ళలో నానుతూ ఉంది. వీరే కాకుండా స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న సయ్యద్ బద్రుల్ హసన్, మరో నెల రోజుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి ముందు రజాకార్ మూకల క్రూరమైన దాడిలో మృతి చెందిన 'ఇమ్రోజ్' ఉర్దూ దినపత్రిక ప్రచురణకర్త మరియు సంపాదకులు షోయబుల్లా ఖాన్ చరిత్రను మరోసారి గుర్తు చేశారు. సంస్థానంలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం కానీ, స్వతంత్ర భారత దేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం కొరకు జరిగిన ఉద్యమం కానీ, భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టి చాకిరీ విముక్తి కొరకు, జమీందార్ల, జాగీర్ దారుల పీడన కు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో కానీ కుల మతాల ప్రసక్తి లేకుండా అందరు భుజం భుజం కలిపి పోరాడిన సంగతిని సోదాహర ణంగా తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సంస్థానంలో రాజు ముస్లిం మతానికి చెందిన వాడనే విషయం పరిగణన లోకి తీసుకుంటే కానీ మనకు న్యాయం కోసం, స్వాతంత్ర్యం కోసం ముస్లిం వీరుల త్యాగాలు అర్థం కావు.

వీరే కాకుండా స్వతంత్ర భారతంలో పీడిత ప్రజల పక్షాన నిల బడి ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించిన కవి, శాసన మండలి సభ్యులు మగ్దూం మోహినుద్దీన్, ఖమ్మం, సుజాతానగర్ నియోజకవర్గాల నుండి పలుమార్లు శాసనసభకు ఎన్నికైన మహ్మద్ రజబ్ అలీ, విద్యాధికురాలు రజియాబేగం లాంటి వారి గురించి, వారి ఆశయాల గురించి, వారి పోరాట స్ఫూర్తిని నూత న తరానికి పరిచయం చేసినందుకు నశీర్ అహమ్మద్‌కు ధన్యవా దాలు. వీరే కాకుండా మరెందరో త్యాగధనులు వేరు వేరు దారులలో తమదైన పద్ధతులలో నిస్వార్థంగా పోరాటాలు నిర్వ హించి, ప్రజలకు సేవ చేసిన యోధులను వెలుగులోకి తెచ్చిన నశీర్‌కు అభినందనలు. అతని కలం ఇకముందు కూడా మరె న్నో చరిత్రకందని రహస్యాలను వెలుగులోకి తీసుక రావాలని ఆశిస్తున్నాను. కట్టుకథలు, పుకార్లు రాజ్య మేలుతున్న నేటి కలు షిత వాతావరణంలో "భారత స్వాంత్ర్యోద్యమం: తెలంగాణ ముస్లిం యోధులు" చరిత్ర పుస్తకం రావడం ముదావహం. ఈ పుస్తకాన్ని ముఖ్యంగా హిందూ ముస్లిం తారతమ్యం లేకుండా యువకులంతా చదివి చరిత్రను సరైన రీతిలో అర్థం చేసు కోవాలి.

ఈ పుస్తకాన్ని ఎంపిక చేసిన గ్రంథాలయాలను, చరిత్ర కారులకు, చరిత్ర విద్యార్థులకు, సమాచార మాధ్యమాల వ్యవస్థలకు "చిరుగానుక"గా అందించాలని ప్రచురణకర్తలు తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ❑

# బౌద్ధ విగ్రహాల్నే కాదు, బోధి వృక్షాన్ని కూడా కొట్టేశారు !

**(23వ పేజీ తరువాయి)**

పాత్ర బౌద్ధ చైత్యాన్ని తగులబెట్టడం రామాయణంలో ఎందుకుంది? - అన్న ప్రశ్న వేసి తీగలాగితే డొంకంతా కదులుతుంది. ఏది ముందు? ఏది తర్వాత కాలా నిదో అక్కడే దొరికిపోతోంది. ఇక తమ మనోభావాలకు దెబ్బలు తగిలించుకుని బొబ్బలు పెట్టే వారిని చూసి మనం జాలిపడాలి. "భగవద్గీతను సాధారణ శకం 150-350 జ.జు మధ్య కాలంలో రచించి ఉంటారు! దీన్ని భారతంలో జొప్పించి కృష్ణు నితో చెప్పించారు" - అని ప్రసిద్ధ చరిత్రకారుడు, పరిశోధకుడు డి.డి.కోశాంబి నిర్ధారించారు. ఈ దేశం బౌద్ధ దేశంగా ఉన్నందు వల్ల, అహింసా సిద్ధాంతం పాటించడం వల్ల, యుద్ధాలకు వెన కాడి, ఈ దేశ ప్రజలు దేశాన్ని విదేశీ పాలకులకు అప్పగిం చారని వైదికులు ఒక పుకారు పుట్టించారు. అసలు కారణం అది కాదు ఈ దేశంలో మనువాదులు ప్రవేశపెట్టిన వర్ణ వ్యవస్థ వల్ల యుద్ధం చేసే అర్హత అందరికీ ఉండేది కాదు. కేవలం క్షత్రియులకు మాత్రమే ఉండేది. ఒక్కోసారి తగినంతమంది క్షత్రియులు లేక, సైన్యం బలహీనపడేది. అదీగాక, స్వీయ రక్షణ కోసం చేసే యుద్ధాన్ని బుద్ధుడు కాదనలేక, అందువల్ల ఈ విషయంలో తప్పు బుద్ధుడిది బౌద్ధానిదీ కాదు. అందరికీ సమానమైన అవకాశాలివ్వని వర్ణ వ్యవస్థదే-తప్పు-పరిస్థితులు మారి, తర్వాత కాలంలో సైన్యంలో చేరే అవకాశం అందరికీ రావడంతో భారత సైన్యాలు బలపడ్డాయి. ఈ విషయాన్ని అంబేద్కర్ తన రచనల్లో చర్చించారు. ❑

# తెలుగు సమాజ సాహిత్యాల ప్రయాణం ముందుకా, వెనక్కా?

- ఎన్.వేణుగోపాల్



**కాలానికి ఏక ముఖ చలనం మాత్రమే ఉంటుందని విజ్ఞాన శాస్త్రం చెపుతుంది. టైమ్ మెషిన్లు తయారు చేసుకుని కాలంలో వెనక్కి వెళ్లడమూ, అనేక కాంతి సంవత్సరాల దూరంలోని నక్షత్రాల మీదికి వెళ్లి అక్కడి నుంచి భూమిని చూసి పాత ఘటనలూ పరిణామాలూ కళ్ల ముందు దర్శించడమూ అన్నీ కల్పనలోనే, ఊహలోనే గాని వాస్తవం కావు. కాని ఈ భౌతిక శాస్త్ర నియమాన్ని తెలుగు సమాజ సాహిత్యాలు తిరగరాస్తున్న ట్టున్నాయి. ఇక్కడ మనం కాలంలో చాలా ముందుకు నడిచి, అక్కడ సకారణంగానో నిష్కారణంగానో ఆగిపోయి, మలుపు తిరిగి, వెనక్కి నడవడం ప్రారంభించినట్టున్నాం.**

అరవై, డెబ్బై ఏళ్ల కింద మరిచిపోయిన విషయాలకు మళ్లీ పెద్ద పీట వేస్తున్న ట్టున్నాం. ఆరేడు దశాబ్దాల కింద సకారణంగా, ఉత్తేజభరితం గా, ఉధృత ఉద్వేగాలతో తోసివేసిన విలువలనూ విశ్వాసాలనూ ఇవాళ మరొకసారి గాఢంగా ఆలింగనం చేసుకుంటున్నట్టు న్నాం. ఇవేవో నిరాశాపూరిత నిర్ధారణలు కావు, కళ్ల ముందరి వాస్తవాలను చూసి కలుగుతున్న ఆవేదనలు. ఒక ఉజ్వల వాతా వరణంలో పుట్టి బుద్ధెరిగి, కళ్లు తెరిచి, ఊహలు విచ్చుకుని, ఆ మహత్తర ఊరేగింపులో కలిసి నడిచి, ఇవాళ ఆ ఉజ్వలత్వం కనబడని మసక చీకట్లలో కళ్లు పొడుచుకుని చూస్తూ పడుతున్న తపనలు. సమాజ సాహిత్య సంబంధాల చరిత్ర విద్యార్థిగా గత కొద్ది కాలంగా వేధిస్తున్న ఈ ప్రశ్నలకు, ఈ ఆవేదనలకు, ఈ తపనలకు అక్షరరూపం ఇవ్వడం ఇంకా నిరాశ పెంచుతుందా అని కూడా ఉంది. కాని ఏదైనా రాయమనీ, ధారావాహికంగా రాయమనీ కొలిమి అడిగినప్పుడు, ఇటువంటి వేదనలను, గత వర్తమానాల, ఆశ నిరాశల, ఉత్తేజ నిస్తేజాల సంభాషణను నలుగురితో పంచుకుంటే, ఇటువంటి ఆవేదనే అనవసరమని చెప్పేవాళ్లూ, లేదా ఇటువంటి ఆవేధనలనే అనుభవిస్తున్న వాళ్లూ ఒక సంభాషణ జరిపితే కనీసం కొన్ని చర్చనీయాంశాలనైనా వేదిక మీదికి తేగలుగుతామా అనిపించింది. ఎక్కువలో ఎక్కువ జరపగలిగింది సంభాషణే, చర్చే. ఇప్పటికిప్పుడు ఏదో మారిపో తుందనే ఆశ ఏమీ లేదు. ఆశ నిరాశల పొలిమేరలో ఆవులిస్తున్న ప్రశ్నలకు జవాబులు వెతికే ప్రయత్నం ఇది.

సమాజమే సర్వస్వం, సమాజ హితం కోసమే వ్యక్తి, సామాజిక పురోగమన మార్గంలో వ్యక్తులు ఏమైపోయినా ఫర్వాలేదు అను కున్న చోటి నుంచి చాలా దూరం వచ్చినట్టున్నాం. సమాజం ఏమైపోయినా సరే నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అనుకునే స్వార్థం, అసాంఘికత్వం పెరిగిపోతున్నాయి. భవిష్యత్తు ఎంత అంధకారమయంగా కనబడుతున్నా సరే మన వంతు చిరుదీపం వెలిగించాలనే బాధ్యత ఎంత మాత్రం కనబడని నిర్లిప్తత వ్యాపి స్తున్నది. కళ్ల ముందర కనబడే దోపిడీని పీడననూ హింసనూ అసమానతనూ గుర్తించని అంధత్వం కమ్ముకుంటున్నది. ప్రపం చీకరణ విధానాలకు ముందే ప్రారంభమయిన శకలీకరణ, ప్రతి శకలమూ తానే సర్వజ్ఞురాలిననీ, సర్వవ్యాపి ననీ అనుకోవడం, మరొక శకలాన్నో, వ్యక్తినో గుర్తించనితనం ఈ మూడు దశాబ్దాలలో మరింత మరింతగా పెరిగిపోతు న్నట్టున్నాయి.

ఈ వర్తమాన దృశ్యాన్ని చూస్తుంటే కాలం నిలిచిపోయిందా, లేక వెనక్కి నడవడం మొదలయిందా అనిపిస్తున్నది. కులాన్ని గుర్తించకుండా, పట్టించుకోకుండా లెక్క చేయకుండా మనసు మాత్రమే, అభిరుచులు మాత్రమే, అభిప్రాయాలు మాత్రమే ప్రధానమని సహజీవనం ప్రారంభించిన దంపతుల పిల్లలు తప్పనిసరిగా కులంలోనే - ఎక్కువగా తండ్రి కులంలోనే - పెళ్లి చేసుకుంటున్నారు. నలుగురిని పిలిచి చాయ్ బిస్కట్ ఇవ్వడం లాంటి వేడుక చేసుకోవడమే ఆడంబరమూ తప్పూ అనుకున్నంత చాదస్తంలో నిరాడంబరంగా తమ సహజీవనాన్ని, వివాహాన్ని ప్రకటించిన జంటల కొడుకులూ కూతుళ్లూ లక్షలు ఖర్చు పెట్టిం చే మూడు రోజుల, ఐదు రోజుల, ఏడు రోజుల, గమ్యస్థానాల, ఐదు నక్షత్రాల వివాహ మహోత్సవాలకు మోజు పడుతున్నారు. ఒకప్పుడు సూత్రబద్ధమైన జీవితాలు జీవించిన వాళ్లు, సైద్ధాంతిక ఆదర్శాల ప్రమాణాలతో జీవించినవాళ్లు ఇవాళ రాజీలకూ, నిర్లిప్తతకూ, చివరికి పూర్తిగా వ్యతిరేకమైన పద్ధతికీ దిగజారి బతుకులీడుస్తున్నారు. కొందరైతే ఈ పతనమే విజయం అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు.


కుల మతాల పాత్ర బహుశా దశాబ్దాల కిందటికీ ఇప్పటికీ

**(మిగతా 40వ పేజీలో)**

# బురఖాలో కన్నీళ్లు 'పహెచాన్'



- రాఘవ




**రచన : గీతాంజలి (డి.భారతి)**
**పేజీలు : 220 - వెల: 200**
**పుస్తకాలకు : గీతాంజలి**
**88977 91964**

ముస్లిం మహిళల బురఖాల్లో కన్నీళ్లు దాగుంటాయి. అవి బైటికి కనిపించవు. అవి అక్కడే ధారగా కారుతూ, అక్కడే ఆవిరై పోతుంటాయి. బురఖాల్లో కన్నీళ్లుంటాయని బయటి ప్రపంచానికి తెలియదు. ఆ కన్నీళ్లను గీతాంజలి బైటికి తీసి లోకానికి చూపించారు. హైదరాబాదీ ముస్లిం మహిళలు ఉనికి కోసం, మనుగడ కోసం చేసే పోరాటానికి, వారి వేదనలకు 'పహెచాన్' కథల్లో రచయిత్రి ఒక రూపాన్నిచ్చారు. హైదరాబాదీ ముస్లింలు మాట్లాడే తెలుగు భాషలో దక్కనీ ఉర్దూ కలగలిసి ఏర్పడిన ఒక తమాషా అయిన భాష, తమాషా అయిన పలుకుబడి ఈ కథల్లో మనకు దర్శనమిస్తుంది.

**అమ్మకు ఆపరేషన్ చేయించిన కూతురు**

"నాతోని గాదు. నాకింక శక్తి లేదు. ఆప్రేషన్ చేపించుకుంటా" అంటూ తన ముంగట ఉన్న తొమ్మిది మంది పిల్లల్ని చూపిస్తూ పరేషాన్ అయిపోతోంది నూరున్నిసా బేగం. "సువ్వర్ కే ఔరత్." అంటూ ఆమె చెంపలు పగలగొట్టాడు సులేమాన్. "మా అత్త పధ్నాలుగు మందిని కన్నది. మా అమ్మీ పన్నెండు మందిని కన్నది. నీకేం బీమారి" అన్నాడు. తను మాత్రం ఆపరేషన్ చేయించుకోడు. నూరున్నిసాకు మళ్లీ ఔరత్ బచ్చీ పుట్టింది. 'ఇక అమ్మీ గర్భ సంచీ చిరిగిపోకూడదు' అనుకుంటూ ఎవరికీ తెలియకుండా డాక్టరమ్మను బతిమాలి తల్లికి కూతురే ఆపరేషన్ చేయించేసింది. "దేఖో అమ్మీకా జిజ్జీ కరాకే లాయీ యే బడే అమ్మీ" అంటూ ఆస్పత్రిలో వ్యాఖ్యానాలు. ఎక్కువ మంది పిల్లలను కనలేక స్త్రీలు పడే అవస్థలకు సజీవ రూపం "ఉనో నహీ మాన్తే".

**మరద్ బచ్చీ పుట్టలేదని వేధింపులు**

"ఆడ పిల్లల్ని కనుడు బంద్ జేసి ఇక మగపిల్లాడిని కను" అంటూ రోజూ నఫీజ్‌ను అత్త నూరున్నిసా సతాయిస్తుంటుంది. "అమ్మీ నఫీజ్ కో బచ్చే నైహోతే. ఉన్ కో తీన్ సాల్ పహలే బచ్చే నైహోనేకా ఆప్రేషన్ కరవాయా మైనే" అంటాడు అర్భాజ్. "క్యా క్యా బోలే అర్భాజ్" అంటూ అతని తల్లి ఒర్లింది. "ఇదిగో సూడు, నాకొక మన్మడు గావాలె. ఏ సైతాన్ కో ఘర్ సే నికాల్ దో. నీ కింకో మంచి పిల్లని జూసి పెండ్లి జేసిస్తా. నైతో..మై ఏ జహర్(విషం) పీలుంగీ" అని బెదిరిస్తుంది. రోజూ నఫీజ్ అన్నం తింట లేదు. అత్త చేతిలో తిట్లే తింటుంది. పిల్లలు పుట్టడానికి మళ్లీ ఆపరేషన్ చేయించుకుంది. అయినా మగపిల్లవాడు పుట్ట లేదు. అర్భాజ్‌కు మరో నిఖా అయిన తెల్లారే నఫీజ్ తన ఇద్దరు ఆడ బిడ్డలతో బావిలో దూకి శవమై తేలింది. 'ఔలాద్' మరొక విషాదాంతం. ఒకపక్క దారిద్ర్యం, అధిక సంతానం. మరొక పక్క ఆధునికతను అందిపుచ్చుకోలేని, స్త్రీల ఆరోగ్యాన్ని పట్టించుకోని వెనుకబాటుతనం ముస్లిం మహిళలను ముప్పేటలా దాడి చేస్తున్నాయి.

**తాగుబోతుకు గుణపాఠం**

జహంగీర్ బీకి అరుగురు పిల్లలు. ముగ్గురు ఔరత్ బచ్చీలు, ముగ్గురు మరద్ బచ్చీలు. ఆరో బిడ్డకు పేరు పెట్టలేదు. ఛే నంబ ర్ అనే పిలుస్తుంది. భర్త షోహార్ తాగుడుకు బానిసవు తాడు. కుటుంబాన్ని పట్టించుకోడు. ఉన్నట్టుండి మాయమౌతడు. నెలల తరబడి కనపించడు. జహంగీరాబీ బిస్కెట్ కంపెనీల చేస్తూ పిల్లల్ని సాకుతుంటుంది. షోహార్‌ను ఇంట్లోకి రానివ్వడు. విసుగెత్తి "ఆపా మై ఉన్కో ఖులా దేతుం" అంటుంది అక్కతో. "దేదే" అంటుంది అక్క. తాగుడుకు బానిసై, కుటుంబాలన్ని పట్టించుకోకుండా బలాదూరుగా తిరిగే వాడికి ఎలా బుద్ధి చెప్పాలో తెలిపే కథ 'ఖులా'. మగవాడు తాగుడుకు బానిసైతే హింసలకు అన్యాయానికి గురయ్యేది ఇల్లాలే. "ఏముంది ఇందులో, ఇది బీరే కదా! ఆడవాళ్లు తాగే కూల్ డ్రింక్" అంటూ రెచ్చగొడతారు. మేల్ ఛావనిజం ముందుకు పొడుచుకొస్తుంది. బీర్‌తో ఆగదు. బ్రాందీ విస్కీ, జిమ్ము, రమ్ము, గమ్ము. ఏదీ దొరకకపోతే స్పిరిట్, దగ్గు మందు సీసాలు సీసాలు తాగేస్తారు. పీపాలు పీపాలు లాగించేస్తారు. కొంప కొల్లేరైపోతుంది. మనిషి పతనానికి 'బీర్ ఈజ్ ది బిగినింగ్ స్టెప్' అని విజ్ఞులు ఊరికే అనలేదు.

**సౌదీ అరేబియా సేఠ్ మోసాలు**

పదిహేనేళ్ల బదరియాను పాషా ఈడ్చి ఒక్క తన్ను తన్నడంతో వెల్లకిలాపడిపోయింది. "అమ్మీ" అని అరిచింది. "ఛుప్ కర్.. మార్ దేతుమ్" అంటూ ఆమె జుట్టు పట్టుకుని లేపి గోడకు అదిమాడు. ఇంకొక చేతితో కుతికె పట్టుకున్నాడు. నలభై ఏళ్లున్న

సేర్ చేతుల్లో రెండు గంటలు నలిగిపోయింది. పాషా రాత్రి పూట బదరియాను ఎక్కడెక్కడికో తీసుకెళతాడు. రాత్రంతా ఒకరి తరువాత ఒకరు. షేక్‌తో నిఖా అయ్యాక బొంబాయిలో ఉండి రెండు నెలల తరువాత సౌదీ తీసుకెళతానన్నాడు. పదిహేనేళ్లున్న బదరియాపైన అరవై ఏళ్లున్న షేక్ దౌర్జన్యం చేస్తూనే ఉన్నాడు. బదరియాను సౌదీ షేక్ రెండేళ్లు వాడుకుని బ్రోకర్‌కు అప్పగించి వెళ్లిపోయాడు. ఆ బ్రోకర్ ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లి ఇలాగే అనేకమంది వద్దకు మారుస్తుంటాడు. చివరికి తప్పించుకుని, అనేక కష్టాలతో ఇంటికి వెళుతుంది. బదరియా గర్భవతి. "సౌదీ నై గయాక్యా" అని అమ్మీ బావా ఆశ్చర్యపోతారు. పదిహేడేళ్ల బదరియా ఆడ శిశువుకు జన్మనిస్తుంది. సౌదీ సేఠ్‌లు, బ్రోకర్ల చేతిలో మోసపోతున్న హైదరాబాదీ పేద ముస్లిం బాలికల విషాద గాథలకు సజీవ రూపం "కాలీ బదరియా!".

**పశ్చాత్తాపం**

అఫ్జల్ బీబీ షంషాద్ బేగం, ఇద్దరు ఔరత్ బచ్చీలు, ముగ్గురు మరద్ బచ్చీలతో కలిసి పహాడీ షరీఫ్ దర్గాకెళతాడు. ఆనందంగా ఉన్న సమయంలో అక్కడ ఊడుస్తూ బురఖాలో ఉన్న అక్తర్ "దేఖ్ తేరే బచ్చీ. తేరే బీవీ కైసే సడ్కోం పర్ భీక్ మాంగ్ రై దేఖ్" అంటూ అఫ్జల్‌పైన విరుచుకుపడింది. మానసిక వికలాంగురాలైన ఇరవై ఏళ్ల కూతురు. దాంతో అఫ్జల్‌కు సంతోషం ఆవిరైపోయింది. తరవాత ఆమె ఇంటికెళ్లాడు. కానీ ఆమె అతని ముఖం పైనే తలుపేసేసింది. తొలుత అక్తర్‌ను నిఖా చేసుకుని, కూతురు పుట్టాక వదిలేసినందుకు అఫ్జల్‌లో పశ్చాత్తాపం మొదలైంది. హాజ్ యాత్రకు వెళతాడు. అరేబియాలో మక్కా దగ్గర 'జబాల్ ఆల్ రహ్మా' క్షమా పర్వతంపైన సైతాన్‌ను కొట్టే చోటికి వెళ్లి, వారిస్తున్నా వినకుండా రాళ్ల దెబ్బలు తిని మరణిస్తాడు. భార్యను, కూతురిని వదిలేసినందుకు అఫ్జల్ ఉద్దేశ పూర్వకంగా తనకు తాను శిక్ష విధించుకుని ప్రాణాలు వదులుతాడు. పశ్చాత్తాపంతో అఫ్జల్ ప్రాణాలు వదలడంతో 'సైతాన్' కథ ముగుస్తుంది. కానీ, అక్తర్‌కు, వికలాంగురాలైన కూతురుకు ఏం న్యాయం జరిగింది? అన్న ప్రశ్నను ఈ కథ మన ముందుంచుతుంది.

**ఇంటర్ నెట్ లో నిఖా !**

"ఐసా కైసా కరేంగి షాది? దుల్హా లేకుండ? దుల్హాను సూడకుండా? దునియాలో ఏడనైనాగిట్లుందా? ఈ రిష్తా ఏమొద్దు" అంటుంది గౌసియా బేగం భర్త జుల్ఫికర్‌తో. ఆమె కొడుకు అక్తర్ కూడా ఈ నిఖాను వ్యతిరేకిస్తాడు. ఖాజీ భాయ్‌ని నమ్మి తన ఇద్దరు కూతుర్లకు ఓమన్‌లోని సేఠ్‌ల కవల పిల్లలకు ఇచ్చి నిఖా జరిపేస్తారు. అక్కడికి వెళ్లాక కానీ వారిద్దరూ మూర్ఛ వ్యాధిగ్రస్తులని తెలియదు. ప్రశ్నిస్తే నరకాన్ని చూపిస్తుంది అత్త. గదిలో బంధించి ఆ పిచ్చి వాళ్ల లైంగిక అవసరాలు తీర్చడానికే ఈ నిఖా. ఎలాగోలా బైట పడి వాళ్లిద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. ఆ విషయం తెలిసి ఇద్దరికీ మళ్లీ నరకం చూపిస్తారు. ఒక స్వచ్ఛంద సేవకురాలి ద్వారా బైటపడి తల్లిదండ్రుల వద్దకు హైదరాబాద్ చేరతారు. వారి సోదరుడు అక్తర్ ఫిర్యాదుతో పోలీసులు నిఖా కుదిర్చిన ఖాజీని అరెస్టు చేస్తారు. తమ ఆడ పిల్లల్ని అరబ్ షేక్‌లకు ఇచ్చి పెళ్లి చేయాలనే పేద ముస్లిం తల్లిదండ్రుల ఆశ ఎటు దారి తీస్తుందో చెప్పే కథ 'సబా-సవేరా'.

**మధ్య యుగాల వధ్య శిల.**

"బచావ్.. తుమ్హారా పావ్ పడ్తీ హు! ముఝే చోడ్ దేవ్..!" తలకు కాషాయ తువ్వాలు చుట్టుకుని తన మీదకు ఎగబడుతున్న మగోల్లను దూరంగా తోస్కుంట ఏడుస్త, కేకలు పెడుతున్నది జహీరా. ఒకడు చెంప మీద కొట్టిండు. ఒకడు గుండెల మీద గుద్దిండు. ఒకడు బూతులు తిడ్త తన మీదకెల్లి లేసి కాలితో డొక్కల తన్నిండు. కాల్ల మద్దెల కెల్లి రక్తం కార్తనే ఉంది. ఒకల ఎనక ఒకలు పది మంది. మంటతోనె పానం పోతున్నది. రెండు కాల్ల మధ్య నిప్పుల కుంపటి ! బూతులు, తన్నులు. బలవంతంగా తన కాల్లు ఎడల్పు చేస్త "రండీ" అన్న మాటలు. తనకు కళ్లు తిర్గుతున్నవి. బేహూష్ అయిపోతున్నది. "సాలీ మర్గయా! చోడ్ దేవ్.." మల్ల డొక్కల ఒక తన్ను. "ఇరవై మంది రేప్ చేసింర్నంట!" అమ్మీ తప్ప అబ్బా జాన్, ఛోటా భాయ్, బహెన్ నౌషీన్ అందర్నీ చంపేసిన్రు. ఏడీ అఫ్సర్.. తన ఖాలీద్..! అందరూ ఊర్ల ఇల్లు, సంత, భూములు ఇడ్సి ఊరవతలకు పోయి బతుకుతున్నరు. "నై అమ్మీ! మై కోర్టు మే ఉన్ సబ్ కుత్తోంకో పహా చానూంగీ! జైల్ భేజూంగీ!" జహీరాకు ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. "అల్ల దేముడు రాముడు కత్తులు త్రిశూలాల తోడి మనుషుల చంపమన్నడా? ఆడోళ్లను రేప్ చేయ మన్నడా?" "కోర్టులో మేం గాదు మా గాయాలు గుర్తుపడ్తయి. మై పహె చానూంగి" అవ్ సాక్ష్యం చెబితే మల్ల మిమ్ముల్ని గూడ మిగుల నియ్యమన్నరు. "ఎప్పటి తీరే రేపు టౌన్ల పూరీ జగన్నాథ రథయాత్ర ఉంది బేటీ.. ఎప్పటి తీరే మనం ముసల్మానులందరం ఈ యాత్రల హిందువులతోనె కల్సిపోదాం" అన్నడు నానాజీ. సంవత్సరాలుగా మేం గూడ మీతోటే.. మనం మనం ఒకటే. మన వతన్ ఒకటే అన్కుంట వాండ్ల పూరీ జగన్నాథయాత్రలో షామిల్ అయితున్నం. మర్నాటి దినం అక్బార్లల్ల ముసల్ మాన్లంత యాత్రల హిందువులతోని చిందులు వేస్తున్న తస్వీర్ వచ్చింది. వేలాది మంది పాల్గొన్న రథయాత్రలో జరిగిన తొక్కిస లాటలో పది మంది ముస్లింలు చనిపోయిన్రు. అన్ల జహీరా అనే ఒక ముసల్మాను యువతి గూడ ఉందని వచ్చింది. 'పహెచాన్' కథ ఎంత విషాదం! కళ్ల ముందు తన వాళ్లనం దరినీ చంపేసినా సాక్ష్యం చెప్పలేని నిస్సహాయత! ఎంత దు:ఖం! కథ చదువుతు న్నంత సేపూ గొంతులో ఏదో అడ్డుపడినట్టే ఉంటుంది. గుజరాత్ మారణకాండను ఈ కథ


**(మిగతా 42వ పేజీలో)**

# మార్క్సిస్టు మేధావి, ప్రముఖ చరిత్రకారుడు ఏటుకూరు బలరామమూర్తి

సంస్మరణ వ్యాసం

- టి.రవిచంద్

**"అన్వేషణ పూర్తి కాలేదు. జ్ఞానతృష్ణ చల్లారలేదు. చల్లార కూడదు. చల్లారిన మరుక్షణం నిర్వాణమే. ఇటీవల పదే పదే అనారోగ్యానికి గురవుతున్నాను. కోలుకొంటున్నాను. మరు క్షణంలో తిరిగి కలం చేపడుతున్నాను" అని 1995 డిసెంబర్ లో ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్‌లో జరిగిన సభలో సుప్రసిద్ధ మార్క్సిస్టు మేధావి, ప్రముఖ చరిత్రకారుడు స్వాతంత్ర్య సమర యోధుడు ఏటుకూరు బలరామమూర్తి అన్నారు. ఈ మాటలు అని సంవత్సరం కూడా కాక ముందే 78 ఏళ్ల వయస్సులో తమకు అత్యంత అభిమాన దర్శనమైన బౌద్ధంపై ఒక స్వతంత్ర గ్రంథం రచిస్తూ (ఇప్పటికి రెండు అధ్యాయాలు పూర్తయ్యాయి) ఏప్రిల్ 3న విజయవాడలోని తమ స్వగృహంలో మరణించారు. వారి మరణం ఆంధ్రదేశంలోని ప్రగతి శీల శక్తులకు ఎంతో విషాదం కలిగించింది వారు లేని లోటును ఎవరూ పూరించలేరు.**



బలరామమూర్తి జీవితం ఒక్క కమ్యూని స్టులకే కాదు.. సమాజ ప్రగతిని, మానవ శ్రేయస్సును ఆశించే ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం. ఐదు దశాబ్దాలకుపైగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంటి పెట్టుకొని, సిద్ధాంత రంగంలో విశేష కృషిచేసిన బలరామమూర్తి 1918 సెప్టెంబర్ 23న గుంటూరు జిల్లా ఏటుకూరులో జన్మించారు. తండ్రి ఏటుకూరు సీతారామయ్య బ్రహ్మసమాజ అభిమాని. ఆ ప్రభావంతో ఆయన "త్రిమూర్తులు పుట్టిన విధము" అనే విమర్శ నాత్మక రచనను 1928లో వెలువరించారు. దీన్ని బలరామ మూర్తి 1994లో విశాలాంధ్ర ద్వారా పునర్ముద్రించారు. ఈ పుస్తకానికి బలరామమూర్తి రాసిన పరిచయ వాక్యాల్ని చదివితే తమ తండ్రి గారి సంస్కరణాభిలాష, శాస్త్రీయ, చారిత్రక దృష్టి వారిని ప్రభావితం చేశాయని ఊహించవచ్చు. 1937లో గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో బి.ఎ. చదువుతున్నప్పుడే మార్క్సిస్టు సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత 1938లో గుంటూరు జిల్లా కమ్యూనిస్టు నాయకులు, నాటి మార్క్సిస్టు మేధావి పులుపుల శివయ్య ప్రోత్సాహంతో కమ్యూని స్టుగా జీవితాన్ని ప్రారంభించి, చనిపోయే వరకు కమ్యూనిస్టుగా జీవించారు. ఆ నాటి నుంచి ఈనాటి వరకు కమ్యూనిస్టు ఉద్య మంలో కొనసాగుతూ అనేక ఉత్తమ రచనలు చేశారు. ఆయన మరణించే నాటికి విశాలాంధ్ర ప్రచురణల సంపాదకుడుగా ఉన్నారు. ఆ సంస్థ ద్వారా అనేక ఉత్తమ సాహిత్య, దార్శనిక, చారిత్రక రచనల్ని తమ అమూల్యమైన పీఠికలతో ప్రచురించారు. 1930-1935 ప్రాంతాల్లో ప్రచురించబడి నేడు అలభ్య మైన మూడు అరుదైన గ్రంథాల్ని బలరామమూర్తి తమ విలువైన పరిచయ వాక్యాలతో ప్రచురించారు. వీటిలో రెండు పుస్తకాలు ప్రాచీన సంస్కృత సాహిత్యాన్ని, మరీ ముఖ్యంగా మహా భారతాన్ని వినూత్నరీతిలో పరిశోధించిన విమర్శకుడు పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి రచనలు!. మహా భారత చరిత్రము (మొదటి ముద్రణ 1938), రాజసూయ రహస్యము (మొదటి ముద్రణ 1928). వీటిని పునర్ముద్రిస్తూ బలరామ మూర్తి రాసిన పరిచయం చాలా ముఖ్యమైనది. వారి దార్శనిక, చారిత్రక పరిశోధన దృష్టికి ఈ పరిచయ వాక్యాలు మచ్చుతునకలు. **"భక్తి, ద్వేషాలకు అతీతంగా వస్తుగత చారిత్రక దృష్టిని అలవరచుకునేందుకు ఇలాంటి గ్రంథాలు ఎంతగానో అవసరం".**

ఆంధ్రదేశంలో పురాణాల్ని, ఇతిహాసాల్ని హేతువాద దృష్టితో విమర్శించి, సనాతనుల ఆగ్రహానికి గురయిన వారిలో కవిరాజు త్రిపురనేని రామస్వామి తర్వాత పేర్కొన తగిన వ్యక్తి పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి. వీరిద్దరూ ఆంధ్రులకు శాస్త్రీయమైన విచక్షణా దృష్టిని కలిగించారు. అట్టి సుబ్రహ్మణ్యశాస్త్రి రచనల్ని ఈ తరానికి అందించి బల రామమూర్తి చాలా మేలుచేశారు. ఆర్య సమాజవాదియైన జి.ఎస్.బి.సరస్వతీ స్వాములు రచించిన "పంచముల చరిత్రము"ను విశాలాంధ్ర తరపున పునర్ముద్రించారు. పేరుకు సాంప్రదాయిక స్వామి వారైనా వీరు వేద ప్రామాణ్యాన్ని అంగీక రిస్తూనే, అస్పృశ్యతా నివారణకు బ్రాహ్మణేతరోద్ధరణకు పాటు పడిన మత సంస్కర్త. గొప్ప సంస్కృతాంధ్ర పండితుడు. దళిత ఉద్యమం దేశమంతటా వ్యాపించిన తరుణంలో నాటి తరానికి

చెందిన అగ్రవర్ణ సంస్కర్తలు దళితుల సమస్యను ఎలా అర్థం చేసుకున్నారో తెలుసుకోవటానికి ఉపకరించే మంచి పరిశోధక పుస్తకం ఇది. దీన్ని ప్రముఖ చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి తమ పీఠికతో మొదటిసారి ప్రచురించారు. దీని పునర్ముద్రణకు రాసిన పరిచయంలో బలరామమూర్తి **నేడు అస్పృశ్యులుగా, అంటరానివారుగా వివిధ రాష్ట్రాలలో పరిగణించబడుతున్న వారంతా ప్రాచీన తెగలవారని, నేడు దూషణగా ప్రయోగించబడుతున్న 'చండాల' పదం ఆనాడు ఒక తెగ పేరని అభిప్రాయపడ్డారు.** అస్పృశ్యత అనేది సమాజంలో ఎలా, ఎప్పుడు పుట్టిందనేది నేటికీ అభిప్రాయభేదాలకు తోవ తీసే అంశమే అయినా, దానిపై నిష్పాక్షికమైన పరిశోధన జరగాలని ఆకాంక్షించారు బలరామమూర్తి. అందుచేతనే జి.ఎస్.బి.సరస్వతీ స్వాముల పుస్తకాన్ని మరల పునర్ముద్రించారు.

మన చరిత్ర, సంస్కృతి పట్ల మంచి అవగాహనను పెంచగలిగిన పాత గ్రంథాల్ని నేటి తరానికి అందించి వారిలో శాస్త్రీయమైన చారిత్రక దృష్టిని పెంచాలని తమ జీవితంలోని అంతిమ ఘడియల వరకు కృషి చేస్తూనే ఉన్నారు. దానిలో భాగంగా డాక్టర్ అంబేద్కర్‌ను ప్రభావితం చేసిన ఆంధ్రుడు ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు బౌద్ధంపై రాసిన గ్రంథాన్ని ఆంగ్లం నుండి తెలుగులోకి అనువాదం చేసి, ప్రస్తుత వ్యాసకర్త చేత మిళింద ప్రచురణల తరపున ప్రచురించాలని ప్రయత్నిస్తున్న తరుణంలో హఠాత్తుగా బలరామమూర్తి మనల్ని వదలి వెళ్ళిపోయారు. ఇదే విషయంపై 30-03-1996న ఆయన నుండి ప్రస్తుత వ్యాసకర్తకో ఉత్తరం అందింది. దానికి సమాధానం రాసి పోస్టు చేసే సమయంలో వారి మరణవార్త మా మాస్టారు రాజగోపాలరావు గారి ద్వారా తెలిసింది. ఈ వార్త వ్యక్తిగతంగా నాకు ఎంతో బాధాకరమయిన విషయం. ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు పుస్తకానువాదాన్ని ఏప్రిల్ 1న ముద్రణకిచ్చి, బలరామమూర్తి తాము రాయదలుచుకొన్న బౌద్ధంపై స్వతంత్ర గ్రంథానికి సంబంధించిన మొదటి అధ్యాయాన్ని పూర్తి చేశానని, ఈ పుస్తక రచన పూర్తి చేయడానికి టైమ్ టేబుల్ ప్రకారం పని చేస్తున్నానని తమ చివరి ఉత్తరంలో తెలియజేశారు. మే 3 బుద్ధ పూర్ణిమ నాటికి లక్ష్మీనరసు పుస్తకాన్ని బయటకుతేవాలని ప్రయత్నిస్తున్న సమయంలో బలరామమూర్తి మనల్ని వదిలి వెళ్ళాడు. చివరి క్షణం వరకు తమకు అత్యంత అభిమాన దర్శనమైన బౌద్ధంపై కృషి చేస్తూ మరణించిన విశిష్టమైన బౌద్ధాభిమాని బలరామమూర్తి.

**"చరిత్ర, తత్వశాస్త్రం జోడు గుర్రాలు. నాకు రెండూ అభిమాన విషయాలే."** అని అన్వేషణ అనే తమ ప్రసంగవ్యాసంలో చెప్పుకున్న బలరామమూర్తి తమ నాలుగు దశాబ్దాల రచనా జీవితంలో 12 పుస్తకాలు, వందలాది వ్యాసాలు రచించారు. తెలుగులో చరిత్రను, తత్వశాస్త్రాన్ని తొలిసారి మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేయటానికి ప్రయత్నించిన వారిలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. ఆయనకు భారతీయ తత్వశాస్త్రాన్ని, చరిత్రను మార్క్సిస్టు లోక దృక్పథంతో అధ్యయనం చేయాలనే ఆసక్తి తొలి నాటి నుంచి ఉంది. దానిలో భాగంగానే ఆయా విషయాల్లో విశేషమైన కృషి చేసి సాధికారికమైన విషయ పరిజ్ఞానాన్ని సంపాదించారు. అయితే ఆయన రచనలపై మార్క్సిస్టుల్లో పలు అభిప్రాయాలున్నాయి. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని అంగీకరించే వారిలో భిన్న రాజకీయ ధోరణులకు చెందిన వారున్నారు. కాబట్టి మార్క్సిస్టు దృక్పథంతో చరిత్రను, తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసి, ఎవరు రాసినా అందరికీ ఆమోదయోగ్యం కావటం అసాధ్యం. భిన్నాభిప్రాయాలు ఎవరి మధ్యనయినా సహజమే. బలరామమూర్తి మొదటి 'విశాలాంధ్ర' 'సందేశం' లాంటి కమ్యూనిస్టు పత్రికల్లో వ్యాసాలు రాసేవారు. 1953 నుంచి ఆయన పుస్తక రచన ప్రారంభమైంది. కడలూరు జైలులో 1948-1951 ప్రాంతాల్లో డిటెన్యూగా ఉన్నప్పుడు తోటి సహచరుల కోసం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించే వారు. ఆ తరగతుల్లో చరిత్ర, తత్వశాస్త్రం బోధిస్తూ ఉండేవారు. అప్పుడు చరిత్ర, తత్వశాస్త్రాలకు సంబంధించిన గ్రంథాల్ని అందిన మేరకు నిర్విరామంగా చదివేవారు. ఆ సమయంలో ఎ.ఎల్.మార్టిన్ రచన 'పీపుల్స్ హిస్టరీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్" చదవటం తటస్థించింది. అటువంటి ప్రజాచరిత్రను ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించి అందించాలని ప్రయత్నం చేసి 'ఆంధ్రుల చరిత్ర'ను తమ మొట్టమొదటి రచనగా వెలువరించారు. ఇది వామపక్ష భావాలు గలవారినే గాక ఆంధ్రుల చరిత్ర అంటే ఆసక్తి ఉన్న అందరి అభిమానాన్ని చూరగొంది.

### బలరామమూర్తి రచనల్లో ముఖ్యమైనవి

- 1. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర (1953)
- 2. భారతీయతత్వ శాస్త్రము (1955)
- 3. మన చరిత్ర (1972)
- 4. ఆంధ్రప్రదేశ్ దర్శిని (సహ సంపాదకులు, 1976)
- 5. గాంధేయ మార్గం తాత్వికత (1986)
- 6. మార్క్సిజం భగవద్గీత (వ్యాస సంకలనం, 1986)
- 7. బౌద్ధం-మార్క్సిస్టు దృష్టి (వ్యాస సంకలనం, 1987)
- 8. ఉపనిషత్ చింతన (1989)
- 9. దళితుల ఆత్మాభిమానానికి ప్రతీక డాక్టర్ అంబేద్కర్ (1991)
- 10. భారతీయ సంస్కృతి (1992)
- 11. గతం, వర్తమానం, భవిష్యత్తు (1995)
- 12. విశిష్ట విశ్లేషణ (1996)

1953లో ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర వెలువడినప్పుడు అది రాజకీయ రంగంలో పనిచేసే వారికి, విద్యా రంగంలో పని చేసే వారికి కూడా ఉపయోగపడి విశేషఖ్యాతి పొందింది. ఆంధ్ర జాతి స్థూల చిత్రణ దీని ద్వారా రచయిత పాఠకులకు అందించారు. ఈ గ్రంథం 1954లో రష్యన్ భాషలోకి కొలచల సీతారామయ్య

అనువదించారు. ఆంధ్రుల చరిత్ర వెలువడినప్పుడు సనాతన పండితుల ఆగ్రహానికి బలరామమూర్తి లోనయ్యారు. ఆంధ్రులు మిశ్రమ జాతి వారు అని పేర్కొన్నందుకు గాను, కోట వెంకటా చలం అనే సనాతన పండితుడు బలరామమూర్తిని కొట్టబోయి నంత పని చేశారంట! (చూడు! కమ్మ వారి చరిత్రము, పుస్తక సమీక్ష, విశాలాంధ్ర, 8-2-1996). చరిత్ర రచనలో కాని దార్శనిక విశ్లేషణలో కాని ఆయన ఒకరిని మెప్పించాలనో, మరొకరిని నొప్పించాలనో ప్రయత్నించేవారు కాదు. తాము యథార్థాలని విశ్వసించిన వాటిని నిర్మొహమాటంగా ప్రకటించే వారు. ఈ మధ్యనే పునర్ముద్రణ పొందిన కొత్త భావయ్యచౌదరి 'కమ్మ వారి చరిత్రము'ను సమీక్షిస్తూ కమ్మ వారు క్షత్రియులనే వాదం ఎంత అశాస్త్రీయమో వివరిస్తూ ఇలా అన్నారు : **"ఆంధ్రు లందరి విషయంలో ఏది నిజమో. కమ్మ వారి విషయంలోనూ అదే నిజం. కమ్మ వారిలో ముఖ్య పురుషుడైన జాయప సేనాని పూర్వీకులు బోయ రాజులు. బోయలు సంస్కృతీకరణ చెంది బ్రాహ్మణులుగా సైతం రూపొందారు. అధిక సంఖ్యాకులు చాళు క్యుల కాలంలోనే బ్రాహ్మణులు కాగా, కాకతీయుల కాలం నాటికి, వీరిలో "కొందరు కమ్మ రాజులైరి"** ఈ విధంగా ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన అనేక చారిత్రక వాస్తవాల్ని వెల్లడించి, మిశ్రమ జాతి, వర్ణ సంకరం అనే భావనలు దోషాలు కావు, సుగుణాలు అని ప్రకటించిన నిజమైన శాస్త్రీయ చరిత్రకా రుడు బలరామమూర్తి. బాబ్రీ మసీదు రామ జన్మభూమి వివాదం తీవ్రస్థాయికి చేరు కున్న ఈ దశలో 'ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర'లో బౌద్ధ స్తూపాలను హిందువులు ఎలా ఆక్రమించుకున్నది చైనా యాత్రికుడు యావాన్ చాంగ్ మాటల్లోనే బలరామమూర్తి వివరించిన అంశాలు చరిత్ర విద్యార్థులే కాదు మన చరిత్ర పట్ల సరైన అవగాహన ఏర్పరచుకోవాలని ప్రయత్నిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పక గుర్తుంచుకోవలసినది.

> **"అమరావతి స్తూపం బౌద్ధ భిక్షువుల అధీనంలో ఉంది. బ్రాహ్మణులు ఈ స్తూపంపై పెత్తనం కావాలని తగాదా పెట్టారు. బౌద్ధ భిక్షువులు తలుపులు బిగించుకొని లోపల కూర్చున్నారు. బయట బ్రాహ్మణులు ముట్టడి చేశారు. చివరకు బౌద్ధ భిక్షువులు తలుపులు తీసి, బయటకు వచ్చి రాజుగారి మధ్యవర్తిత్వం నడుపుదామని ఆయన వద్దకు వెళ్ళారు. ఈలోగా బ్రహ్మణులు స్తూపాన్ని ఆక్రమించుకున్నారు. రాజు బ్రాహ్మణుల తరపున తీర్పు చెప్పాడు. బౌద్ధ భిక్షువులు స్థాన భ్రష్టులై లేచిపోయారు. కొద్ది రోజుల తరువాత అమరావతి స్థూపం అమరేశ్వరాలయంగా మారిపోయింది."**

నేడు హిందూ మతోన్మాదులు ఒకనాడు ముస్లిములు హిందూ దేవాలయాలను పడగొట్టారని దుష్ప్రచారం చేసి రాజకీయ ప్రయోజనాన్ని పొందాలని చూసే ముందు ఒక్కసారి చరిత్రలో హిందువులు జైన దేవాలయాల్ని, బౌద్ధ ఆరామాల్ని బలవంతంగా ఎలా హిందూ దేవాలయాలుగా, పవిత్ర స్థలాలుగా మార్చారో తెలుసుకుంటే, చరిత్ర వక్రీకరణకు పాల్పడరు (చూడు: బౌద్ధ సంస్కృతి విధ్వంసన - ఆంధ్రుల చరిత్ర, 1975, పేజీలు 52-64).

### భారతీయ తత్వ శాస్త్రము

1955లో "భారతీయ తత్వశాస్త్రము" రచించారు. భారతీయ తత్వశాస్త్రంపై బలరామమూర్తి గారి అవగాహనను ఇది తెలియ జేస్తుంది. దీనిలో అతి ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక దార్శనిక ధోరణుల వరకు భారతీయ తత్వశాస్త్రం ఎలా మార్పు చెందుతూ వచ్చిందో వివరించారు. భారతీయ తత్వ శాస్త్రాన్ని వివరిస్తూ తెలుగులో ఏటుకూరు బలరామమూర్తి, డాక్టర్ జి.వి.కృష్ణారావు, గోపీచంద్, నండూరి రామమోహనరావు, ఎమ్.రాజగోపాలరావు వంటి వారు తమ రచనలు వెలువరిం చారు. వీరిలో బలరామమూర్తి తత్వశాస్త్రాన్ని శాస్త్రీయ దృష్టితో విశ్లేషించటానికి ప్రయత్నించిన వారిలో ప్రథముడు. బలరామ మూర్తి, డాక్టర్ జి.వి.కృష్ణారావు "కళాశాలలో సహ విద్యార్థులు, సాహితీమిత్రులు. బలరామమూర్తి వ్యావహారిక భాషలో రచనలు చేస్తే, డాక్టర్ జి.వి.కృష్ణారావు గ్రాంథిక భాషలో రచనలు వెలువరించారు. అందువల్ల వారి రచనలకు బలరామమూర్తి రచనలకు లభించిన ఆదరణ కరువైంది. అందులో బలరామ మూర్తి భారతీయ తత్వశాస్త్రాన్ని సమగ్రంగా ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు అందించటానికి ప్రయత్నిం చారు. డాక్టర్ జి.వి. కృష్ణారావు భారతీయ దర్శనాల్లో బౌద్ధంపైనే ఎక్కువ మక్కువ చూపి, దానిపైనే ఎక్కువ కృషి చేశారు. ఆంధ్రదేశంలో తత్వశాస్త్రమంటే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు మొట్టమొదట చదివే గ్రంథం బలరామమూర్తి 'భారతీయ తత్వశాస్త్రము." దీని ప్రథమ ముద్రణకు పరిచయం రాసిన మార్క్సిస్టు సాహితీ విమర్శకుడు మద్దుకూరి చంద్రశేఖరరావు **"భారతీయ తత్వశాస్త్ర పరిణామాన్ని అవగాహన చేసుకోవటానికి ఈ పుస్తకం తోడ్పడుతుందనీ, తత్వ శాస్త్ర గ్రంథాలను లోతుగా తరచి చూడాలని ఆసక్తి కలుగుజేస్తుందనీ ఆశిస్తున్నాను"** అని అన్నారు. ఈ మాటలు చాలా యథార్థమని తర్వాత చరిత్ర రుజువు చేసింది. ప్రథమ ముద్రణ సమయంలో మద్దుకూరి చంద్రశేఖరరావు ఆశించినట్టే ఈ పుస్తకం ఆలోచనాపరులైన పాఠకుల్ని ప్రభావితం చేసింది. ఈ పుస్తకాన్ని మొట్ట మొదట చదివిన వారు, దీని ప్రభావంతో తత్వశాస్త్రాన్ని ఇంకా లోతుగా అధ్యయనం చేయాలని ప్రయత్నిస్తారన్నది వాస్తవం. ప్రస్తుత వ్యాసకర్త ఈ పుస్తకం ప్రభావంతోనే తత్వశాస్త్రం వైపు ఆకర్షితుడ య్యాడు. బి.ఎ.లో తత్వశాస్త్రంలో మాకు పాఠాలు చెప్పిన సుప్ర

సిద్ధ తత్వశాస్త్ర అధ్యాపకులు ఎమ్.రాజగోపాలరావుని ఈ పుస్తకమే ప్రభావితం చేసిందని ఆయన మాకు చెబుతూ ఉండేవారు. ఈ విధంగా బలరామమూర్తి "భారతీయ తత్వ శాస్త్రము" నాలుగు దశాబ్దాలకు పైగా ఆంధ్రదేశంలోని అనేక మంది ఆలోచనాపరులను తొలి దశలో ప్రభావితం చేసింది. నిజానికి ఈ ఒక్క పుస్తకం చాలు బలరామమూర్తి పేరు ఆంధ్రదేశంలో చిరస్థాయిగా నిలిచిపోవడానికి. దీనిలో బలరామమూర్తి అతి ప్రాచీన కాలం నుండి ఆధునిక ధోరణుల వరకు ఇరవై అధ్యాయాల్లో భారతీయ తత్వ శాస్త్ర వికాసాన్ని ఆసక్తికరంగా వివరించారు. చివరి అధ్యాయం "తత్వశాస్త్రం–సామాజిక ప్రయోజనం"లో భారతీయ తత్వశాస్త్రం, తత్వవేత్తల గురించి సూటిగా తమ భావాల్ని వెల్లడించారు. ఆయన వెల్లడించిన అభిప్రాయాల్లోని కొన్ని ముఖ్యాంశాల్ని ఇక్కడ ఆయన మాటల్లోనే ఉటంకించటం సముచితంగా ఉంటుంది. మార్క్సిస్టు దృష్టితో ఆయన భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్లేషించినా, ఆయన కంటూ కొన్ని స్వతంత్రాభిప్రాయాలు ఉన్నాయనటానికి తార్కాణమే క్రింద పేర్కొంటున్న అభిప్రాయాలు.

**"నాగార్జున శూన్యవాదమైనా, శంకరుని అద్వైతమైనా పరిస్థితులతో రాజీ పడి, ఉన్న దానితో తృప్తి పడవలసిందని బోధిస్తాయి. ఈ రెండు తత్వశాస్త్రాలు పాలక వర్గాలకు తోడ్పడేవే. పాలక వర్గాలకు మూఢ నమ్మకాలు తరచు ఉండేవి కావు. ఐనా ప్రజలలో మాత్రం వాటిని వ్యాప్తి చేసేవారు. కౌటిల్యుని అర్ధ శాస్త్రంలో ఈ విషయం కనిపిస్తుంది. రాజుకు దేవుడు, దెయ్యం వంటి మూఢ నమ్మకాలు ఉండరాదు. కాని ప్రజలలో ఆ నమ్మకాలను వ్యాపింపజేయాలని కౌటిల్యుడు స్పష్టంగా పేర్కొన్నాడు.**

- "ప్రతి తాత్త్విక ధోరణిని ఏదో ఒక వర్గ పునాదికి ముడి పెట్టడం సాధ్యం కాదు. తత్వశాస్త్రం స్వతంత్ర విజ్ఞాన శాస్త్రంగా పెంపొందిన తర్వాత దానికి ప్రత్యేక గమన సూత్రాలు ఉంటాయి.
- "భౌతికవాదం ఎల్లప్పుడూ సామాజికంగా అభ్యుదయకరం. భావవాదం ఎల్లప్పుడూ సామాజికంగా అభివృద్ధి నిరోధకమని సూటి గీత గీయలేము. తాత్విక ఆలోచనలకు సామాజిక ఆచరణకు గల సంబంధం జటిలమైనది.
- "ఆధునిక యుగానికి ప్రాచీనమైన ఏ ఒక్క ధోరణి పనికిరాదు. శాస్త్రీయ విజ్ఞానంతో, తత్వశాస్త్రం ముందుకు సాగాలి. మతంతో ముడిని తెంచివేయాలి. సామాజిక పురోగతికి, తాత్విక దృక్పథం తోడ్పడాలి.
- "భారతీయ సాంస్కృతిక జీవనంలో సగర్వంగా మనం ప్రకటించుకోతగిన తాత్విక, సాంస్కృతిక సాంప్రదాయాలున్నాయి. త్రోసి పుచ్చవలసిన నిర్జీవ సాంప్రదాయాలు ఉన్నాయి. విచక్షణాయుతమైన ఇటువంటి దృష్టితో భారతీయ తత్వశాస్త్ర అధ్యయనాన్ని ప్రోత్సహించటమే ఈ రచన లక్ష్యం."

ఈ అభిప్రాయాలు మార్క్సిస్టు దృక్పథంతో భారతీయ తత్వ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన తర్వాత ఆయన ఏర్పరచుకొన్న స్వతంత్రాభిప్రాయాలు. వీటి వెలుగులో ఆయన భారతీయ తత్వ శాస్త్రాన్ని, చరిత్రను, సంస్కృతిని అధ్యయనం చేశారు. అందువల్లే ఆయన రచనల్లో ఒక విధమైన సంయమన దృష్టి గోచరిస్తుంది. మార్క్సిస్టు పడికట్టు పదజాలం ఆయన రచనల్లో కనిపించదు. గతితార్కిక భౌతికవాద ప్రభావంతో ప్రతి దర్శనాన్ని, దార్శనికుణ్ని ఆర్థిక–సామాజిక నేపథ్యంలో అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తారే కాని పడికట్టు పదజాలం గలగలలతో ఎదుటి వారిని బెదర గొట్టాలని ప్రయత్నించరు బలరామమూర్తి. అదే ఆయన విశిష్టత. అందువల్లే మార్క్సిస్టేతరుల్ని కూడా వారి రచనలు ప్రభావితం చేశాయి. ఆలోచింపచేశాయి. అయితే ఆయన రచనలపై మార్క్స్ – ఎంగెల్స్ ప్రభావంకంటే డాంగే, నెహ్రూల ప్రభావం ఎక్కువగా ఉందని తరచూ ఒక అభిప్రాయం వినపడుతూ ఉంటుంది. తొలి తర కమ్యూనిస్టుల్లో వీరిద్దరి ప్రభావం ఏదో మేరకు కనిపిస్తూనే ఉంటుంది. బలరామమూర్తిపై తొలి రోజుల్లో, డాంగే మార్క్స్ మార్క్సిజం ప్రభావం ఉన్నా, ఆయన ఆ దశను దాటి పోయారని ఆయన తర్వాత రచనలే రుజువు చేస్తున్నాయి. డాంగే అల్లుడు బనీదేశ్ పాండే రచించిన యూనివర్స్ ఆఫ్ వేదాంత" పుస్తకంపై సి.పి.ఐ. వారు నిర్వహించిన గోష్ఠి (మే 6,7, 1975) లో బలరామమూర్తి సమర్పించిన వ్యాసం Metaphysical Idialism Twisted and presented as Dialectical Materialism. 'ఈ వ్యాసంలో అభివృద్ధి చెందిన ఆధునిక భౌతికవాదమైన గతి తార్కిక భౌతికవాద పునాదులు వేదాల్లోనే ఉన్నాయంటూ దేశ్ పాండే చేసిన సూత్రీకరణల్ని కమ్యూనిస్టు నాయకుడు డాంగే సమర్థించిన తీరు చాలా ప్రమాదకరమైనదని బలరామమూర్తి నిరూపించారు.

### బౌద్ధంపై అధ్యయనం

బలరామమూర్తి తత్వశాస్త్రంపై రచనలు చేసినా, బౌద్ధ దర్శనమంటే ఆయనకు ప్రత్యేకమైన అభిమానమని ఆయన రచనలు చదివినప్పుడు గ్రహించగలం. మార్క్సిజాన్ని గాఢంగా చదివిన వారిపై బౌద్ధ ప్రభావం తప్పకుండా ఉంటుంది. ప్రాచీన గ్రీకు తత్వవేత్తల వలెనే ప్రాచీన బౌద్ధులు కూడా ప్రాథమిక గతితార్కిక దృష్టిని కలిగి ఉన్నారని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఎంగెల్స్ తమ "ప్రకృతి గతితర్కం" (Dialectics of Nature) అనే గ్రంథంలో అన్నారు. ఈ అభిప్రాయమే బలరామమూర్తిని కూడా ఆకర్షించింది, ఆలోచింపచేసింది. బౌద్ధ అధ్యయనానికి నా సేవ (My Contribution to Buddhist Studies) అనే

వ్యాసంలో బలరామమూర్తి ఇలా అన్నారు. "కొన్ని సంవత్సరాల తర్వాత ఎంగెల్స్ గ్రంథం ప్రకృతి గతితర్కం చదువుతుంటే అదృష్టం కొద్దీ ఒక ప్రకటన కనిపించింది. ప్రాచీన గ్రీకు తత్త్వ వేత్తల వలెనే, ప్రాచీన బౌద్ధులు కూడా ప్రాథమిక గతి తార్కిక దృష్టిని కలిగి ఉన్నారు. ఇది నాలో బౌద్ధంపై జిజ్ఞాసను, ఆసక్తిని రేకెత్తించింది". ఎంగెల్స్ అభిప్రాయాన్ని ప్రేరణగా తీసుకొని బౌద్ధంపై ప్రత్యేకమైన కృషిని ప్రారంభించారు. ఈ ప్రభావం మనకు భారతీయ తత్వశాస్త్రం నాటికే స్పష్టంగా కనిపిస్తుంది. దీనిలో బౌద్ధ తత్వ శాస్త్రంపై మూడు అధ్యాయాలున్నాయి. అవి : గౌతమ బుద్ధుడు – నాటి సమాజం, బౌద్ధంలో గతి తర్కం, బౌద్ధంలో శాఖలు, ఈ మూడు అధ్యాయాల్లో బౌద్ధ దర్శన చారిత్రక ప్రాధాన్యతను, పరిణామాన్ని బలరామమూర్తి చక్కగా వివరించారు. ఈ మూడు అధ్యాయాలు ఎటువంటి గందర గోళం లేకుండా బౌద్ధాన్ని అర్థం చేసుకోవటానికి ఉపకరిస్తాయి. బౌద్ధ దర్శన సారాంశాన్ని రష్యన్ పండితుడు ఓల్డెన్ బర్గ్ మాటల్లో సంక్షిప్తంగా ఇలా వివరించారు: **"దృశ్యమాన ప్రపంచంలో గతికంతా స్థితి మూలమని ఉపనిషత్తులు భావించాయి. అందుకు విరుద్ధంగా బుద్ధుడు స్థితికంతా గతి మూలమని తెలియజేశాడు."** అంటే ఉపనిషత్తులలోని దార్శనిక దృక్పథానికి భిన్నంగా, స్వతంత్రంగా బౌద్ధ దర్శనం అభివృద్ధి చెందింది. బౌద్ధ దర్శన పూర్వ రంగాన్ని అర్థం చేసుకోవడానికి, అవగాహన చేసుకోవటానికి కావాల్సిన చారిత్రక సమాచారాన్ని అందించారు.

'సర్వం' దుఃఖం, దుఃఖం అని గౌతమ బుద్ధుడు తరచు వాడాడు. అంటే బౌద్ధం నిరాశావాదమా అని ఎవరయినా ప్రశ్నించవచ్చు. బౌద్ధ దర్శనాన్ని అభిమానించే వాళ్ళను ఈ ప్రశ్నతో బౌద్ధేతరులు, బౌద్ధ వ్యతిరేకులు తరచు విసిగిస్తుంటారు. గతి తార్కిక సూత్రాన్ని అంగీకరించిన గౌతమబుద్ధుడు దుఃఖమ యినా శాశ్వతమని ఎలా అంగీకరిస్తాడు? అంతేకాదు. 'దుఃఖం' అనే మాటను బుద్ధుడు సాధారణార్థంలో కాక, ప్రత్యేకార్థంలో వైరుధ్యం, ఘర్షణ అను దార్శనిక భావంలో ప్రయోగించాడని చెబుతూ దుఃఖం అనే మాటను వ్యక్తి పరంగాను, సమాజ పరంగా గౌతమ బుద్ధుడు వ్యాఖ్యానించాడని పేర్కొన్నారు. ఈ రెండే కాకుండా ప్రకృతిలో, దృగ్విషయాలన్నిటిలోనూ విరుద్ధ శక్తుల కలయిక ఉన్నది. అది కూడా దుఃఖమేనని ప్రముఖ సింహళ బౌద్ధ దార్శనికుడు జి.పి.మలాల శేఖర అభిప్రాయాన్ని ప్రస్తావించారు. 1955 నాటికే బౌద్ధ దర్శనాన్ని చాలా చక్కగా శాస్త్రీయ దృష్టితో విశ్లేషించారని బౌద్ధంలోని దుఃఖ భావనపై ఆయన అభిప్రాయం చూస్తే గ్రహించగలరు. గౌతమ బుద్ధుడు దుఃఖం అనే పదాన్ని సాంప్రదాయార్థంలో కాకుండా, ఒక విశిష్టార్థంలో ఉపయోగించాడనే బలరామమూర్తి అభిప్రాయంతో మరి కొంతమంది ప్రసిద్ధ బౌద్ధ పండితులు అంగీకరిస్తున్నారు. షేర్ బాట్స్కీ అనే సుప్రసిద్ధ రష్యన్ పండితుడు "ది కన్సెప్షన్ ఆఫ్ బుద్ధిసే నిర్వాణ" అనే గ్రంథంలో Phenomenal life receives in the nyaya vaiseshika system the designation of dukkha just as Buddhism. It is inadequate to translate this term by suffering, misery, pain etc.. (పునర్ముద్రణ, మోతీలాల్ బనార్సీ దాస్, న్యూఢిల్లీ, పే64). ఈ విధంగా బౌద్ధాన్ని నిరాశావాదంగా, దుఃఖవాదంగా కాకుండా గతి తార్కిక దృష్టిగా, అంటే ఘటనల లోని అంతర్గత వైరుధ్యాల కారణంగా మార్పు జరుగుతుందనే నిత్య నూతన వాదాన్ని గౌతమబుద్ధుడు ప్రవచించాడని బల రామమూర్తి తమ గ్రంథంలో అభిప్రాయపడ్డారు. 1972లో విహంగ దృష్టితో "మన చరిత్ర" పేరుతో భారతదేశ సంక్షిప్త చరిత్రను రచించారు. ఆదిమ మానవుడి నుంచి ఆధునిక మానవుడి ఆవిర్భావం వరకు భారతదేశ చరిత్రను దీనిలో పొందుపరిచారు. రాజవంశాల చరిత్రను వీలైనంత తగ్గించి సామాన్యుని చరిత్రను వీలైనంత పెంచి మన చరిత్రను రచించానని వినయంగా ప్రకటించుకున్నారు. ఆర్యుల రాకతోనే భారతచరిత్ర ప్రారంభం కాలేదని, అంతకు ముందు కొన్ని వందల సంవత్సరాల క్రితమే మహోన్నతమైన హరప్ప నాగరికత ఈ దేశంలో ఆవిర్భవించిందని, ఈ రెండు నాగరికతల మధ్య ఘర్షణ, ఐక్యతల ద్వారా వినూత్నమైన భారతీయ నాగరికత ఆవిర్భవించిందని బలరామమూర్తి చారిత్రక సంయమన దృష్టితో ఆర్య, ఆనార్య దృష్టిని విడనాడి పరిశీలించారు. ఆర్య, అనార్య చారిత్రక దృక్పథాలతో పరిశీలించి భారతదేశ చరిత్రను తమ రచనల ద్వారా అందిం చాలని ప్రయత్నించిన వారి వల్ల ఈ దేశ చరిత్రకు ఎంతో అన్యాయం జరిగింది. వీరి రాతల వల్ల మన ప్రాచీన సంస్కృతి పై మన ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడ్డాయి. ఆర్యులు ఒక జాతి, అనార్యులు వేరొక జాతి అనే విభజన వల్ల ఈ దేవ చరిత్రకు ఎంతో అపచారం జరిగింది. **"ఆర్య అను పదం కాల క్రమేణ జాతిపరంగా సమన్వయం పొందినా, మొదట్లో అది భాషా పరంగానే ఏర్పడ్డది. జాతిపరంగా కాదు"** అనే బలరామమూర్తి అభిప్రాయం శాస్త్రీయ చారిత్రక పరిశోధనలకు నిలబడుతుంది. ఆర్య, ఆర్యేతర ప్రజల మధ్య ఏదయినా విభేదం ఉంటే అది భాషా పరమైనది, సంస్కృతి పరమైనదే కాని' జాతి' పరమైనది కాదని డాక్టర్ అంబేద్కర్ వంటి బ్రాహ్మణేతర మేధావి సైతం తమ రచనల్లో స్పష్టంగా ప్రకటించారు. ఇటువంటి చారి త్రక దృష్టితోనే ఆరోగ్యకరమైన వాతావరణాన్ని మన ప్రజల మధ్య కలిగించగలం. విపరీతమైన రాగ, ద్వేషాలతో చరిత్ర రచన చేసే వారి వల్ల మన చరిత్రకు ఎంతో అన్యాయం జరుగుతుంది. ఏ దేశ చరిత్రలోనయినా విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ అనివార్యమే. అయితే ఘర్షణకే ప్రాముఖ్యతనిచ్చి,

సమన్వయాన్ని, సమ్మేళనాన్ని విస్మరిస్తే సజీవ మానవ చరిత్రను, సంప్రదాయాన్ని ప్రజలకు అందించలేము. కాని బలరామమూర్తి తమ విశిష్టమైన మానవతాదృక్పథంతో "విరుద్ధ శక్తుల పరస్పర సమ్మేళనం అనే వాస్తవం ఒకటి మానవ చరిత్రలో అనాదిగా కనుపిస్తూంది" అని చెప్పగలిగారు.

మన చరిత్రలో ఆసక్తికరమైన, ఆలోచనాత్మకమైన అధ్యాయం – 'చంద్రగుప్త మౌర్యుడు – అశోక చక్రవర్తి". ఈ అధ్యాయంలో ప్రాచీన భారతీయ చరిత్రలో అశోక చక్రవర్తి విశిష్టతను, ఆయన పరిపాలనా కాలంలో ప్రవేశ పెట్టబడిన విప్లవాత్మక సామాజిక సంస్కరణలను బలరామమూర్తి అద్భుతంగా చిత్రించారు. కుల పతి వ్యవస్థ నశించి గ్రామవ్యవస్థ ఏర్పడటానికి అవసరమైన చట్టాలను అశోకుడు ప్రవేశపెట్టాడు. "అర్థ సమత, దండ సమత" అనే రెండు సంస్కరణలను ప్రతిపాదించాడు. ఆస్తిని బట్టి పన్ను, నేరాల్ని బట్టి శిక్ష – ఇవి ఈ సూత్రాల అర్థం. అంతకుముందు వర్ణాన్ని బట్టి పన్ను, శిక్ష విధించబడేవి. అగ్ర వర్ణాల పెత్తనం అడుగడుగునా చలామణి అవుతుండేవి. అశోక చక్రవర్తి ఈ రెండు ప్రత్యేక హక్కుల్ని రద్దు చేశాడు. భూస్వామ్య వ్యవస్థలో బ్రాహ్మణ క్షత్రియ నిరంకుశత్వం నుండి పేద వర్గాలకి ఇది ఒక వర ప్రసాదం. రాజ్య విస్తరణ ప్రతి రాజుకు తప్పని సరి విధి అని నిర్వచించిన కౌటిల్యుని అర్థ శాస్త్ర బోధలకు వ్యతిరేకంగా సహ జీవన సూత్రాన్ని అశోకుడు ఆచరించాడు. తన ఇరుగు పొరుగు రాజ్యాలను గురించి అశోకుని శాసనాలలో గల మైత్రీ భావ ప్రస్తావన ఏ పూర్వ రాజుల గాథలోనూ కనపడదు. ఇలా అశోకుడు తన పరిపాలనా కాలంలో ప్రవేశ పెట్టిన సంస్కరణల విశిష్టతను తెలియచేస్తూ, వ్యక్తిగా అశోకుడి లోని పరిమితుల్ని ఎలా అర్థం చేసుకోవాలో తమదైన విశిష్ట దృక్పథంతో బలరామమూర్తి ఇలా అన్నారు..

> **"ఒక రంగంలో ప్రసిద్ధుడైన వానికి ఇతర రంగాలలో ఏవో మచ్చలుండవని ఎక్కడా లేదు. వ్యక్తి జీవితం వేరు. ఈ రెంటిలోనూ అత్యున్నత ప్రమాణాలను స్థాపించి ఏక సూత్ర బద్ధులై జీవితం గడిపిన మహాత్ములు చరిత్రలో అరుదు. అట్టి మహాత్ముల ప్రమాణాలతో పరిశోధిస్తే చరిత్రలో ఎవరూ నిలవరు. ఇట్టి లోపాలు ఎంత నింద్యమైనా మానవ సహజంగా ఎంచి, ఇతరత్రా ఆ వ్యక్తులు సాధించిన విజయాలను, చరిత్రకు చేసిన సేవను, గమనించటమే కావలసింది"**

ఇటువంటి మాటలు చరిత్ర రచనలో, పరిశోధనలో ఉత్తమ మానవ ప్రమాణాల కోసం నిలబడ్డ బలరామూర్తి లాంటి వారే వెల్లడించగలరు. ఇటువంటి ఉన్నత మానవీయ దృష్టిని చివరి దాకా కొనసాగించటం వల్లే ఏ.బి.కె. ప్రసాద్ అన్నట్లు బలరామ మూర్తి "బౌద్ధిక సరిహద్దుల్ని" విస్తరించగలిగారు.

కొంతకాలం విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులుగా కూడా పనిచేశారు. వై.వి.కృష్ణారావు, బలరామమూర్తి గార్ల సంపాదక త్వంలో 'ఆంధ్రప్రదేశ్ దర్శిని' వెలువడింది. సీపీఐ సిద్ధాంత పత్రిక "కమ్యూనిజం" సంపాదక వర్గ సభ్యులు. దీనిలో తాత్విక, చారిత్రక, సాహిత్యాది విషయాలపై అనేక వ్యాసాలు రచించారు. ఇవి ఇంకా పుస్తక రూపంలో వెలుగు చూడలేదు. కమ్యూనిజంలో వెలువడిన బలరామమూర్తి ముఖ్యమైన రచనలు కొన్ని. "సోవియట్లో భారతీయ అధ్యయనం", "శూన్యవాదం", "భారతీయ తాత్విక చింతనలో ఆత్మభావన", "కాంట్, సార్త్ర్, శంకర", "సార్త్ర్ అస్తిత్వ వాదం", "జ్ఞాత – జ్ఞేయం – జ్ఞానం". ఉపనిషత్ చింతనపై కమ్యూనిజంలో వచ్చిన వ్యాసాలు పుస్తక రూపంలో వచ్చాయి.

ఈ మధ్య ఒక సందర్భంలో ప్రసంగిస్తూ బలరామమూర్తి "ఇప్పటి వరకు భారతీయ తత్వశాస్త్రాన్ని విహంగ దృష్టితో చూశాను. అది చాలదు. తత్వ శాస్త్రంలోని కొన్ని విభాగాలను గాఢంగా అధ్యయనం చేయా"లని ఉందని అన్నారు. అలా లోతుగా అధ్యయనం చేసి వెలువరించిన పుస్తకాలలో 'ఉపనిషత్ చింతన' బలరామమూర్తి రచనల్లో మొదటిది. 1989 ఫిబ్రవరిలో దీని ప్రథమ ముద్రణ వెలువడితే, వేయి ప్రతులు తొమ్మిది నెల ల్లోనే అయిపోయాయి. ద్వితీయ ముద్రణ 1990లో వెలువడిం ది. తత్వశాస్త్రంపై వెలువడిన పుస్తకాలు ఇంత త్వరగా ఖర్చ యిపోవటం చాలా అరుదైన విషయం. తెలుగులో ఉపనిషత్తుల తాత్విక దృక్పథాన్ని సమగ్రంగా వివరించిన రచన ఇది. ప్రాచీన భారతీయ తత్వశాస్త్రంలో బలరామ మూర్తికి ఉన్న గాఢమైన పరిజ్ఞానానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే! ప్రాచీన భారతీయ తాత్విక చింతనకు ఉపనిషత్తులు ప్రథమ రచనలు వీనిలో వివిధ దార్శనిక ధోరణులకు సంబంధించిన భావాలు ఉన్నాయి. మన ప్రాచీన భావవాద, భౌతిక వాద భావజాలానికి ప్రతినిధులైన యాజ్ఞవల్క్యుడు, ఉద్దాలకుడు వంటి వారి ప్రస్తావన వీటిలో ఉంది. శంకరాచార్యుడు వ్యాఖ్యానించిన దశోపనిషత్తుల నే ప్రమాణంగా తీసుకొని చారిత్రక, తులనాత్మక దృష్టితో ఉపనిషత్ చింతనను విమర్శనాత్మకంగా పరిశీలించారు. ఇంత సమగ్రంగా, శాస్త్రీయంగా పరిశోధించి రాసిన పుస్తకంలో అక్కడక్కడ కొన్ని లోపాలు లేకపోలేదు.

ముఖ్యంగా ఉపనిషత్‌లలోని మానవతా ధోరణి గురించి రాసిన బలరామమూర్తి వర్ణ వ్యవస్థను తీవ్రంగా నిరసించిన "వజ్ర సూచికోపనిషత్" గురించి కనీసం ప్రస్తావంచకపోవటం ఆశ్చర్యంగా ఉంది. పుట్టుకపై ఆధారపడిన వర్ణ వ్యవస్థను ఈ ఉపనిషత్ తీవ్రంగా గర్హించిందని, ప్రధాన ఉపనిషత్‌ను ఆంగ్లం లోకి అనువాదం చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు. ఈ వజ్ర సూచికోపనిషత్‌ను ప్రధాన ఉపనిషత్‌లో ఒకటిగా

పరిగణించి రాధాకృష్ణన్ ఆంగ్లంలోకి అనువాదం చేశారు. ఈ ఉపనిషత్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఉపనిషత్‌లోని మానవతా ధోరణిని స్పష్టంగా చూపించలేము. ఆ వెలితి బలరామమూర్తి "ఉపనిషత్ చింతన"లో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఈ లోపాన్ని వారి దృష్టికి ప్రస్తుత వ్యాసకర్త తీసు కెళ్ళినప్పుడు దాన్ని గుర్తిస్తూ వారు ఉత్తరం రాశారు. పునర్ముద్రణ సమయంలో ఆ పొరపాటును సరిదిద్దుతానన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా, ఎవరి నుంచి సరియైన విమర్శ వచ్చినా, ఆయన సహృదయతతో స్వీకరించేవారు.

గాంధీ, అంబేద్కర్‌ల జీవితం, ఆలోచనా ధోరణులపై బలరామమూర్తి 1986లో రెండు ముఖ్యమైన రచనలు చేశారు. 'గాంధేయ మార్గం-తాత్వికత'లో గాంధీ తాత్వికతను బలరామ మూర్తి మార్క్సిస్టుగాకంటే ఒక జాతీయవాదిగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా మాత్రమే విశ్లేషించారనిపిస్తుంది. గాంధీని ప్రపంచమంతా కీర్తిస్తుంది కాబట్టి, ఆ కీర్తనలో మనం పాలు పంచుకోవాలన్న ఆసక్తి మాత్రమే ఇందులో కనిపిస్తుంది. గాంధీని అవసరమైన దానికంటే ఎక్కువ అభిమానించటం కనిపి స్తుంది. గాంధీ వ్యక్తిగతంగా ఎంత గొప్పవాడయినా కావచ్చు. కాని ఆయన తాత్విక దృష్టి, ఆలోచనలు ఎంత ప్రమాదకరమైనవో బలరామమూర్తి గ్రహించలేకపోయారు. గాంధేయ మార్గం ఔన్నత్యం గురించి చెప్పే ముందు, కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి నేతాజీ ఎన్నికయినప్పుడు గాంధీ నిర్వహించిన పాత్రను విస్మరిస్తే ఎలా ? ఏమయినా ఈ పుస్తకం ఆది నుండి అంతం వరకు వివాదాస్పదం అనటంలో సందేహం లేదు. ఇంత ఉన్నతంగా డాక్టర్ అంబేద్కర్‌ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే చాలా గొప్పగా ఉండేది. **'డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలకు విస్తృత ప్రచారం లభిస్తున్న ఈనాడు, ఆయన ఆలోచనా సరళిలోని అనుకూల, ప్రతికూల అంశాలు రెండిటిని అవగాహన చేసుకోవటం అవసరం"** అని గుర్తించిన బలరామమూర్తి డాక్టర్ అంబేద్కర్‌లోని ప్రతి కూలాంశాలనే ఎత్తి చూపటానికి ఎక్కువ ప్రయత్నం చేశారని అంబేద్కర్-జీవితం ఆలోచనా సరళి చదివితే అర్థమౌతుంది. ఆధునిక భారత చరిత్రలో డాక్టర్ అంబేద్కర్ నిర్వహించిన చారిత్రక పాత్రను గుర్తించటంలో బలరామమూర్తి విఫలమయ్యారని చెప్పటానికి ఎటువంటి సందేహం లేదు. (చూడు: ఏటుకూరి బలరామమూర్తి వ్యాసం : డాక్టర్ అంబేద్కర్ జీవితం - ఆలోచనా సరళి, టి. రవిచంద్, ఎదురీత, మే 1991).

1987వ సంవత్సరంలో అప్పటికి పదిహేను సంవత్సరాల క్రితం ముగ్గురు మార్క్సిస్టు మేధావులు రచించిన "బౌద్ధం - మార్క్సిస్టు దృష్టి' వ్యాస సంకలనాన్ని ప్రచురించారు. దీనిలో "బౌద్ధ తత్వశాస్త్రం" అనే ఒక మంచి వ్యాసాన్ని బలరామమూర్తి రచించారు. ఆనాటి ఉపనిషత్ తత్వశాస్త్రానికి ప్రతిగా జరిగిన సిద్ధాంత ఘర్షణ నుండి బౌద్ధ తత్వశాస్త్రం ఆవిర్భవించిందన్న బలరామమూర్తి వాక్యం బౌద్ధ తత్వశాస్త్రం పూర్వ రంగాన్ని అవగాహన చేసుకోవటానికి బాగా తోడ్పడుతుంది. బలరామ మూర్తి వంటి చరిత్రకారులే కాక, బౌద్ధాన్ని నిష్పాక్షికంగా పరిశోధించిన పండితులు విధుశేఖర భట్టాచార్య, షేర్ బాట్స్కీ, టి.ఆర్.వి.మూర్తి, రాహుల్ సాంకృత్యాయన్ ఇత్యాదులు బౌద్ధం అనాత్మ సంప్రదాయం అని చెప్పినవారే. అయితే రాధాకృష్ణన్ లాంటి సాంప్రదాయిక ధోరణి గల అద్వైతులు బౌద్ధం కూడా ఉపనిషత్‌లోని ఆత్మ సంప్రదాయాన్ని అంగీకరించిందని రాశా రు. ఆత్మవాద సాంప్రదాయానికి సంబంధించిన వేదాంతానికి, ఆనాత్మవాద సంప్రదాయానికి సంబంధించిన బౌద్ధానికి ఎటువంటి సంబంధం లేకపోవటమే కాకుండా, ఆ రెండు తాత్విక ధోరణుల మధ్య నిరంతరాయమైన పోరాటం జరిగింద నేది నిర్వివాదాంశం. బౌద్ధ తత్వశాస్త్రంపై ఆయన వ్యాసం చారిత్రకంగా, తాత్వికంగా చాలా ముఖ్యమైనది.

1992లో "భారతీయ సంస్కృతి"పై బలరామమూర్తి పెద్ద గ్రంథాన్ని రచించారు. భారతీయ చరిత్ర తత్వ శాస్త్రాలను మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేసిన ఆయన 'భారతీయ సంస్కృతి'ని రచించారు. దీనికి 1995లో తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారం లభించింది. దీన్ని తమ తండ్రి ఏటుకూరి సీతారామయ్యకు అంకితం చేశారు బలరామమూర్తి. ఏ సంస్కృతి వికాసంలోనైనా విసర్జించవలసిన అంశాలతోపాటు, స్వీకరించి పరిపుష్టం చేయవలసిన అంశాలు ఉంటాయన్న శాస్త్రీయ దృష్టితో భారతీయ సంస్కృతి పరిణామాన్ని వేద కాలం నుండి ఆధునిక జాతీయ పునరుజ్జీవనోద్యమాల వరకు పరామర్శించారు బలరామమూర్తి. ఎంతో విలక్షణమైన భారతీయ సంస్కృతిలోని వైవిధ్యాన్ని, విశిష్టతను వివరించటానికి ప్రయత్నించారు. ఆర్య, అనార్య భావ సమ్మేళనం భారతీయ సంస్కృతి వికాసంలో ప్రధానమైన లక్షణ మని ఆయన భావించారు. నిరంతరాయంగా అనేక ఒడుదుడుకులతో, విధ్వంసం, పునః సృష్టి క్రమంలో భారతీయ సంస్కృతి కొనసాగుతున్నది. ప్రాచీన భారతీయ సామాజిక వ్యవస్థలో అంతర్భాగమైపోయిన అనేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యత్యాసాలకు వ్యతిరేకంగా సాగిన గొప్ప నిరసనోద్యమాలు-చార్వాక, జైన, బౌద్ధ ఉద్యమాలు. వీటి ఆవిర్భావానికి పూర్వం భారతీయ సంస్కృతి, తత్వశాస్త్రాల రూపు రేఖలు వేరు ఈ ఉద్యమాలు కలిగించిన మహోన్నతమైన ప్రభావంతో భారతీయ సంస్కృతిలో వినూత్న భావ సంచలనం కలిగింది. తద్వారా నూతన భారతీయ సంస్కృతి రూపు దిద్దుకున్నది. భారతీయ సంస్కృతిని గురించి సామాన్య పాఠకులలో సైతం శాస్త్రీయమైన అవగాహన కలిగించాలని బల రామమూర్తి చేసిన ప్రయత్నం చాలావరకు జయప్రదమైనా, కొన్ని సందర్భాలలో ఆయన వెల్లడించిన అభిప్రాయాలు

వివాదాస్పదమే కాక మరి కొన్ని సందర్భాలలో ఆయన వ్యక్తీకరించిన అభిప్రాయాలు ఏ మాత్రం విమర్శనాత్మకంగా లేవు. ఈ వ్యాసంలో ఆయన రచనల్లో ముఖ్యమైన వాటిని రేఖా మాత్రంగా పరిచయం చేయటమే ప్రస్తుత వ్యాస కర్త ఉద్దేశ్యం కాబట్టి ఒకటి రెండు వివాదాస్పద అంశాల్ని మాత్రమే పాఠకుల దృష్టికి తెస్తాను. అస్పృశ్యత హిందూ సమాజంలో ఎప్పుడు పుట్టిందనే విషయంపై డాక్టర్ అంబేద్కర్ "అస్పృశ్యులెవరు?" అనే గ్రంథంలో చాలా సుదీర్ఘమైన చర్చ చేశారు. ఇదే విషయంపై బలరామమూర్తి వ్యాఖ్యానిస్తూ దళితుల ఆత్మాభిమానానికి ప్రతీక డాక్టర్ అంబేద్కర్" అనే వ్యాసంలో దాదాపు మనుస్మృతి సంకలనం చేయబడే నాటికి అస్పృశ్యత పుట్టిందనే డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయంతో తీవ్రంగా విభేదిస్తూ, 'బుద్ధునికి పూర్వమే అస్పృశ్యత వున్నట్లు స్పష్టమైన ఉదాహరణలు ఉన్నాయి' అంటారు. మరల ఇదే అంశంపై "భారతీయ సంస్కృతి"లో చర్చిస్తూ ఇలా అంటారు.

> **"మనుస్మృతి కాలంలో బ్రాహ్మణ స్త్రీకి, శూద్రునికి, లేక ఇంకా తక్కువ కులం పురుషునికి జన్మించిన బాల, బాలికలను క్రిందకి త్రోసి చండాలురు అనగా అస్పృశ్యులుగా పరిగణించటం మొదలయింది. అస్పృశ్యతా పిశాచి పుట్టింది అప్పుడే, పెరిగింది అప్పుడే" అని రాశారు.** అలా ఒకే చారిత్రకాంశంపై వివిధ సందర్భాలలో రాసినప్పుడు పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తీకరించటం బలరామమూర్తి రచనల్లో తరచు కనిస్తుంటుంది. ఈ పరస్పర భిన్నాభిప్రాయాలకు కారణమేమిటో పాఠకులకు బోధపడదు.

సామాజిక శాస్త్రాలకు సంబంధించిన విషయాలపై ఎవరూ తుది మాట చెప్పలేరు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొనే డాక్టర్ అంబేద్కర్ "శూద్రులెవరు? "అస్పృశ్యులెవరు" గ్రంథాల్ని రాగ ద్వేషాలకు అతీతంగా రచించారు. అయినా డాక్టర్ అంబేద్కర్ తమ రచనల్లో చారిత్రక వక్రీకరణకు పాల్పడ్డారని 'బలరామమూర్తి తీవ్రంగా విమర్శించి, నిరసించారు. ఈ గ్రంథంలోనే "సమానాంతర పరిణామం" అనే అధ్యాయంలో కాళిదాసు, అశ్వఘోషులపై రాసిన విషయాలు వివాదాస్పదం, చర్చనీయాంశం. బౌద్ధ సంస్కృతిపై ఎంతో ఎక్కువ, ఆసక్తి ఉన్న బలరామమూర్తి సంస్కృత సాహిత్యంలో అశ్వఘోషుడి స్థానాన్ని గుర్తించటంలో పొరపాటుపడ్డారు. కవిగా, నాటకకర్తగా కాళిదాసు దాదాపు అశ్వఘోషుడంతటి గొప్పవాడే. కానీ మానవతా విలువల ప్రతిపాదనలో, ప్రచారంలో కాళిదాసుకంటే అశ్వఘోషుడే గొప్ప. వీరిద్దరిలో ఎవరు ముందు, ఎవరు వెనుకా అనే చర్చను ప్రక్కన పెట్టి వారి సామాజిక దృక్పథాల్ని విశ్లేషిస్తే నిశ్చయంగా అశ్వఘోషుడు గొప్ప మానవతా వాది. కాని బ్రాహ్మణ సంస్కృతి పునరుద్ధరణకు దీక్ష వహించి "రఘు వంశం" (15వ అధ్యాయం, శ్లోకాలు 42-53)లో కాళిదాసు రాముడు శంబుకుణ్ణి వధించటాన్ని సమర్థించాడు. వర్ణ వ్యవస్థ పరిరక్షణలో భాగంగా శూద్ర శంబుకుణ్ణి రాముడు వధించటం సబబేనని సమర్ధించిన కాళిదాసు గొప్పతనాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే బలరామమూర్తి దృష్టిలో!

అదే సమయంలో బ్రాహ్మణీయ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా మానవతా వాదాన్ని 'వజ్రసూచి'లో ప్రకటించిన అశ్వఘోషుడి రచన కనీసం బలరామమూర్తి దృష్టికి రాలేదు మహాకవి అశ్వఘోషుడి రచనల్లో ప్రధానమైనవి 'సౌందరనంద కావ్యం', 'సూత్రాలంకారం', 'బుద్ధ చరిత్రం', 'వజ్ర సూచిలను', బౌద్ధేతర రచయితలు కూడా అంగీకరిస్తున్నారు. అశ్వఘోషుడి రాజకీయ, సామాజిక భావాల్ని అధ్యయనం చేయటానికి, అవగాహన చేసుకోవటానికి 'వజ్ర సూచి' అత్యంత ప్రాధాన్యతగల రచనగా విమర్శకులు భావిస్తున్నారు. ఈ రచనల్లో అశ్వఘోషుడు వర్ణ వ్యవస్థను అసమానమైన తార్కిక దృష్టితో, సహజ సమానత్వం అనే దార్శనిక ప్రాతిపదికతో, అమానుషమైన బ్రాహ్మణ మత సిద్ధాంతాన్ని తీవ్రంగా నిరసించాడు. వర్ణ వ్యవస్థను ఖండించటం ద్వారా అశ్వఘోషుడు కాళిదాసుని మించిన మానవతా దృష్టిని ప్రదర్శించాడు ఈ విషయాలేవీ బలరామమూర్తి దృష్టికి రాలేదు. అదే శోచనీయం. భారతీయ సంస్కృతి పరిణామంలో అడుగడుగునా బ్రాహ్మణీయ సంస్కృతికి నిలయమైన వర్ణవ్యవస్థను బౌద్ధులు తీవ్రంగా నిరసించి, మానవతా సంస్కృతి ఏర్పడటానికి దోహదపడ్డారు. ఈ రెండూ సమానాంతరంగా సాగినా, వీటి మధ్య స్పష్టమైన విభజన కనిపిస్తుంది. కాళిదాసు వంటి వాళ్ళు ఎంత గొప్ప కవులు, నాటకకర్తలయినా, వాళ్ళు వర్ణవ్యవస్థ సమర్థకులు, ప్రచారకులు. అశ్వఘోషుడి లాంటి కవులు మానవ తా సంస్కృతి పరిరక్షకులు, ప్రచారకులు ఈ తేడాని భారతీయ సంస్కృతిని విమర్శనాత్మకంగా అధ్యయనం చేసేవారు గుర్తించక పోతే, మన సాంస్కృతిక వారసత్వంలోని సజీవ, నిర్జీవ ధోరణుల్ని స్పష్టంగా ప్రజలకు అందించలేము. ఇటువంటి లోపాలు ఎన్ని ఉన్నా, నాలుగు దశాబ్దాలకుపైగా ఆంధ్రుల బౌద్ధిక జీవితాన్ని ప్రభావితం చేసిన బలరామమూర్తి జీవితం, రచనలు ఆదర్శప్రాయం. మత వాద సంస్కృతికి ప్రత్యామ్నాయంగా మానవవాద సంస్కృతి ఆవిర్భావానికి కావాల్సిన చారిత్రక వారసత్వాన్ని అందించటానికి తమ జీవితం అంతిమ ఘడియల వరకు నిర్వి రామంగా పరిశ్రమించిన నిజమైన మార్క్సిస్టు మేధావి, చరిత్రకారుడు ఏటుకూరు బలరామమూర్తి. ఆయన చిరస్మరణీయుడు! "అనాగరికత నుండి నాగరికతకు, అజ్ఞానం నుండి విజ్ఞానానికి, పశు ప్రవృత్తి నుండి మానవతకు సాగే పరిణామం సంస్కృతీ చరిత్ర. ఈ సంస్కృతీ స్రవంతిలో విసర్జించవలసిన అంశాలతో, స్వీకరించి పరిపుష్టం చేయవలసిన అంశాలూ ఉన్నాయి. అలా చేయటం ద్వారానే, నిత్యనూతనంగా వికసిస్తూ భారతీయ సంస్కృతి ముందుకు సాగగలదు. ❑ **(1996 మే మిసిమి మాసపత్రిక నుంచి)**

# ప్రపంచ విప్లవోద్యమ చుక్కాని లెనిన్



- మల్లేపల్లి లక్ష్మయ్య

"మార్క్స్ తదనంతరం విప్లవ కార్మికోద్యమం ప్రపంచానికి అందించిన గొప్ప మేధావి వి.ఐ. లెనిన్" అంటూ 1924లో ఆనాటి హంగేరియన్ తాత్వికవేత్త జార్జి లూకాస్ వ్యాఖ్యానించారు. అలాంటి లెనిన్ పేరు నేడు కొంత తక్కువగా వినిపిస్తుండవచ్చు. ప్రపంచ కార్మికలోకపు వేగు చుక్క లెనిన్ పేరుని స్మరించుకోవడానికి కూడా కొందరు భయపడి ఉండవచ్చు. లేదా కొందరు కావాలనే ఆతని పేరుని మరుగుపర్చే ప్రయత్నం లో ఉండి ఉండవచ్చు. కానీ 20వ శతాబ్దంలో ప్రపంచ గమనాన్ని, కోటానుకోట్ల మానవ మెదళ్ళను కదిలించిన, అనంత జనసమూ హాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేసిన పేరు ఇది. 1917లో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా జరిగిన విప్లవ పోరాటం విజయవంతమై, అక్టోబర్ విప్లవంగా ప్రపంచ ప్రసిద్ధికెక్కింది. ఆ విప్లవంలో ఎగిసిపడిన అరుణ పతాకంలో అగుపించిన ఏకైక ప్రతిబింబం లెనిన్.

151 సంవత్సరాల క్రితం.. 1870, ఏప్రిల్ 22న రష్యాలోని సింబిర్స్ట్‌లో లెనిన్ జన్మించారు. ఆయన పూర్తిపేరు వ్లాదిమిర్ ఇల్విచ్ ఉల్యనోవ్ లెనిన్. ఆయన సంపన్న కుటుంబంలోనే జన్మించారు. ఆయన తండ్రి పాఠశాల అధికారిగా పనిచేశారు. లెనిన్ సోదరుడు జార్ చక్రవర్తిపై హత్యాయత్నం చేశాడన్న నేరం మోపి, ఆయనకు 1887లోనే ఉరిశిక్ష విధించారు. లెనిన్ కూడా నిరంకుశ రాచరిక జార్ చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకం గా పోరాటంలో పాల్గొనడం వల్ల 1897లో కజన్ విశ్వవిద్యా లయం నుంచి ఆయన్ను బహిష్కరించి, సైబీరియాకి పంపించి వేశారు. ఆయన మొదట్లో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆ తర్వాత బోల్షివిక్ గ్రూప్‌నకు వ్యవస్థాపక నాయకుడయ్యారు. ఆ తర్వాత లెనిన్ అందించిన నాయకత్వం వల్ల ఆయన అవలంబించిన విప్లవ ఎత్తుగడ వల్ల 1917లో జార్ చక్రవర్తి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత ఆవిర్భవించిన సోవియట్ యూనియన్ సోషలిస్టు రిపబ్లిక్‌కు చైర్మన్‌గా ఎన్నికై, 1924లో తుదిశ్వాస విడిచే వరకు కొనసాగా రు. ఆయన నాయకత్వం, ఆయన రచనలు, విప్లవోద్యమాన్ని విజయపథంలో నడిపించిన ఆయన సారథ్యం ఆనాడు యావత్ ప్రపంచ గమనాన్నే మార్చేందుకు దోహద పడ్డాయి. ఆయన తాత్విక భూమికకు ఆయన రచనలు సాక్ష్యాలు. ముఖ్యంగా రాజ్యం-విప్లవం, కమ్యూనిజం-ఒక బాలారిష్టం, ఒక అడుగు ముందుకు-రెండడుగులు వెనక్కి, సామ్రాజ్యవాదం-పెట్టుబడి



దారి విధానపు అత్యు న్నత దశ, లాంటి రచనలు ఆనాటి ప్రపంచ కార్మికోద్యమ, ప్రజాస్వామిక, విప్లవోద్యమ కారులకు దారిచూపే దివిటీలయ్యాయి. ముఖ్యం గా 'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అనే రచన ఈనాటికీ ప్రపంచ ఆర్థిక సిద్ధాంతాలలో అత్యంత అరుదైన రచన. ఆ పుస్తకంలో లెనిన్ ఆనాడు రష్యాలోని పెట్టు బడిదారీ పద్ధతులను, యూరప్‌లో జరుగుతున్న పెట్టుబడి దారీ పరిణామాలను చాలా లోతుగా అధ్యయనం చేశారు. ఆనాటి సామ్రాజ్యవాద దశను నిర్వచించడానికి ఆయన కొన్ని సూత్రీ కరణలు చేశారు. అందులో మొదటిది, ఉత్పత్తిని, పెట్టుబ డిని కేంద్రీకృతం చేసే గుత్త సంస్థలను రూపొందించడం, రెండవది, బ్యాంకుల పెట్టుబడిని, పారిశ్రామిక పెట్టుబడులను కలిపివేసి ఫైనాన్షియల్ పెట్టుబడిని తయారుచేయడం, మూడవది, అంతకుముందు ఎగుమతిచేసే వస్తువులతోపాటు, పెట్టుబడిని ఎగుమతి చేసే విధానాలను మొదలు పెట్టడం, నాలుగవది, అప్పటికే ఏర్పడిన ప్రపంచ పెట్టుబడి గుత్త సంస్థలు భౌగోళి కంగా తమలో తాము విభజించుకోవడం, అయిదవది పెట్టుబడి శక్తులు ప్రాంతాల వారీగా తమ ఆధిప త్యాన్ని నెలకొల్పుకో వడం. ఈ అయిదు

అంశాలు పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రపంచ వ్యాపితం చేయడానికి ఉపయోగపడ్డాయి.

ఈ పుస్తకాన్ని 1916లో లెనిన్ రాశారు. అంటే వందేళ్లు పూర్తయ్యాయి. ఈ రోజు సామ్రాజ్యవాదం రూపు మార్చుకొని ప్రపంచీకరణ అవతారం ఎత్తింది. ఆయా దేశాల్లోని పాలక వర్గాలను తమ అనుచరులుగా మార్చుకొని, ఆ దేశాలలోని ప్రజలను ముఖ్యంగా మధ్య తరగతి వర్గాలను, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వచ్చిన అభివృద్ధితో తయారు చేసిన వస్తు సముదాయం మత్తులో ముంచి వేసి, ఎన్నటికీ బయటపడే వీలులేని, ఆర్థికచక్ర వలయంలోకి తోసివేసి, అంతర్జాతీయ మార్కెట్‌ను కొల్లగొడుతోంది. ఇప్పుడు మనమంతా ఆ మాయాజాలంలో ఇరుక్కుని కొట్టుమిట్టాడుతున్నాం. 1917లో రష్యాలో విజయం సాధించిన అక్టోబర్ విప్లవం ప్రపంచంలోని అన్ని దేశాల వలసపాలకులపై ఆయా దేశాల ప్రజలు తిరుగుబాటు చేసే విధంగా స్ఫూర్తిని కలిగించింది. కమ్యూనిజాన్ని ఏ కోశానా సమర్థించని మహాత్మాగాంధీ, మానవతా సిద్ధాంతమే తన జీవిత కవితా వస్తువుగా స్వీకరించిన రవీంద్రనాథ్ ఠాగూర్‌లు కూడా రష్యా విప్లవాన్ని ఆహ్వానించారు. జవహర్‌లాల్ నెహ్రూ 1920లోనే రష్యాను సందర్శించి ప్రేరణ పొందారు. ఆ తర్వాత జరిపిన కాంగ్రెస్ మహాసభల్లో సోషలిజం ఆవశ్యకతను, సమానత్వ భావనలపై సుదీర్ఘంగా మాట్లాడారు. రష్యా విప్లవం తర్వాతనే ప్రపంచంలోని అన్ని దేశాల్లో ప్రజాస్వామ్య ఉద్యమాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, జాతుల విముక్తి పోరాటాలు వెల్లువెత్తాయి. చైనా లాంటి ఒక పెద్ద దేశంలో మావో సే టుంగ్ నాయకత్వంలో చైనా విప్లవం విజయవంతమైంది. "జాతులు విముక్తిని కోరుతున్నాయి, దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నాయి. ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు" అంటూ ఆనాటి విప్లవ యుగ ప్రాముఖ్యతను మావో ఉత్తేజకరంగా చాటిచెప్పారు. ఆనాడు లెనిన్ యువతరం కలల నాయకుడిగా నిలిచారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికొయ్యలను ముద్దాడిన భగత్‌సింగ్ కూడా లెనిన్ తాత్విక భావాల పట్ల ఆకర్షితులయ్యారు. భగత్‌సింగ్‌కి ఉరిశిక్షను అమలు చేసే ముందు జైలు అధికారులు చివరి కోరిక ఏమిటని అడగ్గా "నేను లెనిన్ జీవిత చరిత్రను చదువుతున్నాను. అది పూర్తిచేయాలనేదే నా కోరిక" అని భగత్ సింగ్ చెప్పిన మాటలు ఆనాటి నుంచి నేటి వరకు యువతరం గుండెల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఎన్ని తరాలు మారినా, మరెన్ని వక్ర భాష్యాలు, సిద్ధాంతాలు ఉద్భవించినా ప్రపంచగమనాన్ని మార్చిన వ్యక్తులను ఎవ్వరూ విస్మరించలేరు. మానవజాతి మనుగడ కొనసాగినంత వరకూ, దోపిడీ, పీడనలు తొలగిపోయి, ఎటువంటి వివక్షకూ తావులేని సమసమాజం ఆవిష్కృతం అయ్యేవరకు లెనిన్ అనే మూడక్షరాలు యావత్ సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ❑

# బురఖాలో కన్నీళ్లు 'పహెచాన్'

(32వ పేజీ తరువాయి)

మళ్లీ మన కళ్ల ముందు చూపిస్తుంది. గుజరాత్ నిజంగా ఒక పీడకల. దేశ చరిత్రలోనే మాయని మచ్చ. గుజరాత్.. ఒక అబద్ధాల ప్రయోగశాల. గుజరాత్ మధ్య యుగాల వధ్య శిల. హైదరాబాదీ ముస్లిం మహిళల లెక్కలేనన్ని విషాదాలను వాళ్ల మాటల్లోనే గీతాంజలి 'పహెచాన్'లో దృశ్య మానం చేశారు. ముస్లిమేతర మహిళ అయిన ప్పటికీ గీతాంజలి వాళ్లతో అంతగా కలగలిసి పోయి, వాళ్ల జీవితాలనే కాదు, వాళ్ల వేదనలను వాళ్ల పలుకుబడుల్లోనే చూపించడం అంత తేలికకాదు. రచయిత్రి చెప్పే మాటలు కూడా తెలుగు దక్కనీ ఉర్దూ కలగలిసిన భాషలోనే సాగుతుంది. 'పహెచాన్'లో ఉన్న పదిహేడు కథలూ ముస్లిం స్త్రీల జీవిత లోతుల్లోని భిన్న సమస్యలకు అద్దం పడతాయి. ❑


# తెలుగు సమాజ సాహిత్యాల ప్రయాణం ముందుకా, వెనక్కా?

(28వ పేజీ తరువాయి)


పెరుగుతున్నట్టున్నది. కుల వివక్ష, అసమానత, అస్పృశ్యత ఎప్పుడూ ఉన్నవే గాని, అవి ఉంటూనే కులాల మధ్య సంబం ధాలు కూడా ఉండిన స్థితి నుంచి ఎవరి కులంలో వాళ్లే సంబంధాలు పెట్టుకునే, ఒకప్పటి కొన్ని ఘెట్టోల స్థానం నుంచి ఇప్పుడు ఘెట్టోలే సర్వవ్యాపితం అయిన కాలానికి ప్రయాణిస్తున్నట్టున్నాం. మతం అన్నది మరొక కులంలా అనిపించిన చోటి నుంచి అదే సకల అంశాల నిర్ణాయక శక్తి అయిన స్థితికి చేరుకుంటున్నట్టున్నాం. పాలకవర్గాల రాజకీయాలలో కూడా ఎక్కడో ఒకచోట మంచివాళ్లకు స్థానం ఉండే చోటు నుంచి మంచితనానికీ రాజకీయాలకూ చుక్కెదురు అనే స్థితికి చేరుతున్నట్టున్నాం. డబ్బు ఉండడం సిగ్గుగా, అవమానంగా, ప్రదర్శించనక్కర లేనిదిగా ఉన్న స్థితి నుంచి గర్వంగా, ఆడంబరంగా ప్రదర్శించవలసిన స్థితికి చేరుకుంటున్నట్టున్నాం. ఇటువంటి సామాజిక మార్పులు కొన్ని దశాబ్దాలు మనందరికీ నిత్యం అనుభవంలోకి వస్తున్నవే. ఈ సామాజిక మార్పులకు అనుగుణంగానే సాహిత్యంలోనూ మార్పులు వస్తున్నట్టున్నాయి. సాహిత్యంలో సమాజం ఉండడం ఏమిటి అని నేరుగా ప్రశ్నించే స్వరాలు క్రమ క్రమంగా తీవ్రస్థాయికి చేరుతున్నాయి. సామాజిక సంస్కరణకూ, పరివర్తనకూ సాహిత్యం సాధనం అని ఆధునిక సాహిత్య ధార అంతా చెపుతుండగా, ఈ మాటలు వినబడుతున్నాయంటే కాలం నిలిచిపోయినట్టా, వెనక్కి నడుస్తున్నట్టా? ❑




అధికారంలోకి వస్తే..




మనక్కాదులే..





దేనికైనా ఘోరీ


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 2 - Issue No : 12 September 2024

## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.